అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 17-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 179 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

మోగిన మరో నగారా

హర్యానా, జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

హర్యానాలో ఒకే దశలో పోలింగ్

జమ్ముకాశ్మీర్‌లో మూడు దశల్లో..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఎందుకు ఇవ్వలేదు?

గతంలో హర్యానా, మహారాష్ట్రకు ఒకేసారి ఎన్నికలు 11లో..



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం

కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు మంత్రి పదవి

అపోజిషన్ లీడర్‌గా హరీశ్‌రావు

నలుగురు రాజ్యసభ సభ్యుల విలీనంతో కవితకు బెయిల్ : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి సంబంధించి బేరసారాలు జరుగుతున్నాయని, ఎప్పటికైనా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యమని సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఈ విలీనంలో... 2లో

ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

అన్ని రకాల మద్దతు అందిస్తాం

ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా : చైర్మెన్ యంగ్ లియూ

వివరాలు 11లో



జాతీయ ఉత్తమచిత్రం ఆట్టమ్



ఉత్తమ నటీనటులు 12లో..

రిషబ్‌శెట్టి నిత్యామీనన్ మానసి పరేఖ్

రాజుకుంటోంది

కోల్‌కతా హత్యాచార ఘటనపై భగ్గుమంటున్న దేశం



- రోడ్డెక్కిన వైద్యులు, నర్సులు
- న్యాయం జరిగేదాకా పోరాటమే : వైద్యసంఘాలు
- నేడు ఓపీ సేవల బంద్‌కు (ఐఎంఏ)పిలుపు
- కోల్‌కతాలో బీజేపీ, టీఎంసీల మధ్య ఘర్షణ

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్యశాలలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనతో దేశం భగ్గుమంటోంది. వైద్యులు, నర్సులు రోడ్డెక్కడంతో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తామంటూ వైద్యసంఘాలు అల్టిమేటం ప్రకటించాయి. ఇప్పటికే ఆస్పత్రుల్లో సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయని రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఓపీ సేవలు నిలిపివేయాలని వైద్య సంఘాలు పిలుపునిచ్చాయి. మరోపక్క హత్యాచార ఘటనను వదిలేసి కోల్‌కతాలో బీజేపీ, టీఎంసీ శ్రేణులు బాహాబాహీకి దిగటంతో రాజకీయం వేడెక్కుతోంది.

వివరాలు 3లో..

ఆనవాళ్లు చెరిపే కుట్ర



మమ్మాటికీ.. ఇది టీఎంసీ గుండాల బరితెగింపే

కాపాడాల్సిన పోలీసులే ప్రేక్షకపాత్ర వహించారు

ముఖ్యమంత్రిని కూడా విచారించాలి: బృందాకరత్ డిమాండ్

కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. పోలీసుల నిర్లక్ష్యమే దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనకు కారణమైందన్నారు. తొలుత ... 3లో



మీరేం చేస్తున్నారు..?

మమత సర్కార్‌పై హైకోర్టు మండిపాటు

ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో దుండగుల విధ్వంసంపై తీవ్రంగా స్పందన 3లో..

అశాంతి సృష్టించడానికే : మమత

రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికే బీజేపీ ఈ విధ్వంసానికి పాల్పడిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను ఈ విషయంలో విద్యార్థులు, ఆందోళన చేస్తున్న డాక్టర్లను తప్పుబట్టడం లేదని అన్నారు. ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో విధ్వంసం సృష్టించింది బయటివారేనని తెలిపారు. బాధిత మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలంటూ తాను వీధుల్లోకి రానున్నట్టు ఆమె ప్రకటించారు.



తెగ తాగేస్తున్నారు

మద్యం మత్తులో అరుణాచల్ ప్రదేశ్ ఫస్ట్

ఆ రాష్ట్రంలో 52.6 శాతం మంది మందుబాబులు

తర్వాతి స్థానంలో తెలంగాణ

ఇక్కడ 43.4 శాతం మద్యం ప్రియులు

అతి తక్కువ తాగుబోతుల రాష్ట్రంగా లక్షద్వీప్

జాతీయ కుటుంబ సర్వేలో వెల్లడి

రోడ్డుపాలవుతున్న నిరుపేద కుటుంబాలు

లాభార్జనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

దేశంలోని ఆయా రాష్ట్రాలు మద్యం మత్తులో తూగుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే మద్యం సేవించే వారి సంఖ్య గణనీయంగా ఉంది. దీంతో పొట్టకూటి కోసం కూలీనాలి చేసుకుని జీవించే కుటుంబాల పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ వ్యసనానికి బానిస కావడంతో మందుబాబుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండగా పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ చూసీ చూడనట్టు వ్యవహరిస్తోంది. దీంతో వారి చావులు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతోంది.



భారతదేశంలో జాతీయ కుటుంబ సంక్షేమంపై కేంద్ర కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సర్వే చేయించింది. జాతీయ కుటుంబ సంక్షేమ సర్వే ప్రతి మూడేండ్లకోసారి నిర్వహిస్తారు. మార్చి 2022లో ప్రచురితమైన ఈ అధ్యయనం 2019 నుంచి 2021 వరకు మూడేండ్ల డేటాను తెలియజేస్తున్నది. ఈ సర్వేలో మద్యం వినియోగానికి సంబంధించి ఆసక్తికర విషయాలు ... 11లో

ఎల్‌ఆర్ఎస్ తీసుకోండి

కీలక ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్టర్ చేసిన లేఅవుట్లకే అనుమతి

పాత దరఖాస్తుదారులకే వర్తింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకొని, వివిధ కారణాలతో నిలిచిపోయిన ఫైళ్లను క్లియర్ చేసేలా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఎల్ఆర్ఎస్ సంబంధించిన గైడ్‌లైన్స్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 2020 ఆగస్టు 26వ తేదీ కంటే ముందు రిజిస్టర్ చేసిన అనుమతిలేని, చట్టవిరుద్ధమైన లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనేలా తాజా ఉత్తర్వులు విడుదల చేశారు. దీనికి సంబంధించి 2020 అక్టోబర్ 15 వరకు వచ్చిన దరఖాస్తులకు కూడా ఎల్ఆర్ఎస్ ... 11లో

ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం సక్సెస్

ఇస్రో ఖాతాలో మరో ఘనత



శ్రీహరికోట : ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మొత్తం 17 నిమిషాల పాటు ఈ ప్రయోగం సాగింది. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని ... 11లో

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

27 వరకు నిర్వహణ

సమయపాలనలో మార్పు

మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పరీక్షలు

నేటినుంచి వెబ్‌సైట్‌లో నమూనా జవాబు పత్రాలు : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు అక్టోబర్ 21 నుంచి ప్రారంభమవుతాయి. అదేనెల 27 వరకు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షల సమయపాలనలో మార్పులు ... 10లో

నిబంధనలకు సెబీ చీఫ్ పాతర

- కన్సల్టెన్సీతో ఏడేండ్లుగా ఆదాయం : డాక్యుమెంట్లతో వెల్లడించిన రాయిటర్స్
- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌కు మరింత బలం
- మరిన్ని చిక్కుల్లో మాధాబీ బచ్ కుటుంబం

న్యూఢిల్లీ : విదేశాల్లోని అదానీ అనుబంధ సంస్థల్లో సెబీ చైర్‌పర్సన్ మాధాబీ పురీ బచ్, ఆమె భర్త ధావల్ బచ్ పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఇటీవల ఓ రిపోర్ట్‌లో తెలిపింది. బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో బచ్ కుటుంబం పెట్టుబడులను కలిగి ఉందని తెలిపింది. అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్‌పర్సన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయని.. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. సెబీ



చైర్‌పర్సన్‌గా కొనసాగుతూనే మాధాబి కన్సల్టింగ్ సంస్థలను నడుపుతున్నారని..ఈ నిజాలను నిగ్గు తేల్చాలని హిండెన్‌బర్గ్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ తరుణంలో రాయిటర్స్ తాజా రిపోర్ట్ హిండెన్‌బర్గ్ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది.

సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా పార్ట్‌నర్స్, భారత్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా అడ్వైజరీ సంస్థలను మాధాబీ పురీ బచ్ దంపతులు నిర్వహిస్తున్నారని హిండెన్ బర్గ్ ఆరోపించింది. రాయిటర్స్ ప్రకారం.. "గడిచిన ఏడేండ్ల కాలంలో అగోరా అడ్వైజరీ సంస్థలో 99 శాతం వాటాలు బచ్ దంపతులవే. దీని ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం సంపాదించారని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీల వద్ద నమోదైన సమాచారం బయటపడింది. సెబీ పూర్తికాల సభ్యులుగా నియమితులైన తర్వాత ఆఫీస్ అఫ్ ప్రాఫిట్ గానీ, వేతనం గానీ, ఇతర వృత్తి నైపుణ్య ... 11లో

తీవ్రమైన ఉల్లంఘన

బచ్ పదవీకాలంలో సెబీ బోర్డు సభ్యుడుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ మాజీ కీలక అధికారి సుభాష్ చంద్ర గార్గ్ సెబీ చీఫ్ మాధాబీ చర్యలను తీవ్రంగా విమర్శించారు. మాధాబీ వ్యాపార కార్యకలాపాలను చాలా తీవ్రమైన ఉల్లంఘనగా అభివర్ణించారు. సెబీ బోర్డులో చేరిన తర్వాత ఆమె బయటి సంస్థను కొనసాగించడానికి ఎటువంటి సమర్థన లేదు. విషయం బయటికి వచ్చిన తర్వాత ఆమెను కొనసాగించడాన్ని అనుమతించకూడదని అన్నారు. ఆమె తన వ్యాపార ప్రయోజనాలను బోర్డుకు తెలుపలేదన్నారు. కాగా.. రాయిటర్స్ రిపోర్ట్‌పై సెబీ, బచ్ కుటుంబం కానీ స్పందించలేదు.

- సుభాష్ చంద్ర

అమరవీరులకు అవమానం

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్థూపం పక్కన చెత్తకుండీలు
జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం
వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర నడిబొడ్డులో అమరవీరులకు తీవ్ర అవమానం జరుగుతోంది. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. అభివృద్ధి చేయాల్సిన విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా.. ఆ పక్కనే చెత్త కుండీలను పెట్టారు. 2000లో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ దగ్గర పోలీస్ కాల్పుల్లో ముగ్గురు అమరులైన విషయం తెలిసిందే. వారి స్మారకంగా బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసింది. స్థూపం వద్ద ప్రతి సంవత్సరమూ ఆగస్టు 28న సభలు, నిరసన కార్యక్రమాలు జరుగుతాయి. ఇంతటి ప్రాముఖ్యత కల్గిన ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ చేపట్టిన 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమంలోనైనా దృష్టి సారించలేదు. పైగా.. విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపం పక్కనే చెత్తకుండీలను ఏర్పాటు చేశారు. స్మారక స్థూపం ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరవీరుల స్మారక స్థూపాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్మారక స్థూపం ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జూన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా, స్థూపం పక్కనే జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు మూడు చెత్త బాక్సులతో కూడిన ఐరన్ స్టాండ్స్ ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఆ ప్రాంతంలో చెత్తాచెదారంతో పరిసరాలన్నీ కంపుకొడు తున్నాయన్నారు.

చనిపోయిన పావురాలను సైతం అక్కడే పడేస్తున్నారని తెలిపారు. స్మారక స్థూపం పక్కన చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడం జీహెచ్ఎంసీ అధికారుల పూర్తి అనాలోచిత చర్యలని విమర్శించారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి స్మారక స్థూపం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, ఫెన్సింగ్, గేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ట్విట్టర్‌లో వినతిపత్రాన్ని పంపించారు.

ముఖ్యమంత్రి గారూ.. మాట నిలబెట్టుకోండి..

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- 'ప్రజాపాలన'లో ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డికి వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని, తక్షణమే తమను రెగ్యులర్ చేయాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు గంగుల కృష్ణారెడ్డి, తీరందాసు సంతోష్‌కుమార్, మొగిలిచర్ల శ్రీనివాస్, రాధారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన ఉద్యోగులు వినతి పత్రాలను సమర్పించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు 15 ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 13న తాము ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలను సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు సందర్శించారని గుర్తు చేశారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ఆనాడు హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తక్షణమే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షకు సంబంధించిన 11 విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణన జరగాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- లేదంటే 42 మందితో ఆమరణ నిరాహార దీక్ష : విలేకర్ల సమావేశంలో ఆర్ కృష్ణయ్య వెల్లడి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎవరూ అడగకముందే కాంగ్రెస్ జనగణన, బీసీ కులగణన చేపడతామని కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించిందనీ, ఆ వాగ్దానం ఎక్కడ పోయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో బీసీ సంఘాల నేతృత్వంలో జన సభ రాజారాం యాదవ్ అధ్యక్ష తన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నిల షెడ్యూల్‌ను ప్రకటించే లోపే 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలనీ, లేదంటే.. షెడ్యూల్ ప్రకటించగానే 42మందితో సామూహిక ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. బీసీ కుల గణన చేస్తామంటూ కాంగ్రెస్ నమ్మబలికిందని విమర్శించారు. ఆ పార్టీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తే..పలు అనుమానాలు కలుగు తున్నాయని చెప్పారు. ఉద్యమమనే ముల్లుకర్రతో ప్రభుత్వాన్ని కదిలించాలని బీసీలకు పిలుపునిచ్చారు. దేశాన్ని, రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలించిన అగ్రవర్ణాల వారు, బీసీలు రాజ్యాధి కారాన్ని కావాలంటే..ఎలా ఒప్పుకుంటారని ప్రశ్నించారు. ఇది ఎవరో ఇస్తే వచ్చేది కాదనీ, రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన బీసీలకు రావాల్సిన వాటా అని తెలిపారు. ఆత్మగౌరవం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ఇంకెన్ని రోజులు ఈ దొరతనాన్ని, పెత్తనాన్ని సహిద్దామంటూ ప్రశ్నించారు. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వటం వల్ల ప్రభుత్వానికి నష్టమేమీ లేదని చెప్పారు. విలేకర్ల సమావేశంలో హిందూబీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిడికిలి రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనాన్ని' హరేరామ హరేకృష్ణకు ఇవ్వొద్దు

- సమస్యల పరిష్కారం కోసం

21న విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలనీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లతో ఈ నెల 21న మధ్యాహ్న భోజన కార్మికులు వంటను బంద్‌పెట్టి హైదరాబాద్‌లోని విద్యా శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికే కొడంగల్‌లో సెమీ రెసిడెన్షియల్ పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 25 వేల పాఠశాలల్లో, 24 లక్షల మంది విద్యార్థులకు వేడివేడి భోజనం వండి పెడుతున్నారని పేర్కొన్నారు. వారు 24 ఏండ్లుగా అనేక కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తున్నారనీ, వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతుల వారే ఉన్నారని వివరించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇస్తే 54 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని వాపోయారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన రూ.10 వేలను వెంటనే అమలు చేయాలనీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలనీ, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీపై ఇవ్వాలని విన్నవించారు. అక్రమ తొలగింపులు అరికట్టాలనీ, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీపై దృష్టి మరల్చే యత్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయటంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ విషయంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అందుకే ఖమ్మం జిల్లా పర్యటనలో ఆయన గావుకేకలు, పెడబొబ్బలు పెట్టారని ఎద్దేవా చేశారు. కేవలం 40 శాతం మంది రైతులకే రుణమాఫీ చేసి, అందరికీ చేసినట్టు ఊదరగొడుతున్నారని దుయ్యబట్టారు. ఈ అంశంపై చర్చించేందుకు సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తోపాటు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటిద్దామంటూ సీఎంకు సూచించారు. ఆ రకమైన చర్చకు సిద్ధమా అని రేవంత్‌కు సవాల్ విసిరారు. ఏ ఒక్క గ్రామం, మండలంలోనైనా నూటికి నూరు శాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాననీ, రాజకీయాలు మానేసి, ఇంట్లో కూర్చుంటానని వ్యాఖ్యానించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాసగౌడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, తాతా మధు తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామంటూ చెప్పటం ద్వారా కాంగ్రెస్ రైతులను మోసం, దగా చేసిందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అనేది భారతదేశంలోనే అతి పెద్ద జోకంటూ ఎద్దేవా చేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తామంటూ నమ్మబలికిన సీఎం... రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని మోసం చేసిన పాపానికి ఆయనపై చీటింగ్ కేసు పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఇదే అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిసెంబరు 9న ఒకే ఒక్క సంతకంతో రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటూ చెప్పిన సీఎం, బీఆర్ఎస్ హయాంలో ఆ పథకాన్ని పొందిన రైతులకు కూడా దాన్ని వర్తింపజేస్తామంటూ ప్రకటించారని గుర్తు చేశారు. ఒకే ఒక్క ఏడాది ప్రభుత్వం, తాను కడుపుకట్టుకుంటే రూ.40 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేయటం పెద్ద కష్టమేమీ కాదంటూ ఆయన ప్రగల్భాలు పలికారని అన్నారు. ఆ తర్వాత అదే ముఖ్యమంత్రి రుణమాఫీకి రూ.35 వేల కోట్లు అవసరమవుతాయంటూ పేపర్లకు లీకులిచ్చారని దెప్పిపొడిచారు. ఆ తర్వాత ఆ లెక్కమారిందనీ, రుణమాఫీకి రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయంటూ క్యాబినెట్‌లో తీర్మానించారని వివరించారు. చివరకు రూ.17,934 కోట్లే విడుదల చేశారని విమర్శిం చారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ అని చెప్పిన ముఖ్యమంత్రి, ఆ తర్వాత కొందరికే అనటం దారుణమని వాపోయారు. అనవసర కొర్రీలు, షరతులు, నియమ నిబంధనలు పెట్టటం ద్వారా 60 శాతం మంది రైతులకు రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా ఆ పథకం ఫెయిల్ కావటంతో రుణమాఫీ సభకు రావాల్సిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం డుమ్మా కొట్టారని ఎద్దేవా చేశారు. మరోవైపు తన విదేశీ పర్యటన విఫలం కావటంతో సీఎం తీవ్ర అసహనానికి లోనై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఆయన గత ఎనిమిది నెలల కాలంలో 19 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారని విమర్శించారు. ఇంకెన్నిసార్లు అక్కడకు వెళతారోనంటూ సెటైర్లు విసిరారు. ఇటీవల బీఆర్ఎస్ అంతర్గత సమావేశంలో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'పై తాను చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఈ సందర్భంగా విచారం వెలిబుచ్చారు. 'నా అక్క చెల్లెళ్లకు క్షమాపణలు చెబుతున్నా...' అని వ్యాఖ్యానించారు. తనకు ఎవ్వరినీ కించపరిచే ఉద్దేశం లేదనీ, యధాలాపంగా మాట్లాడానని తెలిపారు. తనకున్న సంస్కారం, హుందాతనం సీఎంకు లేకపోవటం వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి ఆయన ఇంత వరకూ క్షమాపణలు చెప్పలేదని విమర్శించారు.

పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసి, దానిన బలోపేతం చేసేందుకు వీలుగా సెప్టెంబరులో ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళుతున్నట్టు కేటీఆర్ తెలిపారు. తద్వారా ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల పనితీరును పరిశీ లిస్తామని చెప్పారు. తద్వారా బీఆర్ఎస్ కమిటీల్లో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు కేంద్రంలో మంత్రి పదవి, అపోజీషన్ లీడర్‌గా హరీశ్‌రావుకు పదవులు దక్కనున్నాయని చెప్పారు. ఇక రాజ్యసభలోని నలుగురు బీఆర్ఎస్ ఎంపీల విలీనానికి సమానంగా లిక్కర్ కేసులో కవితకు బెయిల్ రానుందన్నారు. అలాగే కవితకు రాజ్యసభ పదవి వస్తుందని కామెంట్ చేశారు. చిట్ చాట్‌లో భాగంగా రేవంత్ బీజేపీ, బీఆర్ఎస్ విలీనంపై స్పందించారు.

వాళ్లకే కార్పోరేషన్ పదవులు...

కాంగ్రెస్‌లో పార్టీ నేతలకే కార్పోరేషన్ పదవులు ఇస్తామని సీఎం అన్నారు. ఈ కార్పోరేషన్ పదవులు మూడేండ్లేనని... ఇప్పటి వరకు పార్టీలోని పలువురికి అవకాశం కల్పించామన్నారు. మిగిలిన వారికి నెక్స్ట్ రౌండ్‌లో ఛాన్స్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. మూడేండ్లు పీసీసీగా తన బాధ్యతను సక్రమంగా నిర్వహించానన్నారు. ఇప్పుడు ఆ బాధ్యతను అధిష్టానం ఎవరికైనా అప్పగించవచ్చున్నారు. తనను పీసీసీగా నియమించే టైంలో ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదని... ఇప్పుడు అలాగే ఉంటుందన్నారు. పార్టీ నియమించనంత వరకు తమ అభిప్రాయాలు చెప్తామని... . ఇచ్చిన తర్వాత ఎవరైనా తమ మనిషే అని చెప్పుకొచ్చారు.

102 జీవోకు మార్గదర్శకాలు విడుదల

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 102ను అమలు చేసేందుకు మార్గదర్శకాలు ఇవ్వటం హర్షణీయమని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వృత్తి సమస్యలను వివరించటంతో ఆయన సాను కూలంగా స్పందించారని తెలిపారు. వెంటనే మార్గదర్శకాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ (ఆస్పత్రులు, పోలీస్ శాఖలు, గురుకుల పాఠశాలలు, వివిధ దేవస్థానాలు, గెస్ట్ హౌస్)ల్లో వృత్తిపని రజక సొసైటీలకే ఇవ్వాలని గత ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ మార్గదర్శకాలు లేక అమలు కాలేదని తెలిపారు. ఆయా ప్రభుత్వ సంస్థల్లో వృత్తిపనిని కాంట్రాక్టర్లు చేస్తున్నారని తెలిపారు. దీంతో వేలాది మంది వృత్తి దారులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందుకనుగుణంగా మార్గదర్శకాలు విడుదల చేయటం హర్షణీయమని తెలిపారు.

పోలీస్‌నంటూ బెదిరింపులు

- తనిఖీల పేరుతో వసూళ్లు
- ఇరానీ గ్యాంగ్‌కు చెందిన నకిలీ పోలీస్ అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీస్‌నంటూ అమాయకులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇరానీ ముఠాకు చెందిన వ్యక్తిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.95వేలు, (నకిలీ) పోలీస్ ఐడీ కార్డుతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు.

బీదర్‌కు చెందిన జాఫర్ అలీ అలియాజ్ లంబూ పాత నేరస్థుడు. సులువుగా డబ్బులు సంపాదించాలని హైదరాబాద్‌కు వస్తూ పోతుంటాడు. నగరానికి వచ్చిన సమయంలో బ్యాంక్‌లు, రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు ఆర్థిక లావాదేవీలు జరిగే ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రత్యేక నిఘా వేస్తాడు. ఎవరైనా బ్యాగ్‌లో, కవర్‌లో డబ్బులు తీసుకెళ్తుంటే గమనించి వారిని అడ్డుకుంటాడు. పోలీస్‌నంటూ తనిఖీల పేరుతో వారి నుంచి డబ్బులు తీసుకుంటాడు. వాటిని లెక్కిస్తున్నట్టు నటించి వారి దృష్టిని మళ్లించి కొంత డబ్బులను కొట్టేస్తాడు. అనుమానం రాకుండా మిగిలి డబ్బులను తిరిగి ఇచ్చేస్తాడు. ఇదే తరహాలో నగరంలో ఐదుగురిని మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన టాస్క్‌ఫోర్సు పోలీసులు సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడిని అరెస్టు చేసి విచారించారు. దాంతో నిందితుడు ఇరానీ గ్యాంగ్ సభ్యుడిగా తేలింది. నిందితుడిపై బీదర్, బెంగళూర్‌తోపాటు బేగంబజార్, సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్, కుస్నుంపురా లంగర్‌హౌజ్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని డీసీపీ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, SIDDIPET DISTRICT, AT: SIDDIPET

IA No. 262 OF 2024
IN
OS. No. 08 OF 2024

Between:
Sri. Krishna Ashili ....Petitioner/Plaintiff
AND
Ashili Papaiah & Others .....Respondent's/Defendant's

Whereas Petitioner/Plaintiff has filed a suit against the respondents/Defendant's for DECLARATION and Declare the RREGISTERED DOCUMENTS AS NULL & VOID the Respondnet's/defendant's No.4,5,7,13,20 herein. The respondent's/defendant's no. 4, 5, 7, 13,20 i.e., 4. Kesari Jyothsna, Wife of Santhosh, Aged: 43 years, Occupation: House wife, R/o: Flat no. 202, Delight Apartments, Opposite Housing Board colony, Mahashakthi nagar, Siddpet-502103, 5. Sri.Kandlapally Laxman, S/o. Rajaiah, Aged: 46 Years, Occupation: Civil Contractor, R/o: H.No.17-166/1A, Srinagar Colony, Siddpet-502103, 7. Sri.Bheemreddy Madhumohan, Son of Narsi Reddy, Aged: 60 Years, Occupation: Civil Contractor, R/o: H.No.4-41/50/1, Plot no.363, Papireddy Nagar, Kukatpally, Hyderabad, 13. Smt. Joopally Bhagya sri, W/o. Rameshwar Rao, Aged: 41 Years, Occupation: House wife, R/o: H.No.18-22/1, Sri sai Nursing Home, Prashanth Nagar, Siddipet District, 20. Smt. Ponuganti Shakuntala, S/o Sudhakar, Aged: 56 Years, Occupation: House wife, R/o: H.No. 17-186/3, Sai priya Residency, 2nd Floor, Plot no.S2, Shivaji nagar, Siddipet District.

The aforementioned Respondent's /defendant's No.4,5,7,13,20 are trying to avoid summons from the Hon'ble Court inspite of the best efforts of the petitioner/plaintiff. That the Hon'ble Court by its Order in IA.NO. 262 OF 2024 on dated.31.07.2024 has directed the petitioner/plaintiff to publish the notice in Telugu News paper Nava Telangana.

That the Respondent's/defendant's No.4,5,7,13,20 are hereby summoned to appear before the Hon'ble II Addl Senior civil judge Court, Siddipet district, At: Siddipet, in person or counsel on 03. 09. 2024 at 10.30 AM or else the Hon'ble Court will proceed with the I.A and suit exparte, and will be heard and adjudicated in your absence. Hence this notice.

(By order of the Hon'ble Court)
J.ANJANEYULU,
Advocate

kotak కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: 27బికెసి, సి 27, జి బ్లాక్, బంద్రా కుర్ల కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబయి-400051
కార్పొరేట్ ఆఫీసు: కోటక్ ఇన్ఫినిటి, బిల్డింగ్ నెం.21, ఇన్ఫినిటి పార్క్, జెనరల్ ఎకె వైద్య మార్గ్, మలాడ్ (ఈస్ట్), ముంబయి-400097. www.kotak.com

వేలం- ప్రకటన

దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత/లు దిగువ సూచించినట్లు బంగారు ఆభరణాలు/ వస్తువుల హామీపై బంగారు రుణ సదుపాయం పొందియున్నారు. రుణగ్రహీత/లు వాయిదాలు మరియు బాకీయున్న బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో డీఫాల్టైనందారు మరియు ఫలితంగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత/లను కోరుతూ బ్యాంకు నోటీసులను జారీచేసింది. అయితే, రుణగ్రహీత/లు వారిబాకీయున్న బకాయిలను తిరిగిచెల్లించుట/ క్లియర్ చేయుటలో విఫలం చెందియున్నందున, బ్యాంకుపేరున తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను బ్యాంకు వేలం వేస్తుంది. దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాలవేలం దిగువ ఇచ్చిన ప్రదేశాల వద్ద నిర్వహించబడును.

దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం తేదీ/తర్వాత ఇక్కడ నిర్వహించబడుతుంది:-
తేదీ: 27 ఆగస్టు - 2024, సమయం: ఉ.11.00 గం.లకు, ప్రదేశం: సంబంధిత బ్రాంచ్ ఆవరణలలో

ApplApac	వినియోగదారుని పేరు	రాష్ట్రం	సబ్ లొకేషన్	బ్రాంచి పేరు	స్థూల బరువు	వేలం తేది
GLN2987412	చింతకుంట్ల రాజేష్	తెలంగాణ	హైదరాబాద్	బకాన్‌బుల్త్	22.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3200775	లీతు బాటి	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	35.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3019931	మహ్మద్ బిలాయ్ అహ్మద్	తెలంగాణ	హైదరాబాద్	మలక్‌పేట్	98.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2997921	నయనేని నవీన్‌రావు	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	28.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2862910	తోరం విపి మణికంఠ స్వామి	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	52.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3263659	అల్లగడ్డ పద్మావతి	తెలంగాణ	హైదరాబాద్	మల్కాజ్‌గిరి	123.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2988413	అరేటి భరత్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	10.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2883448	అపూర్వ నిషాంత్‌రెడ్డి	తెలంగాణ	హైదరాబాద్	దిల్‌సుఖ్‌నగర్	13.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2097172	బండారు రాఘవేంద్ర స్వామి	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	39.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2916818	భరద్వాజ్ బాల సింగ్	తెలంగాణ	హైదరాబాద్	నిజామాబాద్	27.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3261232	బెండడి ప్రత్యూష	తెలంగాణ	హైదరాబాద్	హిమాయత్‌నగర్	113.40	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3261251	బెండడి ప్రత్యూష	తెలంగాణ	హైదరాబాద్	హిమాయత్‌నగర్	112.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3261266	బెండడి ప్రత్యూష	తెలంగాణ	హైదరాబాద్	హిమాయత్‌నగర్	331.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3172641	బోజుగొల్ల రాధ	తెలంగాణ	హైదరాబాద్	ఆర్మూర్	222.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3138670	బుద్ద రంజిత్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	ఎస్ఎవిఎస్ రోడ్డు	11.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3120699	సిహెచ్ దాసరి శ్రీరాములు	తెలంగాణ	హైదరాబాద్	మల్కాజ్‌గిరి	11.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3272106	చల్లగుల్ల దీప్తి	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	570.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3076471	దామర్తి శ్రీనివాస్	తెలంగాణ	హైదరాబాద్	మిర్యాలగూడ	40.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2985647	చందన్ పట్నాయక్	తెలంగాణ	హైదరాబాద్	బోయిన్‌పల్లి	60.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2892879	చట్టిరెడ్డి యల్లారెడ్డి	తెలంగాణ	హైదరాబాద్	రామంతపూర్	67.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2893026	చట్టిరెడ్డి యల్లారెడ్డి	తెలంగాణ	హైదరాబాద్	రామంతపూర్	55.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3245747	చౌహాన్‌సునీల్	తెలంగాణ	హైదరాబాద్	కెపిహెచ్ హిల్స్	25.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3062012	దామ్లు నాయక్ ఎస్	తెలంగాణ	హైదరాబాద్	బకాన్ బుల్త్	10.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3052955	దీప్తి మహీ బహేరా	తెలంగాణ	హైదరాబాద్	సోమాజిగూడ	17.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3060619	ఎద్ల సుధాకర్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	20.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3262610	ఎర్రటి శ్రీకర్	తెలంగాణ	హైదరాబాద్	ఆర్మూర్	20.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3010707	గణేష్ బండారి	తెలంగాణ	హైదరాబాద్	మంచిర్యాల	63.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3167330	గంగారపు అకిల్	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	17.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3080315	గుంజ సైదా	తెలంగాణ	హైదరాబాద్	ఖమ్మం	49.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3071351	జాను లీలా ప్రతాప్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	45.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2826840	కె. మురళి బాబు	తెలంగాణ	హైదరాబాద్	దిల్‌సుఖ్‌నగర్	77.20	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3160946	కలారి వెంకట్ దుర్గా	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	34.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2124808	కంకణాల రమ్య	తెలంగాణ	హైదరాబాద్	బంజారాహిల్స్	55.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2998193	కనుమూరి శివగంగ రాజు	తెలంగాణ	హైదరాబాద్	కెపిహెచ్‌హిల్స్	45.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3167194	కర్రి శ్రీను	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	54.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3276558	కొడుగుంటి అరుణ	తెలంగాణ	హైదరాబాద్	మంచిర్యాల్	27.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3182943	కొల్ల నాగవాణి	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	107.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2752589	కోన జోష్న నికాడమస్	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	12.20	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2789135	కోన జోష్న నికాడమస్	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	34.40	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2969760	కోన జోష్న నికాడమస్	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	67.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3088090	కొండబాల మనీషా	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	53.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3229499	కోత్రపేటి వంశీ	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్ర	257.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2982031	కుంచాల నాగ శ్రీను	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	51.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3070959	లక్ష్మీ నాయక్	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	39.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2851283	ఎం. శ్రీ త్రిష్ణవేణి	తెలంగాణ	హైదరాబాద్	రామంతాపూర్	70.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2881190	మధుచిట్టి ఇంద్రజ	తెలంగాణ	హైదరాబాద్	సోమాజిగూడ	27.20	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3183047	మేడిపల్లి పవన్	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	18.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2834710	మహేష్ చంద్ర కె.	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	39.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3024480	మట్ల శ్రీనిధి	తెలంగాణ	హైదరాబాద్	రామంతాపూర్	118.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2867668	ఎండి. గౌసోద్దీన్	తెలంగాణ	హైదరాబాద్	కరీంనగర్	117.20	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3163244	మేకల సరిత	తెలంగాణ	హైదరాబాద్	బంజారాహిల్స్	30.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2913535	మహ్మద్ అబ్దుల్ రఫ్	తెలంగాణ	హైదరాబాద్	హఫీజ్‌గూడ	46.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2940583	మహ్మద్ అబ్దుల్ రఫ్	తెలంగాణ	హైదరాబాద్	హఫీజ్‌గూడ	32.40	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3273000	మహ్మద్ జానిద్	తెలంగాణ	హైదరాబాద్	అక్బర్‌షా ప్లాజా	53.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3059073	ముదావత్ ఐశ్వర్యా	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	20.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2087184	మహ్మద్ అఫ్సర్	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	31.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3054118	మూల సింధూ	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	76.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3248865	మునుగూరు రాధక్రిష్ణ	తెలంగాణ	హైదరాబాద్	మలక్‌పేట్	43.30	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3051226	నాయుడు మునలయ్య	తెలంగాణ	హైదరాబాద్	సరూర్‌నగర్	13.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3260062	నరేందర్ రాపర్తి	తెలంగాణ	హైదరాబాద్	సికింద్రాబాద్	24.50	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3045319	పద్మాటి ఐలేష్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	43.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3188167	పానుగంటి మాధవి	తెలంగాణ	హైదరాబాద్	రామంతపూర్	9.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3024607	పాసుల రేణు	తెలంగాణ	హైదరాబాద్	కెపిహెచ్‌హిల్స్	20.40	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2864328	ప్రసాద్ కంచుగంట్ల	తెలంగాణ	హైదరాబాద్	ఎఎస్‌రావునగర్	10.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2883172	ప్రసాద్ కంచుగంట్ల	తెలంగాణ	హైదరాబాద్	ఎఎస్‌రావునగర్	13.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2952853	రాధిక శివ శర్మ	తెలంగాణ	హైదరాబాద్	దిల్‌సుఖ్‌నగర్	41.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3246752	రాఘవేంద్ర కె	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	15.80	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3095124	రావుల అరుణ్‌కుమార్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	9.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2097080	సల్లా అమరేందర్‌రెడ్డి	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	61.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3248344	సరోజదేవి పుష్పల	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	39.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2818742	షేక్ చంద్ బాష	తెలంగాణ	హైదరాబాద్	మిర్యాలగూడ	7.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3248942	శ్రీకొండ సాయి జగన్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	28.20	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3018776	శ్రీశైలం దొంతి	తెలంగాణ	హైదరాబాద్	రామంతాపూర్	29.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3185198	ఉమా కురపాటి	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్ర	250.60	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3185237	ఉమా కురపాటి	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్ర	370.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2725487	వంగాల మహేష్	తెలంగాణ	హైదరాబాద్	మిర్యాలగూడ	52.00	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2839807	వంగపల్లి మీనాకుమార్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	134.10	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3051375	వర్మా సంతోష్‌కుమార్	తెలంగాణ	హైదరాబాద్	శంషాబాద్	9.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN2813487	వాసిపల్లి కొండదరావు	తెలంగాణ	హైదరాబాద్	మలక్‌పేట్	12.70	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3008701	విజయ్ కుమార్ కొండబత్తుల	తెలంగాణ	హైదరాబాద్	రామంతపూర్	24.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3250750	విజయలక్ష్మీ ముదిరాజ్‌రాగుల	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్రాసెంట్	16.90	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3217291	ఎర్ర జయ నాగేంద్రం	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	47.40	27-08-2024 : తేదీన/తర్వాత
GLN3243040	యోగేశ్ కూన	తెలంగాణ	హైదరాబాద్	ఎఎస్‌రావునగర్	81.40	27-08-2024 : తేదీన/తర్వాత

వేలం రోజున రెండు ఇటీవలి ఫోటోగ్రాఫులతో పాటు వెరిఫికేషన్ కొరకు వారి ఒరిజినల్‌తోపాటు వారి ఫోటో-గుర్తింపు, సంతకం మరియు నివాస రుజువు యొక్క కాపీని దాఖలు చేయవలసిందిగా బిడ్డరుదారులను కోరబడుచున్నది. బిడ్డరుదారులకు ఏ విధమైన నోటీసు ఇవ్వకుండానే వేలంనిర్వహించు యొక్క వేదిక/ తేదీ/ సమయం మార్చుచేయు లేదా రద్దుచేయు అధికారాలను బ్యాంకు కలిగియుంటుంది.
వేలం ప్రక్రియ యొక్క ఖర్చును వినియోగదారుని ఖాతాకు డెబిట్ చేయబడుతుంది. ఖాతా మొత్తానికి బిడ్ మొత్తం సరిపోని విషయంలో మిగతా మొత్తాన్ని వినియోగదారుని నుండి రికవరీచేయు అధికారాలు బ్యాంకు కలిగియుంటుంది.
వేలం నియమ & నిబంధనలకు సంబంధించి ఏవేని తదుపరి వివరాల కొరకు, మీరు దిగువ పేర్కొన్న వ్యక్తి/లను సంప్రదించవలసిందిగా కోరబడుచున్నది.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, ఫోన్: 9700699936

ఎర్రకోట వేదికగా...

గత పదేండ్లలో ఒక్కోసారి ఒక్కో అంశాన్ని హైలెట్ చేస్తూ ప్రసంగం



ఆచరణలో మాత్రం కనబడని వేగం : నిపుణులు, మేధావులు

న్యూఢిల్లీ : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెహ్రూ, ఇందిరా గాంధీల తర్వాత వరుసగా 11వసారి ఎర్రకోట నుంచి జాతీయ జెండాను ఎగరవేశారు మోడీ. అనంతరం ఆయన జాతినుద్దేశిస్తూ ప్రసంగించారు. అయితే, గతంలోనూ ఆయన జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కొన్ని ప్రకటనలు చేయటం, వాగ్దానాలివ్వటం, పథకాలను ప్రకటించేవారు. ఎర్రకోటను బీజేపీ సైద్ధాంతికతను నొక్కి చెప్పటానికి కూడా వేదికగా ఉపయోగించుకునేవారు. గత పదేండ్లలో ఆయన ప్రసంగాలలో కీలకాంశాలపై దృష్టి సారిస్తే.. ఒక్కో సారి ఒక్కో అంశాన్ని హైలెట్ చేయటం కనిపిస్తుంది.

2014 ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు మోడీ. అయితే, ఆ ఏడాది తొలిసారిగా ఎర్రకోట పైనుంచి జెండాను ఎగురవేసి ప్రసంగించారు. తనను తాను ఉన్నత వర్గాల నుంచి ఒంటరిగా ఉన్న వ్యక్తిగా మోడీ ప్రకటించుకున్నారు. తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోడీ తన పూర్వీకులను గుర్తించారు. అందరు ప్రధానులు, అన్ని ప్రభుత్వాలు, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల సహకారం కారణంగా దేశం ఎలా వెనకకు పోయిందోనన్న విషయం వివరించారు. జన్-ధన్ యోజన, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, సన్సద్ ఆదర్శ్ గ్రామ్ యోజన, నిటి ఆయోగ్‌తో ప్రణాళికా సంఘాన్ని భర్తీ చేయటం వంటి ఏడు కార్యక్రమాలను ప్రకటించారు.

2015లో తన రెండో ప్రసంగంలో, మోడీ కొన్ని పథకాలను ప్రకటించారు. స్టార్ట్-అప్ ఇండియా, స్టాండ్-అప్ ఇండియా, రాబోయే 1,000 రోజుల్లో 18,000 గ్రామాలకు విద్యుదీకరణ, సీ అండ్ డీ సమూహాలలో ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలను రద్దు చేయటం, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చిన వారసత్వ సమస్యలను పరిష్కరించటం వంటివి ఇందులో ఉన్నాయి. ప్రత్యేకించి, సాయుధ బలగాలకు వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను అంగీకరిస్తున్నట్టు ప్రకటించాడు. వేలం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం ద్వారా సహజ వనరులైన బొగ్గు, ఖనిజాలు, స్పెక్ట్రమ్ కేటాయింపులో గందరగోళాన్ని ఎలా తొలగించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. 15 నెలలు గడిచినా ప్రభుత్వంపై ఒక్క అవినీతి మచ్చ కూడా లేదని ఆయన అన్నారు.

2016లో...

ప్రధాని కొత్త ప్రకటనలకు దూరంగా ఉన్నారు. బదులుగా తన వాగ్దానాల పంపిణీలో తన ప్రభుత్వ రికార్డును అంచనా వేశారు. 2017లో ఎర్రకోట నుంచి ఆయన తన నాలుగో ప్రసంగంలో ఒకే ఒక ప్రకటన ఉంది. శౌర్య పురస్కార విజేతల పరాక్రమాన్ని అందించడానికి వెబ్‌సైట్‌ను ప్రారంభించడం.

2022 నాటికి 'మెజెస్టిక్ ఇండియా' లక్ష్యాలను నిర్దేశించాలని కూడా మోడీ ఎంచుకున్నారు. పేదలకు పక్కా గృహాలు, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటం, యువత, మహిళలకు తగినంత అవకాశాలు, అవినీతి, బంధు ప్రీతితో రాజీలేని భారతదేశం, తీవ్రవాదం, మతతత్వం, కులతత్వం నుంచి విముక్తి పొందటం వంటివి ఆయన ప్రకటనలో ఉన్నాయి.

2019లో...

సార్వత్రిక ఎన్నికలకు ముందు తన ప్రసంగంలో కొన్ని ప్రటకనలు చేశారు. టాయిలెట్ కవరేజ్, ఎల్పీజీ కవరేజ్, విద్యుదీకరణ రంగాలలో తన నాలుగు సంవత్సరాల అధికారంలో సాధించిన లాభాలను హైలైట్ చేసి.. తన ప్రసంగాన్ని ముగించాడు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో మరింత ఎక్కువ మెజారిటీతో తిరిగి వచ్చిన తర్వాత.. ప్రధాని మోడీ తన కొత్త పదవీకాలంలో తన మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని తన ప్రభుత్వ సైద్ధాంతిక ఎజెండాను వివరించడానికి ఉపయోగించారు.

2020లో....

కరోనావైరస్ మహమ్మారి గరిష్ట స్థాయికి చేరుకోవటంతో.. ఈ కార్యక్రమానికి భద్రతా ప్రోటోకాల్‌లతో సమావేశమైన దౌత్యవేత్తలు, అధికారులు, మీడియా సిబ్బందితో సహా 4,000 మందికి పైగా ప్రజలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. మహమ్మారి చుట్టూ దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రసంగాన్ని ఉపయోగించారు. మరుసటి సంవత్సరం.. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి శతాబ్ది సంవత్సరం వరకు వచ్చే 25 సంవత్సరాలను 'అమత్ కాల్'గా పాటిస్తామనీ, ఈ సమయంలో దేశం కొత్త శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు మోడీ అన్నారు.

ఇక 2022 వేడుకల్లో మోడీ


"పాంచ్ ప్రాణ్ (ఐదు ప్రమాణాలు)" గురించి మాట్లాడారు. ప్రసంగంలో ఎలాంటి సామాజిక రంగ పథకాల ప్రకటనలూ లేవు. అభివృద్ధి చెందిన భారత్ అనే ప్రధాన సంకల్పంతో దేశం ముందుకు సాగటమే మొదటి ప్రాణమని ఆయన అన్నారు. ఇక 2023లో.. 2024 లోక్‌సభ ఎన్నికలను దేశాన్ని పీడిస్తున్న "చెడుల"పై యుద్ధంగా ఆయన అభివర్ణించారు. "అవినీతి, రాజవంశ పాలన, బుజ్జగింపు వైపు మీ కండ్లు మూసుకోవటానికి ఇది సమయం కాదు" అని అన్నారు. ప్రతిపక్షాల "పరివార్వాద్ (బంధుప్రీతి)"లా కాకుండా.. మోడీ మొత్తం దేశాన్ని తన "పరివర్జన్ (కుటుంబ సభ్యులు)"గా పరిగణిం చారని అన్నారు. వచ్చే ఏడాది తాను ఎర్రకోటపైకి వస్తానని కూడా ఆయన అంచనా వేశారు. అయితే, ఈ సారి సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి మెజారిటీ తగ్గటంతో ఇతర పార్టీలపై ఆధారపడిన పరిస్థితులు ఏర్పడిన విషయం విదితమే. అయితే, మోడీ చేసిన ప్రకటనలకు సంబంధించిన ఆచరణలో మాత్రం అంత వేగం కనిపించటం లేదని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు.

ప్రధాని ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం

విభజన అంశాల గురించి ఆయన మాట్లాడారని ఆరోపణలు

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విభజన ఎజెండాను ముందుకు తెచ్చారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. మత సివిల్ కోడ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు అవమానమని కాంగ్రెస్ పేర్కొన్నది. "ఇప్పటి వరకు మనకు 'కమ్యూనల్ సివిల్ కోడ్' ఉన్నదని చెప్పటం 1950ల మధ్య నాటికి వాస్తవరూపం దాల్చిన హిందూ వ్యక్తిగత చట్టాలలో సంస్కరణలకు గొప్ప కారకుడు అయిన డాక్టర్ అంబేద్కర్‌కు ఘోర అవమానం. ఈ సంస్కరణలను ఆరెస్సెస్, జన్ సంఘ్ తీవ్రంగా వ్యతిరేకించాయి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్ట్‌లో పేర్కొన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ.. ఐక్యత లేదా ప్రజలను ప్రేరేపించే అంశాలను ప్రధాని లేవనెత్తి ఉండాల్సిందని అన్నారు. "ఆయన ఏం మాట్లాడినా ఆరెస్సెస్ విభజన అజెండాకు అనుగుణంగా ప్రజలను విభజించటం చేస్తారు. ప్రధాని 2047 గురించి మాట్లాడుతున్నారు. కానీ దేశ బహుళత్వం, వైవిధ్యం సమస్యలను పరిష్కరించటంలో మోడీ విఫలమయ్యారు. ఆయన దేశంపై ఏకరూపతను విధించడానికి ప్రయత్నిస్తున్నాడు "అని రాజా ఆరోపించారు. 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అనే ఆలోచనను ప్రశ్నిస్తూ.. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి, సీపీఐ నాయకుడు అన్నీ రాజా మాట్లాడారు. "ఈ దేశం ఎన్నికల కోసం వనరులను సృష్టించలేకపోతే, మనం 2047 గురించి ఎందుకు మాట్లాడుతున్నాం? 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' వెనుక ఆయన ఉద్దేశం ఏమిటో నాకు తెలియదు. స్వేచ్ఛా-న్యాయమైన ఎన్నికలను నిర్వహించడమే మొదటి అజెండా కావాలి" అని అన్నారు. ఆర్జేడీ నాయకుడు మనోజ్ ఝా మాట్లాడుతూ.. దేశంలో ఒకే ఒక్క ప్రధాని ఉన్నారనీ, ప్రతిపక్షాలకు ఓటు వేసిన వారికి ప్రత్యేక ప్రధాని లేరన్న విషయాన్ని మోడీ ఇంకా గుర్తించలేదని అన్నారు.



అదానీకి మోడీ సర్కార్ అండ

బంగ్లాదేశ్‌తో కాంట్రాక్ట్ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించేందుకు అనుమతి

ఎగుమతులపై మార్గదర్శకాలను సవరించిన కేంద్రం


న్యూఢిల్లీ : బడా వ్యాపారవేత్త అదానీకి మోడీ సర్కారు మరొకసారి అండగా నిలుస్తున్నది. ఇందుకు బంగ్లాదేశ్‌లోని రాజకీయ అస్థిర పరిస్థితులను సైతం అదానీకి అనుకూలంగా మార్చుతున్నది. బంగ్లాదేశ్‌తో ఒప్పందం చేసుకున్న విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అదానీ పవర్‌కు మోడీ సర్కారు అనుమతించింది. ఈ మేరకు కేంద్రం విద్యుత్ ఎగుమతులపై మార్గదర్శకాలను సవరించింది. ఈ విషయాన్ని ఒక వార్త సంస్థ నివేదించింది. అయితే, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం కారణంగా ఏర్పడే అంతరాయాల నుంచి అదానీ పవర్‌ను రక్షించటంలో ఈ చర్య సహాయపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.2018లో మోడీ ప్రభుత్వం పొరుగు దేశానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా చేసే జనరేటర్లపై మార్గదర్శకాలను రూపొందించింది. జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాలో అదానీ పవర్ 1,600-మెగావాట్ల పవర్ ప్లాంట్ ప్రస్తుతం అది ఉత్పత్తి చేసే మొత్తం విద్యుత్‌ను మరొక దేశానికి సరఫరా చేయడానికి ఒప్పంద బాధ్యతను కలిగి ఉన్నది. ఈ సందర్భంలో అది బంగ్లాదేశ్‌కు చేయాల్సి ఉన్నది. అయితే, ఈనెల 12న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆమోదించిన మెమో.. మార్గదర్శకాలను సవరించింది. పూర్తి లేదా పాక్షిక సామర్థ్య స్థిరమైన షెడ్యూల్ లేని సందర్భంలో భారత్‌లో విద్యుత్ అమ్మకాలను సులభతరం చేయటానికి ప్రభుత్వం అటువంటి ఉత్పాదక స్టేషన్‌ను భారతీయ గ్రిడ్‌కు అనుసంధానించటానికి అనుమతించవచ్చని రాయిటర్స్ వివరించింది. చెల్లింపులు ఆలస్యమైతే భారతీయ గ్రిడ్‌కు విద్యుత్‌ను విక్రయించటానికి కూడా సవరణ అనుమతిస్తుంది. భారత్‌లో మొత్తం విద్యుత్ లభ్యతను పెంచటానికి ఈ చర్య సహాయపడుతుందని అదానీ గ్రూప్ తెలిపింది. మొత్తానికీ, బంగ్లాదేశ్‌కు అదానీ పవర్ విద్యుత్ ఎగుమతులు చాలా కాలంగా వివాదానికి కేంద్రంగా ఉన్నాయి. నిపుణులు దీనిని అధిక ధరలకు ఢాకా కొనుగోలు చేయవలసి ఉంటుందని వాదించారు. బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్ష పార్టీలు ఈ ఏర్పాటును విమర్శించాయి. ఇది అత్యంత అసమాన ఒప్పందమని అభివర్ణించాయి.

2017లో ఢాకాలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంతకం చేసిన ఒప్పందం ప్రకారం అదానీ గ్రూప్ సంస్థ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను విక్రయిస్తుంది. ప్రధాని మోడీ బంగ్లాదేశ్‌లో పర్యటించిన కొద్ది సేపటికే 2015 ఆగస్టులో అదానీ గ్రూప్, ఢాకా మధ్య అవగాహన ఒప్పందం కుదరటం గమనార్హం. అదానీ గ్రూప్, బంగ్లాదేశ్ ప్రభుత్వం మధ్య జరిగిన డీల్‌లో మోడీ ప్రమేయం నేరుగా ఉన్నదా అని భారత్‌లోని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి కూడా. అయితే ఈ ఒప్పందాన్ని సవరించాలని కోరుతూ బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు గతేడాది కంపెనీకి లేఖ రాసింది. కోరిన సవరణలపై అధికారిక ప్రకటన లేనప్పటికీ, అధిక ధరలు వివాదాస్పదంగా ఉన్నాయని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

బీజేపీ నేతకు షాక్

కిరీట్ సోమయ్య, ఆయన కొడుకుపై కేసు మూసివేతకు కోర్టు నిరాకరణ

వారిద్దరిపై ఐఎన్ఎస్ విక్రాంత్ ఫండ్ దుర్వినియోగం ఆరోపణలు



ముంబయి : భారతీయ నావికాదళ నౌక విక్రాంత్‌ను పునరుద్ధరించేందుకు ప్రజల నుంచి సేకరించిన రూ. 57 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై బీజేపీ నాయకుడు కిరీట్ సోమయ్య, ఆయన కుమారుడు నీల్‌పై కేసును ముగించేందుకు ముంబయి కోర్టు నిరాకరించింది. ముంబయి పోలీసు ఎకనామిక్ అఫెన్స్ వింగ్ దాఖలు చేసిన ముగింపు నివేదికను ఈనెల 8న ఎస్ప్లనేడ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్పీ షిండే తిరస్కరించారు. నిధుల సేకరణ కోసం వివిధ ప్రదేశాల్లో డ్రైవ్‌లు చేపట్టగా.. విచారణాధికారి చర్చ్‌గేట్ రైల్వే స్టేషన్ వెలుపల ఉన్నవాటిని మాత్రమే పరిశీలించారని కోర్టు గమనించిన తర్వాత తిరస్కరణ జరగటం గమనార్హం. సేకరించిన నిధులతో ఏమి జరిగిందో కూడా అధికారి నిర్ధారించలేదని కోర్టు తెలిపింది. కేసును మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించినట్టు ఒక ఆంగ్ల వార్త పత్రిక నివేదించింది



రాజుకుంటోంది

కోల్‌కతా : ఆర్‌జీ కార్ ఆస్పత్రి ప్రాంగణంలో దుండగుల విధ్వంసకాండ చర్చనీయాంశంగా మారింది. గురువారం అర్ధరాత్రి ఎమర్జెన్సీ విభాగాన్ని, నర్సింగ్ స్టేషన్, మందుల స్టోర్, సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేశారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు.

మీరేం చేస్తున్నారు.?

- మమత సర్కార్‌పై హైకోర్టు మండిపాటు
- ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో దుండగుల విధ్వంసంపై తీవ్రంగా స్పందన

ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ఆవరణలో జరిగిన విధ్వంస ఘటనపై కోల్‌కతా హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు ఎలా విధులు నిర్వర్తించగలరని ప్రశ్నించింది.

'పోలీసులకు ముందస్తు నిఘా విభాగం ఉంటుంది. ఇలాంటి ఘటనలు తలెత్తే అవకావం ఉన్నప్పుడు పోలీసులు సాధారణంగా 144 సెక్షన్ విధిస్తారు. మరి ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు..? 7 వేల మంది ఒకేసారి నడుచుకుంటూ ఆస్పత్రి వద్దకు రావడం అసాధ్యం. ఇంత మంది ఆస్పత్రి వద్ద గుమిగూడితే.. అది ముందుగా పోలీసులకు తెలియదనడం నమ్మశక్యంగా లేదు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర యంత్రాంగం వైఫల్యమే. వైద్యులు, మెడికల్ సిబ్బంది తమ విధులను భయం లేకుండా నిర్వర్తించేలా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది.

కాగా, కోల్‌కతా ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో అన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోషియేషన్స్ కలిసి సంయుక్తంగా ఆందోళన చేస్తున్నాయి. న్యూఢిల్లీలోని నిర్మాణ్ భవన్ దగ్గర ప్రొటెస్ట్ మార్చ్ నిర్వహించాయి. శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా వైద్యుల నిరసన ప్రదర్శనలతో దేశం అట్టుడికింది. 'తాము ఓపీ సేవలను నిలిపివేసి గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇకనైనా తమ డిమాండ్లను వినకపోతే అత్యవసర సేవలను కూడా నిలిపివేయాల్సి వస్తుంది' అని జూనియర్ డాక్టర్‌లు హెచ్చరించారు. అత్యవసర సేవలను నిలిపేసి రోగులను ఇబ్బందులు పెట్టాలనేది తమ ఉద్దేశం కాదని, ప్రభుత్వం మా డిమాండ్లను లెక్కచేయకపోతే అదే తమ ఆఖరి ఆప్షన్ అవుతుందని తెలిపారు.

మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలి చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్

ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిలిగురి ఎమ్మెల్యే, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అనంతరం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. విధులలో ఉన్న తమకు రక్షణ కల్పించాలంటూ వైద్యులు, నర్సులు ఆందోళన చేపట్టారు. తమ ఆందోళనను నైతికంగా దెబ్బతీయడానికే ఆస్పత్రిపై దాడి చేశారని తెలిపారు. న్యాయం జరిగే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. దాడులు జరిగిన ఆరు గంటల్లోగా ఫిర్యాదు నమోదు చేయాలి

వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసన

బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య ఘర్షణ

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై బీజేపీ కార్యకర్తలు శుక్రవారం సీజీవో కాంప్లెక్స్ వెలుపల నిరసన చేపట్టారు. మతురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, కోల్‌కతా పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆస్పత్రులకు కేంద్రం కీలక ఆదేశాలు

వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగా ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో కొందరు విధ్వంసం సష్టించడంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆస్పత్రి ప్రాంగణంలో హింస, సిబ్బంది, కార్యకర్తలపై దాడులు జరిగిన ఆరు గంటల్లోగా ఫిర్యాదు నమోదు చేయాలని ఆదేశించింది. నిర్ణీత గడువులోగా అలాంటి ఫిర్యాదు అందకపోతే సంబంధిత ఇన్‌స్టిట్యూట్ హెడ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ఇటీవలే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందిపై దాడులు సర్వసాధారణంగా మారడం తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. విధి నిర్వహణలో అనేక మంది ఆరోగ్య సిబ్బంది శారీరక హింసకు గురవుతున్నారని తెలిపింది. మరికొందరికి బెదిరింపులు వచ్చాయని, ఈ హింసలో ఎక్కువ శాతం రోగులు లేక రోగుల అటెండర్ల ద్వారా ఎదుర్కొన్నవేనని మంత్రిత్వ శాఖ తన ఆదేశాల్లో తెలిపింది. వీటిని దష్టిలో ఉంచుకొని ఆస్పత్రులకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించింది.

ఆనవాళ్లు చెరిపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మహత్య అంటూ బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన కళాశాల యాజమాన్యం, ఆ తర్వాత పొంతన లేని వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. ఈ అమానవీయ ఘటనపై మమత సర్కార్ సత్వర చర్యలు తీసుకోక పోవటంతో టీఎంసీ గుండాలు మరింతగా రెచ్చిపోయారన్నారు. టీఎంసీ శ్రేణులు బరితెగించి, హత్యాచార ఆనవాళ్లను చెరిపేయటానికి ప్రయత్నిస్తే.. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆరోపించారు. టీఎంసీ గుండాలను కట్టడి చేయకుండా... పోలీసులు పారిపోయారని బృందా విమర్శించారు. ఇప్పటికైనా దోషులను పట్టుకుని, శిక్షిస్తారా..లేదా అని ఆమె ప్రశ్నించారు.



అరుంధతీ రాయ్‌కి 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డు

న్యూఢిల్లీ : రచయిత్రి అరుంధతీ రాయ్‌కి 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డు లభించింది. యూఎస్‌కు చెందిన వాక్లావ్ హవెల్ సెంటర్ 2024 'డిస్టర్బింగ్ ది పీస్' అవార్డును గెలుచుకున్న ఇద్దరిలో అరుంధతీ రాయ్ కూడా ఉన్నారు. ప్రధానంగా ఇరాన్ ప్రభుత్వంచే రాజకీయ అణచివేతను నిరసిస్తూ పాటలకు ప్రసిద్ధి చెందిన ఇరాన్ రాపర్ టూమాజ్ సలేహితో అరుంధతీ రాయ్ ఈ అవార్డును పంచుకుంటారు. జ్యూరీ సభ్యుడు సలీల్ త్రిపాఠి అవార్డును ప్రకటిస్తూ.. అరుంధతీ రాయ్ భారత్‌లోని అట్టడుగున ఉన్న, నిరాదరణకు గురైన ప్రజల కోసం మాట్లాడుతున్నారని అన్నారు. వాక్లావ్ హావెల్ సెంటర్ ప్రతి సంవత్సరం ధైర్యమైన అసమ్మతి వాదికి అవార్డును అందజేస్తుంది. మానవ హక్కుల కోసం పోరాడుతున్న ప్రపంచ రచయితలను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది. చెకోస్లోవేకియా చివరి అధ్యక్షుడిగా, చెక్ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడిగా కొనసాగిన రచయిత, రాజకీయ అసమ్మతి వాక్లావ్ హావెల్ పేరు మీద ఈ అవార్డు ఇవ్వబడింది. ఈ అవార్డు కింద రూ. 4.19 లక్షల నగదు బహుమతిని లభిస్తుంది.

నర్సుపై హత్యాచారం

- డ్యూటీ నుంచి ఇంటికి వెళుతుండగా ఘోరం
- ఉత్తరాఖండ్‌లో ఆల్యసంగా వెలుగుచూసిన దారుణం

డెహ్రాడూన్ : దేశంలో రానురాను మహిళలకు భద్రత లేకుండా పోతోంది. బయటకు వెళ్లిన మహిళలు ఇంటికి క్షేమంగా తిరిగి రావడం ప్రశ్నార్థకంగా మారింది. కొల్‌కతాలో ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఒక జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనపై ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్న సమయంలోనే ఉత్తరాఖండ్‌లో జరిగిన మరొక దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రుద్రపూర్‌లో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో నర్సు డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా హత్యాచారానికి గురయింది. జులై 30న జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జులై 30న డ్యూటీకి వెళ్లిన నర్సు తిరిగి రాకపోవడంతో ఈ తరువాత రోజున మృతురాలి సోదరి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ నెల 8న ఉత్తరప్రదేశ్‌లో ముఖమంతా చిద్రమై గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, మొబైల్ ఫోన్ లోకేషన్ వంటి ఆధారాలతో కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడ్ని రాజస్థాన్‌లో ఈ నెల 13న అరెస్టు చేశారు. నిందితుడ్ని ఉత్తరద్రేశ్‌లోని బరేలీ జిల్లాకు చెందిన ధర్మేంద్రగా గుర్తించారు. ఇతడు ఉత్తరాఖండ్‌లోని గదర్‌పూర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పోలీసులకు విచారణలో ధర్మేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. జులై 30న ఇంటికి వెళుతున్న నర్సును అతడు అనుసరించాడు. ఒక నిర్జన ప్రదేశానికి వచ్చిన తరువాత నర్సును బలవంతగా పొదల్లోకి లాక్కుని వెళ్లాడు. ఆమె గట్టిగా ప్రతిఘించడంతో ఆమె స్కార్ఫ్‌నే ఆమె ముఖానికి చుట్టాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. తరువాత



దారుణంగా ఆమె ముఖాన్ని రాయితో చితకొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని ఉత్తరాఖండ్ సరిహద్దుకు సమీపంలోని ఉత్తరప్రదేశ్ గ్రామంలో ఖాళీ స్థలంలో పడేశాడు. పర్సు, ఫోను, ఇతర విలువైన వస్తువులను తీసుకుని పారిపోయాడు.

జర్నలిస్టులపై బీజేపీ ఎమ్మెల్యే పరువునష్టం దావా

లక్నో : యూపీలో ఒక ఎమ్మెల్యే స్థానిక జర్నలిస్టులపై పరువు నష్టం దావా వేయటం, దానిని వ్యతిరేకిస్తూ జర్నలిస్టులు ఆందోళనకు దిగటం చర్చనీయాంశంగా మారాయి. బీజేపీ ఎమ్మెల్యే జవహరలాల్ రాజ్‌పుత్.. తన నియోజకవర్గమైన గరౌతలో నలుగురు జర్నలిస్టులపై ఈ దావా వేశారు. అయితే, ఎమ్మెల్యే తీరు అనైతికమనీ, జర్నలిస్టుల గొంతును నొక్కే ప్రయత్నమని కలం యోధులు ఆందోళనను వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా జర్నలిస్టులు నిరసనలకు దిగారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిలబడి, మార్కెట్‌లలో తిరుగుతూ స్టీల్ గిన్నెలు పట్టుకొని చిరిగిన చొక్కాలతో డబ్బు కోసం యాచించిన దృశ్యాలు అక్కడ కనబడ్డాయి.

జవహర్‌లాల్ రాజ్‌పుత్ తన నియోజక వర్గమైన గరౌతలో అక్రమ ఇసుక తవ్వకాలలో తన ప్రమేయాన్ని సూచిస్తూ నివేదికలను ప్రచురించటం పట్ల జర్నలిస్టులపై ఆగ్రహంతో ఊగిపోయారు. తన ప్రతిష్టను దిగజార్చటానికి కుట్ర పన్నారని నలుగురు స్థానిక జర్నలిస్టులపై రూ. 50 కోట్ల పరువు నష్టం దావా వేశారు.

నవతెలంగాణ

మంచిపని మనసుకు హాయినిస్తుంది.
చెడ్డపని మనసును నొప్పిస్తుంది - అబ్రహాం లింకన్


శనివారం 17 ఆగస్టు 2024
www.navatelangana.com

సంపాదకీయం

"కడిగిపారేయడమే" కాదు..!

"అయినా... మనిషి మారలేదు... ఆతని కాంక్ష తీర లేదు" ఎర్రకోట బురుజుల నుండి మోడీ ఉపన్యాసం విన్నవారికి గుండమ్మ కథలోని పై పాట గుర్తుకురాక మానదు. "కడిగిపారేయడానికి" 98 నిమిషాలు వాడుకున్నాడని మోడీని ఆకాశానికి ఎత్తిన ఒక సంపాదక 'మాన్యుడు' సెంచరీ మిస్ చేసినందుకు 'అభిమానుల' తరఫున ఒకింత వగచాడు. ఈ ప్రహసనాన్ని చూసిన ఎవరైనా ఆశ్చర్యపోకమానరు. ఎందుకంటే ఎర్రకోట ఉపన్యాసంలో "కడిగిపారేసిన"దానికంటే కప్పిపెట్టేసినవే ఎక్కువ.

సుమారు పాతికేళ్ల సరళీకృత ఆర్థిక విధానాల అమలు తర్వాత, మిగతా దేశాల్లాగే మన దేశంలోనూ ప్రజల్లో అసంతృప్తి విస్తరిస్తున్న దశలో దాన్ని కంట్రోల్ చేయగల శక్తిమంతుడు కావాలి. దాంతోపాటు దేశ కార్పొరేట్ల సేవలో తేడా రాకుండా చూడాలి. 'సరైన' సమయంలో 'సరైన' వ్యక్తిని ఆరెస్సెస్ తన అంబులపొదిలో నుండి దేశం మీదికి వదిలింది. దశాబ్దంకిపైగా భారత గుత్త పెట్టుబడికి ముద్దుబిడ్డగా సాకబడి, ట్రయిన్ చేయబడ్డ వ్యక్తిని గుజరాత్ నుండి ఢిల్లీకి దిగుమతి చేసుకున్నారు. ఆ విధంగా ప్రారంభమైన మోడీ ప్రస్థానంలో.. మొన్న స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఎర్రకోట నుండి పదకొండవసారి మారుమ్రోగిన ఉపన్యాసం గురించే నేటి చర్చంతా!




> ఎన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు - కూలిపోతున్న టన్నెల్స్, కొట్టుకుపోతున్న జాతీయ రహదారులు, విరిగిపడుతున్న విమానాశ్రయాలు, లీకవుతున్న కొత్త పార్లమెంటు, అయోధ్య రామమందిరం వంటివి ఎన్నో ఉన్నాయి. ఇదంతా అవినీతి వల్ల కాదా మోడీ మహాశయా? మీరు పోరాడేది ఏ అవినీతి మీదో దేశ ప్రజలకు చెప్పగలరా? బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగే దాడుల గురించీ, ఆలయాలపై దాడి గురించి మోడీ ప్రస్తావించిన అంశాలు కచ్చితంగా దేశ ప్రజలందరూ మద్దతు నివ్వాల్సినవే. కాని మన దేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై జరిగే దాడుల మాటేమిటి? కూలబడుతున్న చర్చీలు, మసీదుల మాటేమిటి?

మొన్నటి లోక్‌సభ ఎన్నికల తర్వాత మోడీని పరిస్థితులు మార్చేస్తాయని ఆనందించిన అల్ప సంతోషులున్నారు. ఒక చంక కింది పోటీ కర్ర తెలుగుదేశమని, మరో చంక కింద జేడీ(యూ) కర్ర ఉందని, ఈ రెండూ 'సెక్యులర్ పార్టీలనీ మోడీ ఆటలు సాగనీయరని చప్పట్లు కొట్టినవారున్నారు. కానీ ఎటువంటి శషభిషలకు తావు లేకుండా ఆరెస్సెస్ ఎజెండాను తన ఎర్రకోట ఉపన్యాసంలో జాగ్రత్తగా ప్రస్తావించారు ఈ ఆరెస్సెస్ మాజీ ప్రచారక్.

మోడీ కప్పిపెట్టిన అంశాలను ఒక్కొక్కటిగా విప్పిచూస్తే.. ఇప్పటిదాకా దేశంలో ఉన్నది మతతత్వ సివిల్ కోడ్ అట! ఆ మాట సుప్రీంకోర్టు కూడా ఒప్పుకుందట! అది ఎప్పుడో, ఎక్కడో ఆయన చెప్పరు. పైగా నేషనల్ లా కమిషన్ తన 21వ సంప్రదింపుల పత్రంలో వివక్షపూరితంగా ఉన్న చట్టాలను సరిచేస్తే చాలని, ఉమ్మడి పౌరస్మృతి అవసరం నేడు లేదని స్పష్టంగా చెప్పింది. దీని గురించి మోడీ చెప్పరు. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో అమల్లోకొచ్చిన ముస్లిం మైనారిటీలపై సాగే వివక్షపై ఆయనేమీ చెప్పరు. దాని స్థానంలో లౌకిక సివిల్ కోడ్ తెచ్చే పనిలో తన సర్కారుందట! తాను తేదల్చుకున్న 'ఉమ్మడి పౌరస్మృతికే చక్కెర పూసి ఎన్డీయే కూటమి భాగస్వాములతో మింగించే ప్రయత్నం చేయడమే కదా ఇది!? తరచూ ఎన్నికలు జరిగితే దేశాభివృద్ధికి అడ్డంకి కాబట్టి, లోక్‌సభకూ రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుపుతారట! ఒకే దేశం, ఒకే ఎన్నికలు నినాదాన్ని ఈ విధంగా చెప్పారు మోడీ. ఇది భారతదేశ ప్రజాస్వామ్య పునాదుల మీదే గొడ్డలివేటు. పెట్టుబడిదారుల ప్రాపకంతో బతికే పార్టీలకు, మొన్నటి ఎలక్టోరల్ బాండ్లలో వేల కోట్లు పోగేసుకున్న పార్టీలైతే పంచాయతీల నుండి లోక్‌సభ సీట్ల వరకు పోటీ చేసే స్తోమతుంటుంది. తప్ప మిగిలిన వారికి అసాధ్యం. ఆయా రాష్ట్రాల్లో స్థానిక పరిస్థితుల్లో పార్టీలు చీలిపోతూంటాయి. ప్రభుత్వాలు కూలిపోతూంటాయి. 'ఒకే ఎన్నిక' అంటే ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఆ ప్రభుత్వాలను స్థిరంగా నిలబెట్టేస్తారా? ఓనం కాలంలో కేరళలో, దుర్గాపూజా కాలంలో దేశ తూర్పు భాగంలో, దసరా, సంక్రాంతి రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించగలరా? దేశం, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు భారతదేశంలో నిర్వహించడం అసాధ్యం.

మోడీ అవినీతిపై పోరాడుతున్నారట! దేశం ఆయన వెంట నడవాలట! వాస్తవమేమంటే అవినీతి మరకలున్న వారు బీజేపీలో చేరితే పరిశుద్ధులౌతున్నారు. చాంతాడంతున్న ఈ లిస్టు చూసి దేశం నవ్వుకుంటోంది. మోడీ "అవినీతి వ్యతిరేక" పోరాటం దాంతో ఆగలేదు. ఎన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు - కూలిపోతున్న టన్నెల్స్, విరిగిపడుతున్న విమానాశ్రయాలు, కొట్టుకుపోతున్న జాతీయ రహదారులు, లీకవుతున్న కొత్త పార్లమెంటు, అయోధ్య రామమందిరం వంటివి ఎన్నో ఉన్నాయి. ఇదంతా అవినీతి వల్ల కాదా మోడీ మహాశయా? మీరు పోరాడేది ఏ అవినీతి మీదో దేశ ప్రజలకు చెప్పగలరా? అదానీకి వ్యతిరేకంగా జరిగే ఏ వ్యవహారమైనా విదేశీ కుట్రలో భాగమేనన్న మోడీ సెబీ చీఫ్‌పై ఈగ వాలకుండా చూసుకోమని చెప్పడం దాన్ని మన సంపాదక పెద్ద రాయడం ఈయన మోడీ ఒళ్లోనే ఉన్నాడని చెప్పకనే చెప్పాడు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగే దాడుల గురించీ, ఆలయాలపై దాడి గురించి మోడీ ప్రస్తావించిన అంశాలు కచ్చితంగా దేశ ప్రజలందరూ మద్దతు నివ్వాల్సినవే. కాని మన దేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై జరిగే దాడుల మాటేమిటి? కూలబడుతున్న చర్చీలు, మసీదుల మాటేమిటి? మాన్యశ్రీ సంపాదకుల వారు మోడీ శకంలో ఏ పొరుగు దేశంతో సుహృద్భావ సంబంధాలున్నాయో శెలవిచ్చి ఉంటే సంతోషించి ఉండేవారం. దేశంలో జరిగే విషయాలను పాఠకులకు వివరించడం పత్రికల ప్రధాన కర్తవ్యం. మరీ ముఖ్యంగా సంపాదకీయాల విధి. గోడీ మీడియాలో అంతర్భాగమైపోతే మరో కిరాయి రచయిత పెరిగారనుకోవడం తప్ప ఏం చేయగలం?

బంగ్లాదేశ్ విప్లవం: లౌకికవాదంలో ఒక ఆశ్చర్యకర పాఠం


ఆపూర్వానంద్

బంగ్లాదేశ్‌లో వేల సంఖ్యలో హిందువులు రక్షణను డిమాండ్ చేస్తూ వివిధ పట్టణాలు, నగరాలలో నిరసన తెలియజేస్తున్నారు. వారి వెంట ముస్లింలు పెద్ద సంఖ్యలో నిలబడి ఉంటున్నారు. ఈ నిరసనలలో హిందువులు మతపరమైన నినాదాలు చేస్తున్నారు. వీరికి తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు మద్దతుగా ఉంటున్నారు. హిందువులు, బంగ్లాదేశ్‌ను అపకీర్తి పాల్జేయడానికి భారతదేశానికి, లేక అంతర్జాతీయ కుట్రలో సాధనాలుగా ఉంటున్నారని, సరిహద్దుకు అవతల్నుండి వారిని రెచ్చగొడుతున్నారనీ, వారు దేశ వ్యతిరేకులని పేర్కొనడం ద్వారా ఏ ఒక్కరూ ఈ నిరసనకారులపై దాడి చేయడం లేదు. తాము బంగ్లాదేశీయులమనీ, ఏ ఒక్కరూ తమను తరిమిమేయలేరని బంగ్లాదేశ్ హిందువులు ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. మైనార్టీ హక్కులకు సంబంధించి వారు ప్రత్యేకమైన సౌకర్యాలను డిమాండ్ చేస్తున్నారు. దుర్గాపూజ సందర్భంగా కోరుతున్న ఐదు రోజుల సెలవు వారి డిమాండ్లలో ఒకటిగా ఉంది. ఒకవేళ వారు వారి ప్రాణాలు, ఆస్తుల గురించి నిజంగా ఆందోళన చెందితే ఈ ఐదు రోజుల సెలవు డిమాండ్ అనేది వారి మనసులో ఉన్న డిమాండ్ కాదు. బంగ్లాదేశ్ తమ స్వంత ఇల్లు అనీ, తాము ఉత్సవాలు జరుపుకునే ప్రాంతమనే విషయం వారికి తెలుసు అని ఈ డిమాండ్ అర్థం.

ఏ ముస్లిం మత సంస్థ కూడా వీటికి వ్యతిరేకంగా ఎలాంటి సమీకరణలు చేయడం లేదు. పాలక పక్షానికి చెందిన ఏ నాయకుడు కూడా దేశద్రోహులను కాల్చి చంపాలని ప్రజల్ని కోరడం లేదు. అంతేకాక దీనికి విరుద్ధంగా విద్యార్థులు, ఇతర ముస్లింలు దేవాలయాలకు రక్షణగా ఉంటూ, హిందూ ప్రజల నివాస ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. మత విరోధుల హానికరమైన దుశ్చర్యలు, హింసకు వ్యతిరేకంగా అక్కడ అప్రమత్తత కనపడుతుంది.ముస్లిం మత పెద్దలు దేవాలయాలను సందర్శిస్తూ, వారికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. వారు హిందువులకు అండగా ఉంటున్నామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు.

> బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహమ్మద్ యూనస్ మాట్లాడిన విధంగా భారత్ పాలకపార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా మతతత్వ హింసకు వ్యతిరేకంగా ఇంతవరకు మాట్లాడలేదు. దారుణమైన విషయం ఏమంటే, భారతదేశంలోని ముస్లింలపై దాడి చేయడానికి ఇక్కడి మతతత్వ శక్తులు, బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నెపంగా ఉపయోగించుకుంటున్నాయి. బహిర్గతమవుతున్న జగడం ఒక విషయాన్ని రుజువు చేస్తే, దక్షిణ ఆసియాలో మొత్తంగా లౌకికవాదుల ఐక్యత అవసరమవుతుంది.

ఢాకాలో విద్యార్థులు పార్లమెంటును శుభ్రం చేస్తున్నారు. వారే రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకల్ని నియంత్రిస్తున్నారు. ఆగస్టు 5న జరిగిన గందరగోళంలో లూటీ అయిన వస్తువులన్నీ నెమ్మదిగా తిరిగి వస్తున్నాయి. తాత్కాలిక ప్రభుత్వ అధినేత ఒక ప్రముఖ దేవాలయాన్ని సందర్శించి హిందువులకు తన సంఘీభావాన్ని ప్రకటించడాన్ని మేము చూశాం. వారి హోంశాఖ సలహాదారు హిందువులకు వ్యతిరేకంగా జరిగే హింసకు వ్యతిరేకంగా చాలా నిర్దిష్టమైన వైఖరిని తీసుకున్నాడు.

ప్రజాస్వామిక విప్లవం

ఈ పరిణామాల గురించి భారతదేశ ప్రజలకు తెలియజేసేందుకు ఎవ్వరికీ ఆసక్తి ఉన్నట్లు కనిపించడం లేదు. తమ దేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేస్తున్న భారతదేశ అధికార పార్టీతో సంబంధాలున్న వ్యక్తుల్ని చూసి బంగ్లాదేశ్ ప్రజలు నిరాశ చెందుతున్నారు. విప్లవం కారణంగా బంగ్లాదేశ్‌లో సృష్టించబడిన గందరగోళం, హింసను వ్యతిరేకించే పేరుతో అలాంటి వ్యక్తులు వారి సొంతదేశంలోనే ముస్లింలపై దాడులు చేయడం, వారి పాకలను ధ్వంసం చేయడం, వారిని కొట్టడం లాంటి చర్యల్ని కూడా వారు చూస్తున్నారు. ఇది ప్రజాస్వామిక విప్లవం కాదు, ఇది భారతదేశ వ్యతిరేక, హిందూ మత వ్యతిరేక కుట్ర అని రుజువు చేయాలని భారతదేశ అధికార పార్టీ అనుకుంటున్నట్టు విద్యార్థులు, ఇతరులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రజా స్వామిక ఆకాంక్షలను భారతదేశ ప్రభుత్వం స్వాగతించకపోవడం దురదృష్టకరమని బంగ్లాదేశ్‌లో పండితులు అంటున్నారు. అయితే తనతో సన్నిహిత సంబంధాలు గల నిరంకుశ నాయకురాలి పతనం పట్ల భారత్ కలత చెందుతున్నట్లు కనపడుతుందని కూడా వారు చెబుతున్నారు.

బంగ్లాదేశ్‌లో జాతి సంహారానికి హిందువులు బాధితులు అవుతున్నారని భారతదేశంలో నకిలీ వీడియోలు చేస్తున్న ప్రచా రాన్ని కూడా బంగ్లాదేశ్ ప్రజలు గమనిస్తున్నారు. చాలా వీడియోలు నకిలీవి, అయినప్పటికీ వాటిని విచక్షణారహితంగా ప్రచారానికి ఉపయోగిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక విప్లవాన్ని స్వాగతించడంకంటే కూడా బంగ్లాదేశ్‌లో హిందువుల, మైనారిటీల రక్షణ పైనే భారత మొదటి అధికారిక ప్రతిస్పందన ఎక్కువ దృష్టిని కేంద్రీకరించినట్టు కనపించిందని బంగ్లాదేశ్ ప్రజలు గుర్తించారు. బంగ్లాదేశ్ లోని భారతీయుల, ముఖ్యంగా హిందూ భారతీయుల రక్షణను చూసేందుకు భారతదేశం ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు బంగ్లాదేశ్ వార్తాపత్రికలు గుర్తించాయి. బంగ్లాదేశ్ హిందువుల రక్షణ కోసం పారామిలిటరీ బలగాలతో కమిటీని ఏర్పాటు చేయడమంటే పొరుగు దేశ అంతర్గత వ్యవహారాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నట్లు కనపడుతోంది. ఈ కమిటీ ఎలా పని చేస్తుందో ఎవరైనా వివరించగలరా?

ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ఇతరులు హిందువుల్ని, మైనారిటీలను రక్షిస్తున్నారని భారత విదేశాంగ మంత్రి కూడా పార్లమెంట్‌లో ప్రకటన చేశాడు. అలాంటప్పుడు భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని ఎందుకు వ్యాప్తి చేస్తున్నారు? బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దానిని సనాతన ధర్మంపై దాడిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. భారత ప్రభుత్వం చెప్పినట్లు, బంగ్లాదేశ్ ప్రజలు, మైనార్టీలకు, హిందువులకు అండగా ఉన్నప్పుడు, భారతదేశంలో ఈ గావుకేకలు ఎందుకు? బంగ్లాదేశ్ విప్లవంలో హిందువులకు వ్యతిరేకంగా హింస అనేది అత్యంత గుర్తించదగిన అంశమా? అదే విప్లవాన్ని నిర్వచిస్తుందా? అనేది పరిశీలించాలి. అది కాకపోతే, ప్రతిస్పందనలను సరిచేయాల్సి ఉంటుంది. లేదా ఇది, వాస్తవంతో నిమిత్తం లేకుండా హిందువుల్లో అభద్రతను సృష్టించడానికి కొన్ని వర్గాలవారు కపటోపాయాన్ని ఉపయోగించే హక్కును కలిగి ఉన్నారనే వాదనా?



> బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ఇతరులు హిందువుల్ని, మైనారిటీలను రక్షిస్తున్నారని భారత విదేశాంగ మంత్రి కూడా పార్లమెంట్ లో ప్రకటన చేశాడు. అలాంటప్పుడు భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని ఎందుకు వ్యాప్తి చేస్తున్నారు? బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దానిని సనాతన ధర్మంపై దాడిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. భారత ప్రభుత్వం చెప్పినట్లు, బంగ్లాదేశ్ ప్రజలు, మైనార్టీలకు, హిందువులకు అండగా ఉన్నప్పుడు, భారతదేశంలో ఈ గావుకేకలు ఎందుకు? బంగ్లాదేశ్ విప్లవంలో హిందువులకు వ్యతిరేకంగా హింస అనేది అత్యంత గుర్తించదగిన అంశమా? అదే విప్లవాన్ని నిర్వచిస్తుందా? అనేది పరిశీలించాలి. అది కాకపోతే, ప్రతిస్పందనలను సరిచేయాల్సి ఉంటుంది. లేదా ఇది, వాస్తవంతో నిమిత్తం లేకుండా హిందువుల్లో అభద్రతను సృష్టించడానికి కొన్ని వర్గాలవారు కపటోపాయాన్ని ఉపయోగించే హక్కును కలిగి ఉన్నారనే వాదనా?

మతపరమైన అంశాలు

షేక్ హసీనా రాజీనామా చేసి, దేశం విడిచి వెళ్లిన తరువాత బంగ్లాదేశ్‌లో అరాచకత్వాన్ని సృష్టించిన మాట వాస్తవం. అనేక ప్రాంతాల్లో గూండాలు వీధుల్ని అదుపులోకి తీసుకున్నారు. విచ్చలవిడిగా లూటీలు, దహనాలతో పాటు ప్రతిచోట హింసకు పాల్పడ్డారు. గత పాలక పార్టీ అయిన ఆవామీ లీగ్ కార్యకర్తలు, దాని అనుబంధ సంస్థల సభ్యులపైన దాడులతో పాటు దేవాలయాలపై కూడా దాడి చేశారు. హిందువుల ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకున్నారు.

అయితే, విస్తరించబడిన ఆరెస్సెస్ శక్తుల వలె బంగ్లాదేశ్‌లో కూడా మతతత్వ శక్తులున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. 1947లో కొనసాగుతున్న గందరగోళాన్ని అవకాశంగా తీసుకొని ఆరెస్సెస్, భారతదేశంలో ముస్లింలు పారిపోయే పరిస్థితిని సృష్టిం చే ప్రయత్నం చేసిన విషయాన్ని మర్చిపోకూడదు. స్థిరమైన మనసు, లౌకిక శక్తుల అప్రమత్తత కారణంగా అది పూర్తిగా విజయవంతం కాలేదు. అన్ని సమయాల్లో ప్రతి సమాజంలో, దేశంలో పెద్ద లక్ష్యంగా పిలువబడే ముసుగులో అల్పమైన, సంకుచితమైన "జాతీయవాద" లక్ష్యాలను సాధించేందుకు కుట్రలుపన్నే శక్తులు ఉంటాయి. ఇది బంగ్లాదేశ్‌లో కూడా జరుగ వచ్చు. రాజ్యం అదృశ్యమైనపుడు ఇస్లామిక్ వాదులు చురుకుగా మారవచ్చు, తీవ్రవాద శక్తులు రంగం పైకి రావచ్చు.

లౌకిక ప్రజల ఐక్యత అవసరం


అడగవలసిన అసలు ప్రశ్న ఏమంటే: ప్రభుత్వ వైఖరి ఏమిటి? ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న ప్రజల వైఖరి ఏమిటి? బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వ నాయకుడు, అందరు మంత్రులు, విద్యార్థి నాయకులు ఏకపక్ష హింసకు వ్యతిరేకంగా చాలా బలంగా మాట్లాడుతున్నారు. ఈ విప్లవం ప్రతిఒక్కరి కోసం, దేశంలో ముస్లింలకు, హిందువులకు సమాన హక్కులుంటాయని వారు స్థిరంగా దృఢ నిశ్చయంతో చెపుతున్నారు. నిరసనలు తెలియజేస్తున్న హిందువులకు వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేసే స్వరాలు, ప్రభావశీలురు ప్రభుత్వం నుండి ఎవరూ లేరు. ఈ సమయంలో నిరసనలు వ్యక్తం చేయడం ద్వారా వారు ప్రజాస్వామిక విప్ల వాన్ని బలహీనపరుస్తూ, దానిని అపకీర్తిపాలు చేస్తున్నారని ఏ ఒక్కరూ అంటుండగా మేము వినలేదు. వారిని ఎవరూ దేశ వ్యతిరేకులని పిలవడం లేదు.

బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహమ్మద్ యూనస్ మాట్లాడిన విధంగా భారత్ పాలకపార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా మతతత్వ హింసకు వ్యతిరేకంగా ఇంతవరకు మాట్లాడలేదు. దారుణమైన విషయం ఏమంటే, భారతదేశంలోని ముస్లింలపై దాడి చేయడానికి ఇక్కడి మతతత్వ శక్తులు, బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నెపంగా ఉపయోగించుకుంటున్నాయి. బహిర్గతమవుతున్న జగడం ఒక విషయాన్ని రుజువు చేస్తే, దక్షిణ ఆసియాలో మొత్తంగా లౌకికవాదుల ఐక్యత అవసరమవుతుంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక విప్లవం ఒక అవకాశాన్ని సృష్టిం చింది. మొత్తంగా ఈ ప్రాంతంలో ఒక నూతన ప్రజాస్వామిక పథక రూపకల్పనకు ఢాకాలోనే ఒక దక్షిణాసియా సదస్సును నిర్వహించడం ఉత్తమమైన పని. ఇందుకు "దక్షిణాసియా ప్రజాస్వామిక, లౌకికవాదులారా ఐక్యం కండి" అనే నినాదం ఎంతో అవసరం.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)
(వ్యాసకర్త ఢిల్లీ యూనివర్సిటీ హిందీ ప్రొఫెసర్)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

అధ:పాతాళానికి తొక్కేసిన రాజ్యం
ఇనుప పద ఘట్టనలను చీల్చుకుంటూ
పైకెగసిన అగ్నిధారవు నీవు...
అధికార మదాంధకారపు చీకట్లను
చీల్చుకువచ్చిన కాంతిపుంజం నీవు...
అదిరింపులు, బెదిరింపులు,
అవమానాలు, లాఠీదెబ్బలు
రోజుల తరబడి రోడ్లపై
నీవు సాగించిన పోరాటాలు...
మాతృభూమిపై నీ అపజయాలు...
పరాయి గడ్డపై గంటల్లోనే ముగ్గురు
జగజెట్టీలను మట్టి కురిపించిన నీకు
వంద గ్రాముల చిరు బరువు
పెనుభారమయ్యిందా?

విజేత..!



గెలుపుకోసం రక్తం
ధారపోసినట్లు వినటమే
కానీ చూసింది మాత్రం నిన్నే....
ఎక్కడో, ఉహూ కాదు బహుశా
ఇక్కడే ఏదో ఇనుపపాదం
నీ విజయానికి
మోకాలు అడ్డుపెట్టిందేమో...
బహుశా నిన్ను 'భేష్' అనాల్సి వస్తుందని
రాజ్యం గొంతు భయపడిందేమో!
పసిడి పతకాన్ని
దూరం చేసింది అందుకేనేమో!
మొన్నరోడ్లపై నిన్ను ఈడ్చేస్తుంటే
మౌనరాగాలు తీసిన గొంతులు
నేడు నీకోసం గొంతెత్తుతున్నాయి....
ఇది కదా..నీ అసలైన విజయం...
ఆరు గ్రాముల పతకం లేకపోతేనేం
భారతమ్మ కన్న నిలువెత్తు
పుత్తడిబొమ్మవు నీవు
ఇంటా, బయటా బరిలో
నిలిచి, గెలిచిన విశ్వవిజేతవు నీవు..
మా కంటికొసల్లో నీరై నిలిచిన ఫేటీవి నీవు

- వీరాంజనేయులు

ఓ.. రక్త పిపాసి! ఇకనైనా యుద్ధం ఆపు!!



పాతూరి వేంకటేశ్వరరావు
9849081889

"ధర్మో రక్షతి, రక్షిత:" అన్నారు పెద్దలు. ఈ కర్తవ్యాన్ని విస్మరించి దేశాధినేతలు, మేధావులు, మిన్నకున్నా తనను తాను కాపాడుకునేందుకు, ధర్మం నిర్విరామంగా పరిశ్రమిస్తూనే ఉంటుంది. ఆక్రమంలో అధర్మానికి దన్నుగా నిలిచిన సజ్జనులను సైతం, నశింపజేస్తుంది ధర్మం! అధర్మ కౌరవులకు అండగా నిలిచిన భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాదుల వినాశనమే నిదర్శనమంటూ మానవాళిని - హెచ్చరిస్తున్నది మహాభారతం! పాలస్తీనీ యులపై ఇజ్రాయిల్ నరమేధాన్ని కనీసం ఖండించని భారత పాల కులు, పార్టీలు, మేధావులూ మహాభారత - హెచ్చరికను మననం చేసుకుందురుగాక! ఇజ్రాయిల్‌ది అధర్మం! పాలస్తీనాది ధర్మం! అనటానికి చరిత్రే సాక్ష్యం! నాడు ప్రపంచంలో నిలువనీడ లేక, తలదాచుకుంటామని అరబ్బుల నభ్యర్థించి వలసొచ్చి పాలస్తీనాలో స్థిరపడ్డారు యూదులు. 1920 నాటికి పాలస్తీనా జనాభాలో 8శాతంగా ఉన్న యూదులు, వలసలద్వారా 1945 నాటికి 35.8శాతానికి పెరిగారు. 1) నాడు పాలస్తీనాను పాలిస్తున్న బ్రిటిష్ వారి అండదండలు 2) దేశ దేశాల నుండి తాము కూడబెట్టుకు వచ్చిన ధనరాశులతోను, అప్పుల పాలైయున్న అరబ్బుల లక్షల ఎకరాల పొలాలను,-బ్రిటిషు వారు ఉద్దేశ పూర్వకంగా అప్పుల ఊబిలోకి నెట్టారు.అదే సందర్భంలో పాలస్తీనా జాతీయ పరిశ్రమలను, కారుచౌకగా కొన్నారు యూదులు! అలా ప్రణాళికాబద్ధంగా పెంచుకున్న అంగ, అర్థ, సైనిక బలగాలతో-సగానికి పైగా పాలస్తీనాను దురాక్రమించి 'ఇజ్రాయిల్'ను స్థాపించుకున్నారు యూదులు.

అపార చమురు నిక్షేపాలున్న పశ్చిమాసియాలోని అరబ్బు దేశాల చమురు దోపిడీకి, పశ్చిమాసియాకు ముఖద్వారం వంటి పాలస్తీనాలో తమకు అనుకూల దేశం ఉండాలన్న కుట్రతోనే అక్కడ ఇజ్రాయిల్ స్థాపనకు ధృఢమైన పునాది వేసింది బ్రిటన్! ఆ దురుద్దేశంతోనే ఇజ్రాయిల్‌ను పెంచి బలోపేతం చేసింది అమెరికా! - నాడు యూదులకంటూ సొంత దేశం ఏర్పాటును ప్రపంచ దేశాలన్నీ అంగీకరించిన మాట వాస్తవం! ఎందుకంటే? - 'నాడు ప్రపంచంలో దారుణ చిత్రహింసలకు, హిట్లర్ నరమేధానికి గురైన బాధితులు యూదులన్నది చారిత్రక సత్యం!హింసలు తాళలేక తమ పూర్వీకులు నివసించిన పాలస్తీనాకు తిరుగుముఖం పట్టారు. అరబ్బుల నభ్యర్థించి,పాలస్తీనాలో చొరబడి, సర్వతోముఖాభివృద్ధిని సాధించాక ఇజ్రాయిల్‌ను స్థాపించుకున్నారు యూదులు. కానీ బాధాకరమేమిటంటే, 'దయతో తలదాచుకోనిచ్చిన - యజమానిని వెలుపలికి నెట్టేసి, గుడారం మొత్తాన్ని ఆక్రమించిన ఒంటెలా' ఆశ్రయమిచ్చిన అరబ్బులను తన్ని తరిమేసిన చందంగా ఉంది ఇజ్రాయిల్ తీరు. పాలస్తీనాను దురాక్రమించి ఏకైక యూదురాజ్యాన్ని నిర్మించాలన్న దురాశతో అరబ్బులపై దాడులకు తెగబడి నాటి 'హిట్లర్'ను తలపిస్తున్నాడు నేటి నెతన్యాహూ!

ఐరాస జోక్యం-ఇజ్రాయిల్ బరితెగింపు

బ్రిటిష్ వారు వెళ్లాక మరింతగా బరితెగించింది ఇజ్రాయిల్! ఐ.రా.స. జోక్యం చేసుకుని 55శాతం ఇజ్రాయిల్‌కు, 45శాతం పాలస్తీనాకు- భూభాగాన్ని కేటాయించి రాజధాని జెరూసలేంను స్వీయ పర్యవేక్షణలో ఉంచుకున్నది. కానీ 'ఐరాస' ఆదేశాలను తిరస్కరించి మూడొంతులకు పైగా పాలస్తీనాను దురాక్రమించింది ఇజ్రాయిల్. అందుకే 1990లో ఇజ్రాయిల్‌ను 'టెర్రరిస్టు-స్టేట్'గా ప్రకటించింది ఐరాస! బ్రిటన్, అమెరికా, వాటి తోక దేశాలు తప్ప, ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ న్యాయస్థానాలు, ఐరాస నిరసిస్తున్నా సరే, నిస్సిగ్గుగా అరబ్బులపై మారణకాండను కొనసాగిస్తూనే ఉన్నాడు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ! అంతేగాదు పాలస్తీనా యూదులదే, దాన్ని తొలుత పాలించింది యూదులేనంటూ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నాడు!



కానీ చారిత్రక వాస్తవమేమంటే, మతాలు పుట్టక పూర్వం ప్రజలందరిదీ మానవజాతే! మానవులంతా సంచార తెగలవారే! ప్రపంచమంతటా సంచరిస్తూ తమ కనుకూల మనుకున్న ప్రాంతాలలో ఆయా తెగలు స్థిరపడ్డాయ్. ఉదా॥ ఊదయా పర్వతాల నుండి పాలస్తీనాకు వలసొచ్చిన సంచార తెగవారే యూదులు! వారికన్నా ముందే 'పిలస్తీనీ' తెగవారు ఆ ప్రాంతాన్ని పాలించారు. వారి పాలనలో ఉన్న భూభాగమే 'పాలస్తీనా'గా వ్యవహరింప డబుతుందని అంటున్నారు చరిత్రకారులు! పిలస్తీనీలు-యూదులు-రోమన్ క్రైస్తవులు, టర్కీ అరబ్బులు, బ్రిటిష్ వారు పాలించిన ప్రాంతం పాలస్తీనా! రోమన్ క్రైస్తవ ప్రభువుల పాలనలో వారి ఆంక్షలకు తాళలేక 90శాతం యూదులు వివిధ దేశాలకు వెళ్లారు! అరబ్బు చక్రవర్తుల ఆంక్షలకు తాళలేక క్రైస్తవులూ వలసవెళ్లారు. పాలకులెవరైనా, నాటికీ, నేటికీ పాలస్తీనాను అంటి పెట్టుకున్న మెజారిటీ ప్రజలు అరబ్బులేనని చరిత్ర చెబుతున్నది! పాలస్తీనా భిన్న జాతుల నిలయమని రాజధాని జెరూసలేంలోని - 'సాల్మన్ టెంపుల్' (పవిత్రగృహం) - 'హెలీ చెపల్ చెప్ చర్చ్' - 'అల్‌అక్సా' మసీదులు చాటి చెబుతున్నాయ్!

'బతకడం కోసం చద్దాం':హమాస్

నాడు హిట్లర్ నరమేధానికి తాళలేక యూదులు చెల్లాచెదురైనట్లు నేడు నెతన్యాహూ నరమేధానికి తాళలేక నలభై శాతం అరబ్బులు వలసెళ్లారు.ఇరవైశాతం అరబ్బులు ఇరుగుపొరుగు దేశాల్లో శరణార్థులుగా తలదాచుకుంటున్నారు. అలా వెళ్లిన అరబ్బులు తిరిగి పాలస్తీనా వచ్చేందుకు వీల్లేకుండాను- వెళ్లిపోయిన అరబ్బుల ఇండ్లు, పొలాలనూ ఇజ్రాయిల్ సొంతం చేసుకునేలా చట్టాలు చేసింది ఇజ్రాయిల్! మిగిలిన అరబ్బులను 'గాజా' 'వెస్ట్‌బ్యాంక్'లలో కుక్కి అక్కన్నుండి వాళ్లు వెలుపలకు రాకుండా సరిహద్దు - చుట్టూ 60కి॥ మీ॥ మేర లక్షల కోట్ల రూ॥తో క్షిపణి నిరోధక ఉక్కుకంచెను నిర్మించుకున్నది ఇజ్రాయిల్! అయినా సరే! ఇజ్రాయిల్ నిర్బంధంలో చిత్రహింసలకు గురవుతూ బందీలుగా ఉన్న ఆరువేల మంది పాలస్తీనా విముక్తి పోరాట యోధులను విడిపించుకోటానికి 7అక్టోబర్2023న ఉక్కు కంచెను ఛేదించుకుని ఇజ్రాయిల్‌లో ప్రవేశించి, వివిధ రంగాల ఇజ్రాయిల్ ప్రముఖులు 199 మందిని, తమవెంట గాజాకు తరలించుకెళ్లారు 'హమాస్' వీరులు! ఇజ్రాయిల్ చేతిలో రోజూ చస్తూ బతకటం కన్నా, బతకటం కోసం చద్దాం!" అన్న పాలస్తీనా ప్రజల ఆకాంక్షనుండి పుట్టిన పోరాట సంస్థయే 'హమాస్'.

నాటి నుండి ప్రతికార చర్యల పేరిట హాస్పిటల్స్, స్కూల్స్,- మసీదులు, నివాస గృహాలపై విచక్షణా రహితంగా బాం బులు కురిపించింది. 'గాజా'ను శ్మశానం చేసాడు నెతన్యాహూ! జూలై (24 సం॥) నాటికి నలభై వేల మంది కాలిపోగా, లక్షల సంఖ్యలో నిర్వాసితులు, వికలాంగులయ్యారు. అంతేగాదు, ఇరాన్ రాజధాని టెహరాన్‌కు అతిథిగా వెళ్లిన 'హమాస్' అగ్రనేత 'ఇస్మాయిల్ హనియా' ను-లెబనాన్ రాజధాని బీరూట్ కెళ్లి అక్కడ 'హిజబుల్లా' సీనియర్ మిలిటరీ కమాండర్ 'షాద్ షుకుర్' ను ఒకే రోజు 31జులై 24న హతమార్చింది ఇజ్రాయిల్! తద్వారా ప్రపంచంలో ఎవరినైనా, ఏదేశాని కెళ్లైనా చంపేస్తాం, తస్మాత్ జాగ్రత్త! అని ప్రపంచ దేశాలకు సవాలు విసిరింది ఇజ్రాయిల్!

నెతన్యాహూ బలగర్వం-అరబ్‌దేశాల ఐక్యత

నాడు 'హిట్లర్' దురహంకారం ప్రపంచ దేశాలను ఐక్యం చేసినట్లు 'మోడీ' లెక్కలేని తనమే 'ఇండియా' కూటమికి బీజం వేసినట్లు 'నెతన్యాహూ' బలగర్వమే, పాలస్తీనా పోరాట సంస్థలను, అరబ్‌దేశాలను ఐక్యం చేసింది! పాలస్తీనా విముక్తి కోసం విడివిడిగా పోరాడుతున్న గాజాలోని 'హమాస్' వెస్ట్‌బ్యాంక్‌లోని 'ఫతా'లతో సహా పద్నాలుగు పార్టీలు, సంస్థలన్నీ సమైక్యంగా పోరాడేందుకు, ఒకే జాతీయ ప్రభుత్వ రూపకల్పనకు చైనా మధ్యవర్తిత్వంతో అంగీకరించినయ్! అలా 'పాలస్తీనా జాతీయ కూటమి' చిగురించింది.1967 నాటి సరిహద్దులతో-తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు అంగీకరిస్తేనే, ఇజ్రాయిల్ సంబంధాలు కొనసాగిస్తామని, అమెరికా అనుకూల 'సౌదీ అరేబియా'తో సహా యూఏఈ దేశాలన్నీ తెగేసి చెప్పినయ్. 'ఓరక్త పిపాసీ నెతన్యాహూ! తక్షణం పాలస్తీనాపై మారణకాండను ఆపెయ్' అంటూ ఎర్రచొక్కాలతో, మిన్నంటే నినాదాలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు అమెరికాలోని యూదులు! ఇండిపెండెంట్ 'బెర్నీ శాండల్స్'తో సహా యాభై మంది డెమోక్రటిక్ సెనేటర్లు' నెతన్యాహూ ప్రసంగాన్ని బహిష్కరించారు.'రషీదాతైబ్' అను సెనేటర్ "యుద్ధ నేరస్తుడు నెతన్యాహూ!" అన్న ప్లకార్డును వైట్‌హౌస్ ఛాంబర్‌లోనే - ప్రదర్శించాడట.పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం అధర్మం. ఈ చర్యల్ని ప్రపంచ దేశాలూ ఖండిస్తున్నాయి. "ధర్మమేవ జయతే!" పాలస్తీనాకు విజయోస్తు! ప్రపంచ శాంతి వర్ధిల్లుగాక!

> మిగిలిన అరబ్బులను 'గాజా' 'వెస్ట్‌బ్యాంక్'లలో కుక్కి అక్కన్నుండి వాళ్లు వెలుపలకు రాకుండా సరిహద్దు - చుట్టూ 60కి॥ మీ॥ మేర లక్షల కోట్ల రూ॥తో క్షిపణి నిరోధక ఉక్కుకంచెను నిర్మించుకున్నది ఇజ్రాయిల్! అయినా సరే! ఇజ్రాయిల్ నిర్బంధంలో చిత్రహింసలకు గురవుతూ బందీలుగా ఉన్న ఆరువేల మంది పాలస్తీనా విముక్తి పోరాట యోధులను విడిపించుకోటానికి 7అక్టోబర్2023న ఉక్కు కంచెను ఛేదించుకుని ఇజ్రాయిల్‌లో ప్రవేశించి, వివిధ రంగాల ఇజ్రాయిల్ ప్రముఖులు 199 మందిని, తమవెంట గాజాకు తరలించు కెళ్లారు 'హమాస్' వీరులు! ఇజ్రాయిల్ చేతిలో రోజూ చస్తూ బతకటం కన్నా, బతకటం కోసం చద్దాం!" అన్న పాలస్తీనా ప్రజల ఆకాంక్షనుండి పుట్టిన పోరాట సంస్థయే 'హమాస్'.

నవతెలంగాణ

ఖమ్మం

శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com



సీఐ రాజిరెడ్డిని కలిసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఖమ్మంరూరల్ సీఐ రాజిరెడ్డిని శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రూరల్‌లో అందించిన సేవలను కొనియాడారు. ఖమ్మంరూరల్ సీఐగా సుమారు రెండు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించి బుధవారం రాత్రి హైదరాబాద్ మల్టీ జోన్‌కు బదిలీ అయిన సీఐ రాజిరెడ్డిని కలిసి వీడ్కోలు చెప్పారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సీఐను కలిసిన వారిలో పార్టీ ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, మండల నాయకులు పి.మోహన్‌రావు, తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, తాటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిఐలు ఉదయ్‌కుమార్, రాము

నవతెలంగాణ-ఖమ్మం

మత్తు పదార్థాల వాడకం వల్ల ఎదురయ్యే అనర్థాలపై యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు నగరంలోని ఏఎస్ఆర్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహించి యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సిఐ ఉదయ్ కుమార్, టిజిఏఎన్బీ సిఐ రాము మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మహమ్మారిని అరికట్టడానికి పోలీసులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని అన్నారు. దీనివల్ల సత్ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



నేడు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు

నవ తెలంగాణ-మధిర

సమాజంలో పెరిగిపోతున్న డ్రగ్స్ మహమ్మారిని, మాదక ద్రవ్యాలను అరికట్టాలని శనివారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే డ్రగ్స్ వ్యతిరేక జిల్లా సదస్సును జయప్రదం చేయుటకు యువతీ, యువకులు, విద్యార్థులు తరలిరావాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, మధిర టౌన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని అన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ ముజమ్మిల్.ఖాన్, సీపీ సునీల్‌దత్, డీపీఈఓ జి.నాగేంద్రరెడ్డి, డిఈఓ సోమశేఖర్ శర్మ, డిఐఈఓ రవిబాబు హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డివైయఫ్ఐ టౌన్ అధ్యక్షులు పల్లపు గోపీ, ఏడుకొండలు, బాలకృష్ణ, బాబ్జి, నాగరాజు, స్వామి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు శశిపూర్ణ ప్రజలకు సూచించారు. వెంకటాపురం గ్రామంలో బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో జ్వరం, జలుబు, దగ్గు, షుగర్, బిపి వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 78 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శశిపూర్ణ మాట్లాడుతూ కాచి చల్లార్చిన మంచినీళ్లను తాగాలని వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ కాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్ శాయిరెడ్డి, ఎంఎల్‌హెచ్పి కుమారి, సెక్రటరీ మాధవ్, మాజీ సొసైటీ అధ్యక్షులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు వితరణ

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని న్యూలక్ష్మీపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెపొంగు రమేష్ ఆధ్వర్యంలో రమేష్ తన సొంత ఖర్చులతో యూత్‌కు క్రికెట్ కిట్టును వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడపై ఆసక్తి ఉన్న యూత్ ఆటలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్, గ్రామ మాజీ సర్పంచ్ వాగదాని కన్నయ్య, మాజీ వార్డు సభ్యులు మారుతి వీరయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు పురుషోత్తం, కొట్టే శ్రీనివాసరావు మహమ్మద్ ఖాసింబాబు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ విద్యా పథకం ద్వారా ప్రోత్సాహక నగదు అందజేత

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ బాలికలకు కల్లూరు కెనరా బ్యాంక్ వారు విద్యా జ్యోతి పథకం కింద ప్రోత్సాహకారంగా 24 వేల రూపాయలు బ్యాంక్ మేనేజర్ పద్దం సురేష్ చేతుల మీదగా అందజేశారు. గత సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 8, 9, 10 తరగతికి చెందిన నందిని, నికిత, అఖిలకు 5వేలు చొప్పున 5, 6, 7 తరగతులకు అనుప్రియ, శాలిని గౌతమికి 3వేల రూపాయలు చొప్పున మొత్తం 24 వేలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్రు మధుసూదన్‌రావు, ఏపీసి చైర్మన్ గంతోటి సునీత, ఉపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, గాంధీ నాయక్, చిన్ను సాహెబ్, శారద, సరిత, రమాదేవి, శ్రీనివాస్, శిరీష, మేకల శ్రీనివాసరావు, నేతాజీ, వీర మోహన్, మల్సూర్, నజీమున్నిస, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే...

సంక్షేమానికి పెద్దపీట

ఓర్వలేక బీఆర్ఎస్ నేతలవి 'కారు' కూతలు

- లెక్కలు రాకనే సీతారామలో 90శాతం వాళ్లే పూర్తి చేశామంటున్నారు
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే రాగమయి
- ఎంపీ నిధులు సత్తుపల్లికి అధికంగా ఇవ్వాలి: టీడీసీ చైర్మెన్ మువ్వా



నవతెలంగాణ-సత్తుపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ ప్రభుత్వమని, ఈ నేపథ్యంలోనే నిధుల కేటాయింపులో సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సత్తుపల్లి వచ్చిన ఎంపీ రఘురాంరెడ్డి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధికారిక క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కారు కూతలు కూస్తున్నారని ఎంపీ విమర్శించారు. అసలు బీఆర్ఎస్ నాయకుల ఊసు ఎత్తడమనేది సుద్ద దండగన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ. 19వేల కోట్లు ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం రూ. 8వేల కోట్లు మాత్రమే ఖర్చుచేసి 90శాతం మేమే కట్టామనడాన్ని బట్టిచూస్తే వాళ్లకు లెక్కలు రావని తేటతెల్లమవుతుందన్నారు. కేవలం మోటార్లు కొనుగోలు చేసి ప్రాజెక్టును పూర్తి చేశామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ 10యేండ్ల పాలనలో రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులను అందిపుచ్చుకోలేక పోయిందన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో విమానాశ్రయం, ప్యాసింజర్ రైలుకోసం పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. ఆ దిశగా కృషి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడాన్ని కేటీఆర్ అవహేళన చేస్తున్నారన్నారు. కేటీఆర్ తాను మాట్లాడిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మహిళకు మంత్రివర్గంలో చోటు కూడా కల్పించలేక పోయారని, మహిళల పట్ల కేటీఆర్‌కు చులకన భావం ఉందనడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శమన్నారు. రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయబాబు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గానికి అధిక మొత్తంలో ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేయాలని ఎంపీ రఘురాంరెడ్డిని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోనే సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని మువ్వా గుర్తు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి అభివృద్ధికి ఎంపీ రఘురాంరెడ్డి పూర్తి సహకారం అందించాలన్నారు. 50వేలు మెజార్టీ ఇస్తామని చెప్పి 60వేలకు పైగా మెజార్టీని తీసుకొచ్చామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, మందపాటి ముత్తారెడ్డి, రామిశెట్టి సుబ్బారావు, ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్, గాదె చెన్నకేశవరావు, కౌన్సిలర్ కంటె నాగలక్ష్మి పాల్గొన్నారు.



రైతులకు ఊతం లేదు...

మాటల్లో జీవం లేదు

- నిరాశపరిచిన ముఖ్యమంత్రి సభ
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సాగుకు జీవం, రైతుకు ఊతం' సభ రైతులను, వైరా ప్రజలను నిరాశ పరిచిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగిన సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని హామీ తప్ప ఏ ఇతర అంశాలపై స్పష్టత లేదని అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్లో కేటాయించిన 687 కోట్లు రూపాయలు నిధులు మిగిలిన భూసేకరణ పరిహారం చెల్లింపులు కూడా సరిపడవని, ముఖ్యమంత్రి హామీ ప్రకారం రెండు సంవత్సరాల్లో ప్రాజెక్ట్ సంపూర్ణంగా పూర్తి కావాలంటే అవసరమైన ఎనిమిది వేల కోట్ల రూపాయలు గ్రీన్ చానల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి అవసరం ఉందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ, నాగార్జున సాగర్ ఎడమ కాలువ లింక్ కెనాల్ రాజీవ్ సాగర్‌కు భూములు ఇచ్చిన రైతులకు కనీసం పరిహారం కూడా ముఖ్యమంత్రి ప్రకటించలేదని అన్నారు. భూ పరిహారం ఎకరాకు ఏభై లక్షల రూపాయలు అందించాలని కోరారు. రైతు రుణమాఫీ మూడు విడతల్లో 22,37,848 మంది రైతులకు 17,933 కోట్ల రూపాయలు విడుదల చేసిందని, మిగిలిన రైతులకు నాలుగో విడత ఎప్పుడు అనేది ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు స్పష్టత ఇవ్వకుండా రైతన్నలకు రుణ విముక్తి అంటూ దాటవేత ధోరణి ప్రదర్శించారని, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించిన 32.50 లక్షల మంది రైతులు 31 వేల కోట్ల రూపాయలులో మిగిలిన 10,12,152 మంది రైతులు 13,067 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ ఎప్పుడు పూర్తి చేస్తారో అని రైతులు సభ నుంచి నిరాశతో వెనుదిరిగారని, ముఖ్యమంత్రి చేతులు మీదుగా రుణమాఫీ చెక్కులు అందిస్తామని రైతులను పిలిచి చెక్కులు ఇవ్వలేదని అన్నారు. రేషన్ కార్డులు లేని 6 లక్షల మంది రైతులు కుటుంబ నిర్ధారణ పూర్తి చేసి రుణమాఫీ నిధులు విడుదల గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయలు మించి అప్పు ఉన్న రైతులను ముందస్తుగా చెల్లింపు చేయాలంటే వ్యవసాయ సీజన్లో రైతులు డబ్బులు ఎక్కడ తీసుకువచ్చే పరిస్థితి లేదని, రైతు అప్పు ఎంత ఉన్నా ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయలు రైతు ఎకౌంటుకు జమ చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి వైరా నియోజకవర్గ కేంద్రంలో సభ సందర్భంగా వైరా అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రకటిస్తారని వైరా ప్రజలు ఆశపడి భంగపాటుకు గురయ్యారని అన్నారు. వైరా నుంచి తల్లాడ వైపు జాతీయ రహదారి రెండు వైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, వైరా మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ లేక పినపాక బ్రిడ్జి క్రింద డంపింగ్ చేయడం, వాసవి కళ్యాణ మండపం రహదారి, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, వైరా బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్డు నిర్మాణం, వైరా రిజర్వాయర్ చుట్టూ ట్యాంక్ బండ్ నిర్మాణం, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మాణం, రింగ్ రోడ్డులో షాపింగ్ సముదాయం నిర్మాణం, మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా స్థానిక శాసనసభ్యులు వేదికపై నుంచి విజ్ఞప్తి చేసినా సానుకూల స్పందన రాలేదు అన్నారు. వైరా సభ రైతులు, ప్రజలను నిరాశ పరిచిందన్నారు. సమావేశంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ప్రభుత్వ వైద్యశాలను వెంటనే ప్రారంభించాలి

- సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మధిర



మధిర పట్టణంలో ఎన్జీవోస్ కాలనీలోని వంద పడకల ప్రభుత్వా వైద్యశాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022న 37కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారన్నారు. ఎలక్షన్ కంటే ముందే 100 పడకల వైద్యశాల పనులు పూర్తయినప్పటికీ ప్రారంభించలేదన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఆస్పత్రి ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. మధిర పట్టణంలోని సివిల్ హాస్పిటల్ పాతబడిపోయి పెచ్చులు ఊడుతున్నాయని, ఇటీవల ఒక డాక్టర్ పైన పెచ్చులు పడి గాయాలయ్యాయని, రోగులకు సరైన వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని అధికారులతో మాట్లాడితే "కొత్త ఆసుపత్రి ఉంది కదా ఇప్పుడు ఈ హాస్పిటల్‌ని ఏం చేయలేము" అని నెలలు తరబడి చెప్తున్నారని అన్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల కోటిన్నర రూపాయలు ఆసుపత్రి అదనపు నిర్మాణం, పారి గోడ, లైట్స్, ఆక్సిజన్ నిధులు కేటాయించారని, ఆ పనులు కూడా త్వరగా పూర్తిచేసి వెంటనే ఆసుపత్రిని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండవ ఫణీంద్ర కుమారి, మందా సైదులు, రామనర్సయ్య, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, కిషోర్, రామ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



షరతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గ్రామాల్లో సొంత ఇళ్లు కలిగి ఉండి ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్న వారికి ఎలాంటి షరతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు ఖమ్మంగ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ అరుణకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడారు. గ్రామాల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్లపై షరతులు పెడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రూరల్ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి షరతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఊరడి సుదర్శన్‌రెడ్డి, పి.మోహన్‌రావు, నందిగామ కృష్ణ, తోట పెద్దవెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

ఆళ్లపాడును వణకిస్తున్న జ్వరాలు

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోటకూర వెంకటేశ్వరరావు చికెన్ గున్యా వ్యాధితో బాధపడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పాడు గ్రామాన్ని వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ఇప్పటికే మంద వెంకట నరసమ్మ అనే మహిళ ఇటీవల జ్వరంతో మృతి చెందింది. గ్రామంలో విష జ్వరాలు తారాస్థాయికి చేరాయి. ప్రతి ఇంటికి ఒకరిద్దరు విష జ్వరాల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ మొక్కుబడిగా క్యాంపు నిర్వహించడమే కానీ జ్వరాల అదుపుకు గట్టి చర్యలు తీసుకోవడం లేదు. అనేకమంది పేద వర్గాల వారు డెంగ్యూ, చికెన్ గున్యా, విష జ్వరాల బారినపడి మధిర, ఖమ్మం ప్రయివేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. దీంతో వేలాది రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేయవలసి వస్తుంది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు శానిటేషన్ పనులు చేయించకపోవడం వల్ల దోమలు ప్రబలి విష జ్వరాలకు కారణం అవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షేక్ మహమ్మద్ అలీ ఆయన భార్యకు చికెన్ గున్యా నిర్ధారణ అయింది. షేక్ నన్నే ఇంట్లో ఆయన భార్య, కూతురు జ్వరంతో బాధపడుతున్నారు. అల్లిక రాములు, అల్లిక వెంకట రావమ్మ జ్వరంతో బాధపడుతున్నారు. ఎస్సీ కాలనీలో మొండితో పెద్ద యేసు, ఆయన భార్య లక్ష్మి ఇద్దరికీ వారం నుండి జ్వరం వస్తుంది. బీసీ కాలనీలో గడుబోతుల నాగమ్మ, పదిలం నరసయ్యలకు జ్వరం వస్తుంది. గత కొన్ని రోజులుగా మండలంలోని చిరునోముల, బోనకల్, రావినూతల, ఆళ్లపాడు తదితర గ్రామాలలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అనేక కుటుంబాలు మంచాన పడుతున్నాయి. ప్రధానంగా ఆళ్లపాడులో పరిస్థితి చేయి దాటిపోతుంది. ఆ గ్రామ ప్రజలు నిత్యం భయానక వాతావరణంలోనే జీవనం సాగిస్తున్నారు.

సొసైటీలో మేమూ సభ్యులం..! ఆ భూముల్లో మాకూ హక్కుంది...!!

- బినామీల పేరుతో సాగును తక్షణమే ఆపాలి
- సొసైటీలో అక్రమంగా చేర్చిన సభ్యులను తొలగించాలి
- ఇతరులకు ఇస్తున్న కౌలును రద్దుచేయించాలి
- సొసైటీలో ప్రక్రియను తక్షణమే జరపించాలి
- విలేకర్లతో గంగారం గిరిజన సొసైటీ బాధిత సభ్యుల ఆవేదన

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారం గిరిజన సొసైటీకి చెందిన భూముల విషయంలో సభ్యులుగా ఉన్న తమను సొసైటీలోని కొందరు వ్యక్తులు తీరని అన్యాయానికి గురిచేస్తున్నారని ఈ సొసైటీకి చెందిన బాధిత సభ్యులు శుక్రవారం గంగారం గట్టుబజారులో విలేకర్లతో మాట్లాడుతూ తమ ఆవేదనను వినిపించారు. 1971-72లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గట్టుబజారు, ఎస్టీ కాలనీకి చెందిన రెండు గిరిజన వర్గాలకు చెందిన కుటుంబాలకు ఒక్కో వర్గంలో 25మంది సభ్యులుగా నిర్ణయించి ఆ రెండు వర్గాల నుంచి 50 గిరిజన కుటుంబాలకు ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయించి 125 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక్కో సభ్యుడికి 2.20 ఎకరాల చొప్పున హక్కు కల్పించినట్లు పేర్కొన్నారు. భూములొచ్చిన కొత్తలో ఐటీసీ కంపెనీ వారు వారి సౌజన్యంతో ఓ బోరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 10యేండ్ల వరకు 50మంది సభ్యులంతా ఉమ్మడిగా మెరక పంటలు (అపరాలు) సాగుచేసుకుంటూ కుటుంబాల జీవనం సాగించామమన్నారు. ఐటీసీ వారు వేసిన బోరు చెడిపోవడంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన బాబ్జీ అనే కార్పొరేట్ వ్యవసాయదారుడు వచ్చి మీ పొలాల్లో బోర్లు వేయించి, చుట్టూ ఫెన్సింగ్‌కు ఏర్పాటు చేయించి ఓ 10యేండ్ల పాటు పంటలు పండించుకుంటానంటూ హామీ ఇవ్వడంతో సొసైటీ సభ్యులు ఒప్పుకొని అతనికి భూములు అప్పగించడం జరిగిందని తెలిపారు. 10యేండ్లు దాటి 12యేండ్లు కావడంతో ఇక వ్యవసాయం చేయొద్దని, భూములు అప్పగించమని కోరడంతో సదరు బాబ్జీ తనకు సొసైటీ వాళ్లు అప్పగించిన రికార్డులను ప్రస్తుతం ఆధిపత్యం చెలాయిస్తున్న ఎస్టీ కాలనీకి చెందిన సభ్యులకు అప్పగించి వెళ్లారని, ఆ రికార్డులు వాళ్ల వద్దకు చేరిన దగ్గర నుంచి గట్టుబజారుకు చెందిన సొసైటీ సభ్యులకు అన్యాయం జరుగుతూ వస్తోందని వారు వివరించారు. రికార్డులు తమ దగ్గరే ఉన్నాయని దుర్బుద్ధి మొదలై కుటుంబంలో ఒక్కరే ఉండాలనే నిబంధనలకు విరుద్ధంగా వారి కుటుంబాలకు చెందిన వారిని సభ్యులుగా చేర్చుకోవడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సొసైటీలో సభ్యులుగా చేర్చుకుంటూ పోవడంతో 25మందిగా ఉన్న ఎస్టీ కాలనీకి చెందిన సభ్యుల సంఖ్య ప్రస్తుతం 47మందికి చేరిందన్నారు. గట్టుబజారుకు చెందిన 25 మంది సభ్యుల్లో 9మంది సభ్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడటంతో ప్రస్తుతం 16 మంది సభ్యులు మాత్రమే స్థానికంగా ఉంటున్నామన్నారు. మా 16మందికి సొసైటీలో సభ్యులుగా రాజముద్ర ఉన్నప్పటికి ఎస్టీ కాలనీకి చెందిన సొసైటీ సభ్యులు రికార్డులు తమ దగ్గర ఉన్నాయనే ధైర్యంతో తమను మా భూముల దరిదాపులకు కూడా మమ్మల్ని రానీయడం లేదని నిట్టూర్చారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు కౌలుకు ఇస్తూ...

సొసైటీ సభ్యులే వ్యవసాయం చేసుకోవాలి, ఇతరులకు కౌలుకు ఇవ్వరాదనే నిబంధనలను త్రోసిరాజని గంగారం గ్రామానికి చెందిన పిడుగు సత్యం, ఆంధ్రా ప్రాంతానికి చెందిన గోవిందరాజులు అనే వ్యక్తులకు కౌలుకి ఇస్తూ తమను అన్యాయం చేస్తున్నారని గట్టుబజారుకు చెందిన సొసైటీ సభ్యులు వాపోయారు. రికార్డుల్లో తమ పేర్లున్నాయని, వెంటనే అధికార యంత్రాంగం కలుగ చేసుకొని సొసైటీ భూముల్లో తమకు స్థానం కల్పించాలని వారు కోరారు. అంతేగాక గత ఐదారేండ్లుగా సొసైటీకి ఎన్నికలు నిర్వహించని కారణంగా సభ్యుల లావాదేవీల విషయంలో మనస్పర్థలు ఏర్పడి తరచూ గొడవలు జరుగుతున్నాయని వారు తెలిపారు. తమ భూములు తమకు ఇప్పించడంతో పాటు సొసైటీకి తక్షణమే ఎన్నికలు జరపాలని వారు కోరుతున్నారు. ఈ సమావేశంలో ఊకే రమష్, సోయం వెంకటేశ్వరరావు, సోయం గోవిందరావు, ఊకే వెంకప్ప, ఊకే పొట్టి, సోయం కోటేశ్వరరావు, సవలం ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం



ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటల నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులను కలవనున్నారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయబాబుతో కలిసి పరామర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామానికి చేరుకుంటారు. సీనియర్ నాయకులు కన్నేటి వెంకన్న కుటుంబ సభ్యులను ఓదారుస్తారు.



ఎస్ఆర్ఎస్పీ కాలువ పెండింగ్ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కూసుమంచి

మండలం పరిధిలోని గంగబండతండ పంచాయతీ శివారు రావిచెట్టుతండా సమీపంలో ఎస్ఆర్ఎస్పీ కాలువ పెండింగ్ పనులు జరుగుతున్నాయి. కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత ఇరిగేషన్ అధికారులను త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు.
క్యాంప్ కార్యాలయ ఇన్చార్జీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన శ్రీనివాస్ రెడ్డి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొళ్ళంపల్లి సుధాకర్ రెడ్డి, పెంద్ర అంజయ్య, చిలకబత్తిని రామారావు, చాట్ల పరుశురామ్, కనతాల నాగయ్య, అర్వపల్లి జనార్థన్, మాజీ ఎంపీపీ యడవల్లి ముత్తయ్య, బొమ్మగాని వెంకటేశ్వర్లు, భిక్షం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించిన ఎండీఓ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ఎండీఓ డి.చంద్రశేఖర్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ప్రజలకు అవగాహన కల్పిస్తూ నీటి నిల్వలు ఎక్కువ రోజులు ఉంటే లార్వా చేరి దోమ వృతి పెరుగుతుందని దీంతో పాటు డెంగ్యూ దోమ కూడా ఉధృతి చెందే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. గ్రామాల్లోని అన్ని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పవిత్రోత్సవాలు ముగింపు

- శ్రీవారికి కోనేటిలో చక్రస్నానం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రతి సంవత్సరం వలె నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం మూడో రోజుతో ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ తెలిపారు. పవిత్రోత్సవాలు ముగింపులో భాగంగా పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, అనంతరం శ్రీవారిని వేదమంత్రోచ్ఛరణాల నడుమ మేళ తాళాలతో పల్లకిలో కోనేటి వరకు తోడుకొని వచ్చి శ్రీ వారికి కోనేటిలో చక్రస్థానంతో పవిత్రోత్సవములు ముగింపు పలికారు. ఉదయం స్వామి వారి ప్రాతకాల అర్చన అనంతరం యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో స్వామివారికి అనుస్థానములు, హెూమములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు విజయకుమారి, ఆలయ ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ, అర్చ కులు రాజీవ్ శర్మదేవస్థాన సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



శ్రీనిధి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-మధిర

శ్రీ నిధి డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల చైర్మెన్, ప్రిన్సిపల్ అనిల్ కుమార్ నెహ్రూ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినా ఎస్జెకేయం విద్యా సంస్థల డైరెక్టర్ డి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే యువత ఉన్నత శిఖరాలకు వెళ్తారని సంభోదించారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి కూడా తమ తల్లిదండ్రుల ఆశయాల మేరకు మంచి ప్రవర్తనతో విద్యని కొనసాగించాలని ఈ పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని చేరుకోవాలంటే కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులకి చూసించారు. అనంతరం డిగ్రీ కాలజీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, డైరెక్టర్ రమేష్, డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ బుచ్చిబాబు, ఏవో సాంబ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే అలైన్ మెంట్ మార్పు కోరుతూ ఎంపీ రఘురాం రెడ్డికి వినతి

నవతెలంగాణ-ఖమ్మం



కొత్తగా మంజూరైన డోర్నకల్ - మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్ మెంట్ మార్పునకు కృషి చేయాలని కోరుతూ ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి ఆయా మండలాల రైతుల తరఫున ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో ఈ రైల్వే లైన్ రానుందని, విలువైన వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. రైతులకు మేలు జరిగేలా అలైన్ మెంట్ మార్చాలని కోరారు. సమస్యను పూర్తిగా విన్న ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. తప్పకుండా రైల్వే జీఎం, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లం శ్రీను, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, సాదిక్, పోట్ల యోగేందర్, ఉప్పల్ రావు, పుచ్చకాయల సుధాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ ఆర్.వి. కర్ణన్

నవతెలంగాణ-ఖమ్మం

డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. శుక్రవారం కమీషనర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి అధికారులతో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ నియంత్రణ, వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోను డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయని, డెంగ్యూ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖతోపాటు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రై డే కార్యక్రమాల వల్ల దోమల వృద్ధిని అరికట్ట వచ్చన్నారు. పరీక్షలు పెంచాలని, పాజిటివ్ వచ్చినచో, సంబంధికులు, చుట్టుప్రక్కల నమూనాలు సేకరించడం, నియంత్రణ చర్యలు చేపట్టడం చేయాలన్నారు. వార్డులో 24 గంటలు వైద్యాధికారి అందుబాటులో ఉండి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సేకరించే నమూనాలు టి హబ్ కు, ప్రయివేట్ ఆసుపత్రుల నమూనాలు ఐడిఎస్పి ల్యాబ్ లకు పంపి పరీక్షలు చేయించాలని అన్నారు. ప్లేట్లెట్ కౌంట్ పై ప్రజల్లో భయం పోగొట్టి తగు చికిత్స అందించాలని అన్నారు. ప్లేట్లెట్, బ్లడ్ సరిపోవునంతగా అందుబాటులో ఉండేట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పై దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. కావాల్సిన మందులకు ఇండిట్ పంపాలన్నారు. మంజూరు పోస్టులు భర్తీ చేయాలన్నారు. తొలుత కమీషనర్ కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రెఫరల్, అంబులెన్స్, డెలివరీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఇడిడి లు వివరాలు అడిగి, రెగ్యులర్ గా పర్యవేక్షణ చేస్తున్నది అడిగారు. ల్యాబరేటరీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయుష్ ఓపి రోజువారి ఎంతమంది వస్తున్నది అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు పెంచాలని, గర్భిణులకు రెగ్యులర్ చెకప్ అయ్యేలా చూడాలని, మెరుగైన సేవలు అందించి నమ్మకం పెంచాలని అన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకై పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.



జిల్లా ప్రధాన ఆస్పత్రిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమీషనర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. రేడియాలజీ కేంద్రాన్ని పరిశీలించి, ఎంతమంది టెక్నీషియన్లు ఉన్నది, ఎన్ని పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. మామోగ్రఫీ చేపడుతున్నది, ఎన్ని కేసులు చేసింది అడిగారు. పరీక్షల రిజిష్టర్ పరిశీలించారు. టీ హబ్ కేంద్రాన్ని పరిశీలించారు. డెంగ్యూ పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి రోజువారి వస్తున్న పరీక్షల శాంపిల్స్, ఏఏ పరీక్షలకు ఎక్కువగా శాంపిల్స్ వస్తున్నది, టి హబ్ లో ఎన్ని రకాల పరీక్షలు చేపడుతున్నది, ఎంత వ్యవధిలో పరీక్షా ఫలితాలు అందజేస్తున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దానవాయిగూడెం లో క్షేత స్థాయిలో పర్యటించి డ్రై డే కార్యాచరణ చేపట్టారు.
జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం జిల్లాలో డ్రై డే ను పటిష్టంగా చేపడుతున్నట్లు తెలిపారు. స్లమ్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం, వైద్య శిబిరాలు నిర్వహించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్య జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, డిటీసీఓ డాక్టర్ సుబ్బారావు, ఇంచార్జ్ జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డాక్టర్. సీతారాం, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ రామకష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. కిరణ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రారంభించింది సీతారామ ప్రాజెక్టా లేక సత్తుపల్లి ప్రాజెక్టా..

టీడీపీ ఖమ్మం పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్

నవతెలంగాణ-ఖమ్మం

సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించింది సీతారామ ప్రాజెక్టా లేక సత్తుపల్లి ప్రాజెక్టా అని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ విమర్శించారు. శుక్రవారం ఖమ్మంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రారంభించింది సీతారామ ప్రాజెక్టా లేక సత్తుపల్లి ప్రాజెక్టా అని ఎద్దేవా చేశారు. ఎందుకంటే సీతారామ ప్రాజెక్ట్ అయితే ఆ కాలువ ప్రయాణించే 140 కిలో మీటర్ల మేర గిరిజన ప్రాంతంలో ఎక్కడ భూములకు నీరు విడుదల చేసారో తెలపాలన్నారు. గోదావరి జలాలను జూలూరుపాడు నుండి ఇప్పటికే వాడకంలో ఉన్న సాగర్ ఆయకట్టుకి ఇవ్వడాన్ని క్రిష్ణా, గోదావరుల సంగమం అని ఎలా అంటారని ప్రశ్నించారు. ఎడారి ప్రాంతంగా ఉన్న గిరిజన ప్రాంతాన్ని వదిలేసి, ఇప్పటికే నీటి సౌకర్యం ఉన్న సత్తుపల్లి ప్రాంతానికి నీరు తీసుకపోవటం గిరిజన ప్రాంతానికి ద్రోహం చేయటం కాదా అని అన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులకు ఎందుకు కామేపల్లి, కారేపల్లి లాంటి గిరిజన ప్రాంతాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టుకి నీరు ఇచ్చే ఉద్దేశం ఉంటే దీనిని ఎందుకు పాలేరు చెరువుకు అనుసందానం చేయటం లేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా బహిరంగ సభలో సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డి.పి.ఆర్ ను కెసిఆర్ తయారు చేయలేదని అనటంలో అంతర్యం ఏంటని అన్నారు. ఈ జిల్లాకి ముఖ్యమంత్రిగా వచ్చారా లేక మీ మంత్రుల కోరికలు తీర్చటానికి వచ్చారా అని ప్రశ్నించారు. లేకుంటే ఏ ఒక్క ప్రజాసమస్య గురించి ఎందుకు మాట్లాడ లేదని ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన టిడిపి డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, సున్నా నవీన్, కర్నాటి సీతారాములు, టీడీపీ నాయకులు పాలడుగు క్రిష్ణప్రసాద్, నాగార్జున శ్రీనివాస్, కర్నాటి అశ్వనీకుమార్, కన్నేటి పృథ్వీ, కోనేరు అన్వేష్, పాల్గొన్నారు.





అప్రమత్తతతోనే వ్యాధుల నియంత్రణ

నవతెలంగాణ-పెనుబల్లి

వర్షాకాలంలో వచ్చే వివిధ రకాల వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉంటేనే వ్యాధుల నియంత్రణ సాధ్యం అవుతుందని జన విజ్ఞాన వేదిక ప్రతినిధి, రచయిత యం. రాం ప్రదీప్ తెలిపారు. శుక్రవారం వి.ఎం బంజార్‌లోని స్థానిక లక్ష్య టాలెంట్ స్కూల్ లో జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన సీజనల్ వ్యాధులు –తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నియంత్రణ సాధ్యం అవుతుందని ఆయన తెలిపారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ముద్రించిన కర పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. జెవివి ప్రతినిధి సి.హెచ్. నరసింహారావు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన పరిటాల వెంకమ్మ, పోతురాజు లావణ్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం సిఫారస్ మేరకు చెక్కులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మహమ్మద్ అజ్గర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెపొంగు రమేష్,సేవాదళ్ మండల మాజీ అధ్యక్షులు ఊరుకొండ రాజు, కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షులు పోతురాజు పురుషోత్తం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ కోరుట్ల పద్మ, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్డి రఫీ, మారుతి వీరయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నవతెలంగాణ-బూర్గంపాడు

చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన గురువారం రాత్రి గౌతపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... మండల పరిదిలోని గౌతపురం కాలనీకి చెందిన కొమ్ము సంధ్య (24)కు ఏపీలోని కుక్కునూరు మండలం వింజరం గ్రామానికి చెందిన గొడ్ల సుధాకర్‌తో మూడేండ్ల కిందట వివాహమయింది. అప్పటి నుంచి సారపాకలో ఉంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో ఏడాది క్రితం సుధాకర్ అనారోగ్యంతో బాధపడతూ మృతి చెందాడు. భర్త మృతితో మనస్థాపం చెందుతున్న సంధ్య ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం అక్కడ నుంచి వైద్యుల సూచన మేరకు హైదారాబాద్ నిమ్స్ కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి సమయంలో మృతి చెందింది. శుక్ర వారం మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు, తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ ప్రొ.ముద్దసాని కోదండరామ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ నాయకులు గడ్డం ఆదాము అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేషంగా పని చేసి, రాష్ట్రాన్ని సాధించడంలో కీలక భూమికి పోషించిన కోదండరాం ఆ తర్వాతి కాలంలో రాష్ట్రం ఏర్పడ్డాక నాయకుల తీరుతో ఎంతో ఆవేదన చెందారన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్ఎల్‌సిగా కోదండరామ్‌కు స్థానం కల్పించడం నిజంగా హర్షించదగ్గ విషయం అన్నారు.
ఆయనతో కలిసి ఉద్యమంలో పని చేస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా అనేక పోరాటాలు చేసి రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు.



కేజీబీవీని సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహం పరిసరాలు, విద్యార్థుల కోసం సంక్షేమం కోసం ఉపాధ్యాయ సిబ్బంది తీసుకుంటున్న ఏర్పాట్లు పరిశీలన చేశారు. అనంతరం ఆయన వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను తనిఖీ చేసి, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడ మంచినీటి బోరు పనిచేయకపోవడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించిన తహసీల్దార్ అందుకు సంబంధించి సిబ్బంది ద్వారా విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే మిషన్ భగీరథ నీటి పైప్ లైన్ కూడా మరమ్మతులు ఉన్నట్లుగా గుర్తించి మిషన్ భగీరథ ఏఈ రామ్‌కు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే విద్యుత్ సర్వీసు వైరు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో అందుకు సంబంధించిన పనులను త్వరితగతిన చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన కోరారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించగా ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికింది. అనంతరం తహసీల్దార్ ములకపాడులోని ప్రయివేటు వాటర్ ప్లాంట్‌ను సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించి వాటర్ ప్లాంట్ నిర్వహణ జరపాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది విజయ్ తదితరులు ఉన్నారు.

గ్రామాలలో ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ములకపాడు, కాటాయిగూడెం గ్రామాలలో వయవృద్ధుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రత్యేకించి వయోవద్ధులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. మోకాళ్ళ నొప్పులు, గ్యాస్ ట్రబుల్, నడుము నొప్పి రక్తపోటు షుగర్, కీళ్ల నొప్పులు, మలబద్ధకం దగ్గు, అర్షమొలలు, చర్మ వ్యాధులతో పాటు మూత్ర సంబంధిత వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. అలాగే మహిళా సంబంధిత వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డిపిఎం మహేష్, ఫార్మసిస్ట్ రజిత, ఎస్‌సిఎస్ ఈశ్వర్, విజయ్ కుమార్, కిషోర్, తనూజ, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు రమణ, రమ్య అరుణ తదితరులు ఉన్నారు.

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తల్లాడ బాల భారతి విద్యార్థి

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ బాలభారతి విద్యాలయానికి చెందిన తోట అజయ్ కుమార్ గురువారం ఎర్రకోటలో నిర్వహించిన 78వ స్వాతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. గత నెలలో నిర్వహించిన ప్రేరణ ఉత్సవాల్లో పాల్గొని తన ప్రతిభను కనబరిచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పాల్గొనే అవకాశాన్ని పొందారు. ప్రధానితో మాట్లాడే అవకాశం పొందారు. భారతీయ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంటరాక్షన్ మీటింగ్లో 22 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా నుండి బాల భారతి విద్యార్థి పాల్గొనడం గర్వకారణం పాఠశాల యాజమాన్యం తెలిపింది. మండల విద్యాశాఖ అధికారి ఎం. దామోదర్ ప్రసాద్, కె.ఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అజయ్ కుమార్‌ను అభినందించారు.



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మహిళలపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు

- దిష్టిబొమ్మ దహనం - భేషరతుగా క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగిస్తుంటే ఓర్వలేని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్త పరిచారు. ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద టీపీసీసీ ఆదేశాల మేరకు కేటీఆర్ దిష్టి బొమ్మని దహనం చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా అత్యంత అవమానకరంగా మాట్లాడిన కేటీఆర్ మహిళలకు భేషరత్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, నాయకులు శీలం శ్రీనివాస రెడ్డి, బండారు నరసింహారావు, అనుమోలు వెంకటకృష్ణా రావు, కడియం శ్రీనివాసరావు, తలపురెడ్డి నాగిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, దేవరకొండ రాజీవ్ గాంధీ, దేవరకొండ శ్రీనివాసరావు, కంచర్ల వెంకట నరసయ్య, యన్నం పిచ్చిరెడ్డి, గుడేటి బాబురావు, రావూరి నాగబాబు, నాగిరెడ్డి శ్రీను, పసుపులేటి వెంకటనారాయణ, సూరంసెట్టి రాజేష్, మెట్టు కృష్ణ, వేమిరెడ్డి వెంకటరెడ్డి, ప్రఫుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న ఎంపీ బలరాం నాయక్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ పోరిక బలరాం నాయక్ శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. స్వామివారి పూజా కార్యక్రమాల్లో ఎంపీ బలరాం నాయక్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న వారిలో మాజీ గ్రంధాలయ చైర్మెన్ భోగాల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తాండ్ర నరసింహారావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాసమల రాము, అన్నెం రామిరెడ్డి, భూక్య రంగ, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు దర్శి సాంబశివరావు, ఎన్ఎస్‌యూఐ ఐయోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు చింతరెల సుధీర్, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు పీలక వెంకటరమణారెడ్డి, బూర్గంపాడు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు భజన సతీష్, మాజీ జెడ్పీటీసీ బట్ట విజయ గాంధీ, అబిద్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు వసంతాల రాజేశ్వరి, తుమ్మల రాణి, ఒంగోలు దేవకి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల కాంగ్రెస్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ రామకృష్ణకు సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ఇతర ప్రాంతంలో ఉన్నత అవకాశాలు వచ్చినప్పటికీ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోనే విధులు నిర్వహిస్తూ ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్ ముదిగొండ రామకృష్ణాను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాగంటి శారదా దేవి, మాగంటి సూర్యం బాబులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం అభినందినీయమన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాగంటి



సూర్యం జీవించిన కాలంలో కూడా ఈ ప్రాంతంలోని కళాకారులను కవులను ప్రోత్సహిస్తూనే ఈ ప్రాంతంలో పనిచేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందించే వారిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సీ.బాబురావుతో పాటు విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో త్రివేణి విద్యార్థిని నృత్య ప్రదర్శన

నవతెలంగాణ-కొత్తగూడెంటౌన్



స్థానిక లక్ష్మీదేవిపల్లిలో ఉన్న త్రివేణి పాఠశాల విద్యార్థిని 9వ తరగతి చదువుతున్న ఏ.లక్ష్మీసాహితికి 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని రాష్ట్రపతి నిలయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసే అవకాశం లభించింది. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారి లక్ష్మీ సాహితిని అక్కడ ఉన్న ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ విద్యార్థిని, నృత్య ఆచార్యులు డాక్టర్ సీతాలక్ష్మి ప్రసాద్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్స్ వైవీ. సురేష్, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య ఫాతిమా పాల్గొన్నారు.

18న తీజ్ సాంస్కృతిక శోభయాత్ర

నవతెలంగాణ-టేకులపల్లి

ఈనెల 18న టేకులపల్లి మండలంలోని సేవా ఘడ్ గ్రామం నుండి బోగ్ బండారో, తీజ్ సాంస్కృతిక శోభయాత్ర, సద్భా వన్ సభ, తీజ్ నిమజ్జనం కార్యక్రమము నిర్వహించబడునని గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని ప్రతి తండాలో భోగ్ బండారో, 11 గంటలకు మేరా మా యాడి పూజా కార్యక్రమం, రెండు గంటలకు తీజ్ తోడేరో కార్యక్రమం, మూడు గంటలకు శ్రీ కోదండ రామాలయం దేవాలయం వరకు తీజ్ సాంస్కృతిక శోభయాత్ర, ఐదు గంటలకు బంజారా సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటలకు సద్భావన సభ, ఏడు గంటలకు తీజ్ నిమజ్జనం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తండావాసులు గమనించాలని గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు భూక్యా కిషోర్ సింగ్ నాయక్, ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్, బానోతు సక్రునాయక్, బోడా మంగీలాల్ నాయక్, బోడ బాలు నాయక్, నాగేష్ విజ్ఞప్తి చేశారు.

తుమ్మలపై అసత్య ఆరోపణలు తగవు

- విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట

అభివృద్దే లక్ష్యంగా తన పని తాను చేసుకుంటూ పోతూ..ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై చేస్తున్న రాజకీయ అసత్య ఆరోపణలు జిల్లా ప్రజలంతా గమనిస్తున్నారని టీడీపీ మండల నాయకులు అన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో చిన్న అవినీతి మచ్చలేని నాయకుడని, చూసి జిల్లా ప్రజలు గర్వపడతారన్నారు. మనం వేరే ప్రాంతానికి వెళ్ళినప్పుడు ఖమ్మం జిల్లా లేదా సత్తుపల్లి అనగానే అవునా తుమ్మల నాగేశ్వరావు మీ మంత్రి అని ఆ జనం అన్నప్పుడు అవును అని మనం ఎంతో మందికి సమాధానం చెప్పాం. జిల్లా రైతాంగానికి ఉపయోగపడే గోదావరి జలాలను రైతాంగానికి అందించి రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలని పనిచేస్తూ ఉంటే మాజీ మంత్రి హరీష్‌రావు తుమ్మలపై రాజకీయాల కోసం అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. హరీష్ రావుకి కూడా తెలుసు తుమ్మల చేసే మంచి పని. రాజకీయ పార్టీలు విమర్శలు చేసిన జిల్లా రైతాంగం చాలా సంతోషంగా ఉందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో తుమ్మల ముద్ర ఉందని తెలిపారు. జిల్లా అభివృద్ధి చెందింది అంటే అది ఒక తుమ్మలకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎండి.వలీ పాషా, తెలుగు రైతు అధ్యక్షులు గడ్డిపాటి సత్యం, కోపరేటివ్ ఉపాధ్యక్షులు ఘట్టం ఎర్రప్ప నాయుడు, సుబ్బారావు, చిర్ర ధర్మారావు, బంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ శరత్ చంద్రని కలిసిన రోటరీ క్లబ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచల సీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి శరత్ చంద్రని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షులు ధారా బాలాజీరావు, ఉపాధ్యక్షులు షేక్ అజీమ్, కార్యదర్శి నూకల విద్యాసాగర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంలో భద్రాద్రి రామున్ని దర్శించేందుకు హై కోర్ట్ జడ్జి భద్రాచలం చేరుకోగా...ఈ సందర్భంగా జడ్జి శరత్ చంద్రని రోటరీ క్లబ్ తరపున శాలువతో సత్కరించారు. భద్రాచలం ప్రాంతానికి చెందిన శరత్ చంద్ర హైకోర్టు జడ్జి కావటం ఈ ప్రాంతానికే వన్నెతెచ్చారాని, భద్రాద్రి రాముని దీవెనలు వారికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

ఆదివాసీ సాంస్కృతి ప్రతిబింబించేలా మ్యూజియం

- జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



వేరే రాష్ట్రాల నుండి భద్రాచలంకు వచ్చే టూరిస్టులకు ట్రైబల్ కల్చర్ కు సంబంధించిన పాత తరం కళాకృతులు, వాటి చరిత్ర తెలిసే విధంగా మ్యూజియంలో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఆయన సందర్శించి, మ్యూజియంలోని పాత తరానికి సంబంధించిన కళాకృతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలానికి ఇతర రాష్ట్రాల నుండి భక్తులతో పాటు పాపికొండలు తిలకంచడానికి టూరిస్టులు అధికంగా వస్తారని, వారు తప్పనిసరిగా ట్రైబల్ మ్యూజియంను సందర్శించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలన్నారు. మ్యూజియంను టూరిస్ట్ స్పాట్గా చేయాలంటే మ్యూజియంను ఇంకా అభివృద్ధి చేయాలని, అలాగే ఆదివాసి గిరిజన గ్రామాలలో పాతతరం సంతతికి చెందిన ఇండ్లు గిరిజన కుటుంబాలు, గొడ్డు గోదా, పాతకాలం అరకలు, బుట్టలు వారు ధరించే నగలు అన్నీ ఉండే విధంగా ఏర్పాటు చేసుకొని గిరిజన మ్యూజియం సందర్శనకు వచ్చిన వారికి ఆ పల్లెటూరులో ట్రైబల్ కల్చర్, ఆదివాసీ వంటకాలు పాత తరం వస్తువులు బస చేయడానికి పూరి గుడిసెలు ఉండే విధంగా చూసుకుంటే వచ్చిన టూరిస్టులు అక్కడ బస చేసి వారు అనుభూతి చెంది ఆనందిస్తారని అక్కడి గిరిజనుల జీవన విధానాలు టూరిస్టులకు తెలియజేసే విధంగా చూడాలని చెప్పారు. త్వరలో ఈ మ్యూజియంను టూరిస్ట్ స్పాట్గా తయారు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, ట్రైబల్ మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, చలపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండకి 'సీతారామ' నీళ్లు ఎక్కడ ?

- రైతు సంఘం నాయకులు పెద్దిని వేణు

నవతెలంగాణ-చంద్రుగొండ



చంద్రుగొండ మండలానికి సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ నీళ్ల ఎక్కడ అని రైతు సంఘం నాయకులు పెద్దిని వేణు ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ(ఎం) మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తమ్మినేని వీరభద్రం సాగునీటి సాధన యాత్ర ద్వారా దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మించాలని పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించారు. ఆరోజు అప్పుడున్న పాలకులు రాజీవ్ సాగర్ అని పేరు మార్చి శంకుస్థాపన చేసి పైపులైన్లు వేశారు. అవి నిరుపయోగంగా పోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాని పేరు మార్చి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. దానిని ఇప్పుడున్న ప్రభుత్వం వారు డిజైన్ మార్చి ఖమ్మం జిల్లాకు నీరు ప్రవహించేలా కృషి చేస్తున్నారు. ప్రాజెక్టు ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నీళ్ల కావాలని ప్రాజెక్టు రూపకల్పన చేసి ఈ జిల్లాకు నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు నీరు ఇవ్వడం ఎంతవరకు సమంజసం.. దీనిని రైతు సంఘం అడ్డుకుంటాందన్నారు. ప్రభుత్వం కళ్ళ తెరిచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సాగునీరు ప్రాజెక్టు, లింకు కాలువల ద్వారా చెరువులకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని, అదేవిధంగా రైతుల్లో స్పృహను కల్పించడం కోసం రాబోయే రోజుల్లో రైతు జాత కార్యక్రమం రూపకల్పన జరుగుతుందన్నారు. రైతులందరి ద్వారా ప్రభుత్వ మెడలు వంచేలా ఈ జిల్లా రైతాంగాన్ని తయారు చేస్తామని రైతులు, అదేవిధంగా ప్రతిపక్ష పార్టీలు కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా, పార్టీ సభ్యులు పొట్రు వీరభద్రం, గ్రామ రైతులు మరకా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఖండించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు

నవతెలంగాణ-ములకలపల్లి

సీతారామ ప్రాజెక్ట్ ప్రారంబోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా రైతాంగ సమస్యలపై వినతి పత్రం అందజేయడానికి వెళ్లిన వామపక్ష రైతు సంఘాల నాయకుల అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో రెండు పంప్ హౌస్‌లు ఉన్నాయని(1.ఒడ్డు రామవరం 2.కమలాపురం) ఈ జిల్లా సాగునీరు మండలం మీదుగా ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్తున్నారని మండలంలో అనేక వర్షా ఆధారంతో బీడు భూములుగా ఉన్న వేల ఎకరాల బీడు భూములకు సాగునీరు సౌకర్యం అందించిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా మండల రైతులు వేల మంది రైతులు భూములు కోల్పోయారని, భూములు కోల్పోయిన మండల రైతాంగానికి సాగునీరు అందించకపోవడం సరైనది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులను, రైతు సంఘాల నాయకులను పోలీసులతో అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు. ములకలపల్లి మండలంలో ఉన్నా బీడు భూములకు సీతారామ ప్రాజెక్ట్ సాగునీరు అందించని యెడల భవిష్యత్ రైతు ఉద్యమాలకు వామపక్ష పార్టీలు రైతు సంఘాలు కలిసి ఉమ్మడి కార్యాచరణ ప్రకటించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊకంటి కుమార్, గొగ్గల ఆదినారాయణ, నిమ్మల మధు, గడ్డం వెంకటేశ్వర్లు, గొపగాని లక్ష్మి నర్సయ్య బైర్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలివ్వాలని ఆస్పత్రి కార్మికుల సమ్మె

- కలెక్టర్ హామీతో విరమణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గత నాలుగు రోజులుగా పెండింగ్ వేతనాలివ్వాలని భద్రాచలం ఏరియా హాస్పిటల్ కార్మికులు చేస్తున్న సమ్మెను డాక్టర్ ముక్కంటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో డాక్టర్ల బృందం, కాంట్రాక్టర్ కలసి కార్మికులతో చర్చలు జరిపి కలెక్టర్ చెప్పిన హామీతో సమ్మె విరమింపజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముక్కంటి వెంకటేశ్వర్లు కార్మికులతో మాట్లాడుతూ...వారం రోజుల్లో రావలసిన మూడు నెలల వేతనాన్ని కలెక్టర్ ఇస్తామని హామీ ఇచ్చారని, కాంట్రాక్టర్‌తో ఉన్న ఇబ్బందులు పరిష్కరిస్తామని హామి ఇచ్చారని కోరినట్టు తెలిపారు. దీనిని అంగీకరించిన కార్మికులు వెంటనే సమ్మె విరమింపజేసి పనిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ...గత నాలుగు రోజులుగా జరుగుతున్న సమ్మె విషయాలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తూ.. అధికారులకు కూడా తెలియజేయడం వలన అధికారులు స్పందించి చర్చలకు వచ్చారని, చర్చలు కార్మికులు, నాయకుల సమక్షంలో అధికారులు జరిపారని, ముఖ్యంగా పెండింగ్ వేతనాలని ఒక వారం వ్యవధిలో ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని, జీవో ప్రకారం వేతనాలు ఇస్తామన్నారని తెలిపారు. అలాగే భవిష్యత్తులో వేతనాలు పెండింగ్ లేకుండా నెలనెలా జీతాలు వేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినందున ప్రస్తుతం జ్వరాల సీజన్ అయినందున డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్స్, ఎక్కువగా ఉన్నందున రోగులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున వారిని కూడా దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో ఈ సమ్మెను విరమింపజేశామన్నారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే మరల నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సంతోష్, కాంట్రాక్టర్ రాంప్రసాద్, సిబ్బంది, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ(ఎం) నాయకులు గడ్డం స్వామి, సీపీఐ నాయకులు సాధనపల్లి సతీష్, కృష్ణయ్య, నాగరాజు, లక్ష్మణ్, యూనియన్ బాధ్యులు రమాదేవి, నాగరాజు, రమణమ్మ, నిర్మల, గీత, వరలక్ష్మి, భవాని ,నరేందర్, కృష్ణ, నరసింహారావు, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- పంచాయతీ కార్యదర్శి శ్రీరామ మూర్తి

నవతెలంగాణ-అశ్వారావుపేట

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కోటమర్తి శ్రీరామ్మూర్తి సూచించారు. శుక్రవారం పంచాయతీలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చిన్నంశెట్టి బజార్, నిమ్మల బజార్, బస్టాండ్ ఏరియా, కోనేటి బజార్లలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నివాస గృహాల మధ్య ఉన్న మురికి నీటి గుంతలను పరిశీలించి లార్వాను నిర్మూలించేందుకు నీటిలో దోమల నివారిణి మందును వేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సోంపల్లిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సోంపల్లి గ్రామాన్ని సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపల్లి గ్రామంలో టైఫాయిడ్, మలేరియా, విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గత ఏడాది మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలి ఇరువురి మృతి చెందారని, అలాంటి పరిస్థితి మరల ఈ గ్రామంలో రాకుండా ఉండాలంటే వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ఏడాది చనిపోయిన వారి కుటుంబాలకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అంద లేదన్నారు. మళ్లీ అదే తరహాలో డెంగ్యూ, మలేరియా విష జ్వరాలు ప్రబలి అవకాశముందని, కాబట్టి వైద్య అధికారులు ఈ గ్రామాన్ని దత్తత తీసుకొని మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జ్వరాలు తీవ్రంగా ఉన్న గ్రామాలలో దోమల మందు, బ్లీచింగు రోడ్లు పైనే కాకుండా వారి ఇళ్లల్లో కూడా దోమల మందు కొట్టించాలని చెప్పారు. ఆ గ్రామంలో గతంలో జరిగినట్టుగా జరగకుండా చూడాలని జరిగితే దానికి ప్రభుత్వం అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యులు రాయల వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి నిమ్మల అప్పారావు, అరవ వీరబాబు, నస్పూరి అరవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆళ్ళపల్లిలో ఎమ్మెల్యే పాయం పర్యటన

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటన శనివారం ఆళ్ళపల్లి మండలంలో ఉన్నట్లు కాంగ్రెస్ మండల కో-ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని మూడు నూతన సీసీ రోడ్లు ప్రారంభోత్సవం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఉంటుందని తెలిపారు. అలాగే ఆళ్ళపల్లిలోని రైతు వేదికలో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష సమావేశం రైతు వేదికలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తదనంతరం అనంతోగు, రాయిపాడు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అభివృద్ధి పనులపై, మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ఉంటుందని చెప్పారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రామాలయ చరవాణి కౌంటర్ వేలం ఖరారు

- మూడుసార్లు రద్దు..
- నాలుగోసారి రూ.12,75,000 దక్కించుకున్న గుత్తేదారు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల మొబైల్ ఫోన్‌లను భద్రపరిచే కౌంటర్ నిర్వహణకు జరిగిన వేలం పాట ఇప్పటికే అనివార్య కారణాలతో మూడు సార్లు రద్దుకాగా నాలుగో సారి రూ.12 లక్షల 75 వేలకు గుత్తేదారుడు శుక్రవారం దక్కించుకున్నారు. ఆలయ లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేని కారణంతో సుదీర్ఘ ప్రాంతాల నుండి రామయ్య దర్శనంకు వచ్చే భక్తులు తమ ఫోన్‌లను ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌంటర్ వద్ద భద్రపరచుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారన్న విషయం తెలిసిందే. పాత కాంట్రాక్టర్ కాలం ముగియడంతో మరోసారి చరవాణి భద్రపరిచేందుకు బహిరంగ వేలం ప్రకటించడంతో పట్టణానికి చెందిన ఒక గుత్తేదారుడు 12 లక్షల 35వేలకి దక్కించుకోగా అనివార్య కారణాలతో ఆ గుత్తేదారుడికి ఆలయ అధికారులు సంబంధిత కాంట్రాక్టు ఇవ్వలేదని తెలుస్తుంది. దాన్ని రద్దు చేసి మరోసారి వేలంపాట నిర్వహించగా కేవలం 12 లక్షల 15వేలకే పాట పోగా దానిని కూడా రద్దుచేసి నాలుగో సారి వేలం నిర్వహించగా 12 లక్షల 75 వేల రూపాయలకు ఆలయంలోనే మరో కాంట్రాక్ట్ నిర్వహించే గుత్తేదారుడే చరవాణి కౌంటర్లు కూడా దక్కించుకున్నారని తెలుస్తుంది. మొదటిసారి నిర్వహించిన బహిరంగ వేలం ప్రకటనకు గుత్తే దారులు ఎవరు ముందుకు రాకపోవడంతో మరల రెండోసారి నిర్వహించగా ఆలయ నిబంధనల ప్రకారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రకటనతో వేలం పాటలో పాల్గొని అందరికంటే ఎక్కువగా 12 లక్షల 35 వేల రూపాయలకు పట్టణానికి చెందిన ఒక గుత్తేదారుడు టెండర్ను దక్కించుకొని రెండు లక్షల రూపాయల రుసుమును డిడి రూపంలో చెల్లించి మరో తొమ్మిది లక్షల ముప్పై ఐదు వేల రూపాయలు నగదు రూపంలో ఆలయ అధికారులకు చెల్లించడానికి ఈవో కార్యాలయానికి వెళ్లిన సందర్భంలో ఆలయ అధికారులు నిబంధన ఉల్లంఘించి అట్టి వేలం ప్రకటనను రద్దు చేశారని, ఈ విషయంపై సంబంధిత గుత్తేదారుడు కోర్టును ఆశ్రయించగా కేసు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో నాలుగోసారి 12 లక్షల 75 వేల రూపాయలకు ప్రకటించిన వేలం పాటను గోప్యంగా ఆలయ అధికారులు ఉంచారని తెలుస్తుంది. ఇటీవల కాలంలో రామాలయం ఆధ్వర్యంలో నిర్వహించే పలు కాంట్రాక్టులు ఏదో ఒక వివాదంతో కోర్టులోకి వెళుతుండడంతో ఆలయ ప్రతిష్ట అంతకంతకు దిగజారుతుందని రామయ్య భక్తులు ఆవేదనని చెందుతున్నారు.

వరలక్ష్మి వ్రతం వేడుకలు

నవతెలంగాణ-కల్లూరు



పట్టణంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కల్లూరు, పెనుబల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి నివాసంలో మహిళలతో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భాగం నీరజను ఆశీర్వదించారు. సత్తుపల్లి నియోజకవర్గం మహిళలు అందరికి శ్రావణ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

టేకులపల్లి : మండలంలోని పలు గ్రామాలలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాల్లో, నివాసాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఆచరించారు. మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి కుంకుమార్చన చేశారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీచక్రానికి పూజలు నిర్వహించి ఉద్యాపన వ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలి..

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎస్‌ఓ టు జీఎం డి.శ్యామ్ సుందర్‌కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల ఏడవ తేదీ నాటికల్లా వేతనాలు చెల్లించే విధంగా కాంట్రాక్టలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా గోదావరి లోయ పొగ్గుకొని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాసర్ పాషా మాట్లాడుతూ సింగరేణి రైల్వే కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలకు సంబంధించి చెల్లించడంలో ప్రతినెల జాప్యం జరుగుతోందని ఈ నెల కూడా 16వ తేదీ నాటికి వేతనాలు కాంటాక్ట్ కార్మికుల బ్యాంకు ఖాతాలలో జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రతినెల ఐదవ తేదీ నాటికి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సంబంధిత కాంట్రాక్టర్లు జమ చేయవలసి ఉండగా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం సంబంధిత డైరెక్టర్ పాగారి సర్క్యులర్‌ను అమలు చేయాలని, చెల్లించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ఏ.మంగీలాల్, కె.వెంకట్ నారాయణ, కే.గురుమూర్తి, మాలోతు భావ్ సింగ్, తొగరు రామకృష్ణ, ఎం.సాంబ, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో సత్తాచాటిన నిడమానూరి నాగ సాయి శశాంత్

నవతెలంగాణ-కొత్తగూడెం



చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన నిడమానూరి నాగ సాయి శశాంత్ చెస్ క్రీడలో రాణిస్తున్నాడు. జులై 12 నుండి 14 వరకు విజయవాడలో జరిగిన అంతర్జాతీయ అండర్ 13 విభాగం చెస్ పోటీల రేటింగ్స్ ఆగస్టు మొదటి వారంలో ప్రకటించారు. ఈ ఫలితాల్లో నిడమానూరి నాగ సాయి శశాంత్ 1456 పాయింట్స్ రేటింగ్‌తో తనదైన శైలిలో గేమ్ ప్లాన్‌తో సత్తాచాటారు. పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు, చదరంగంలో మంచిగా రాణిస్తున్నాడు. ఒక సంవత్సరం నుండి కోచ్ అన్వర్ వద్ద మెలకువలు నేర్చుకుంటున్న శశాంత్ అతి తక్కువ సమయంలోనే అంతర్జాతీయ స్థాయికి చేరాడు. ఇప్పటివరకు విజయవాడలో జరిగిన అంతర్జాతీయ చెస్ రేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచడంతో పాటుగా, అండర్-13 విభాగంలో విజయవాడ, హైదరాబాద్, కరీంనగర్‌లో జరిగిన ఆలిండియా చెస్ టోర్నమెంట్స్‌లో అంతర్జాతీయ ర్యాపిడ్ టోర్నమెంట్లు 3, సీబీఎస్ జోనల్ గేమ్స్‌లో స్కూల్ తరపున అండర్-13, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన చెస్ క్రీడా పాల్గొని తన ప్రతిభను చాటుకున్నాడు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ప్రతిభను చాటుకుంటున్న నవభారత్ విద్యార్థి నిడమానూరి నాగ సాయి శశాంత్‌ను నవభారత్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవి.రెడ్డి, చెస్ కోచ్ అన్వర్, తల్లిదండ్రులు బాలకృష్ణ, నాగలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.



తెలంగాణ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగిందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఎ.జె.రమేష్ పత్రికలకు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేష్మ అధ్యక్షురాలుగా జి.పద్మ, ప్రధాన కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా చంద్రకళ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాపారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా ఇర్ప అనురాధ, రాము, మైమున్నీషా, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, సుల్తానా, రోజా, సత్యనారాయణలతో పాటుగా మరో 16 మందిని జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీఓఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలకు ఉద్యమం చేయాలని నిర్ణయించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.26,000ల జీతం ఇవ్వాలి. పీఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలి. తదితర డిమాండ్ల పరిష్కారం కోసం రానున్న కాలంలో సమరశీల పోరాటాలు చేస్తామని సంఘం జిల్లా కమిటి ప్రకటించింది.

నవతెలంగాణ దినపత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



కరోన వైరస్ సంక్షోభంలోను ఆర్థిక స్థితులను తట్టుకుని నిలబడి నిబద్ధతగా ప్రజల పత్రికగా కొనసాగడం సంతోషకరం. అన్ని వర్గాల సమస్యలను, లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని మేల్కొలపడంలో ముందువరసలో ఉందన్నారు. పత్రిక మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. నవతెలంగాణ యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో

జిల్లా పోలీసుల పనితీరు భేష్

- మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసుల పనితీరు భేష్ అని మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి కితాబ్ ఇచ్చారు. శుక్రవారం హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా నిర్వహించారు. ముందుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐజీపికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల పనితీరును, నిషేధిత మావోయిస్టుల కదలికల పట్ల ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, వారి కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నిషేధిత మావోయిస్టులు ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడకుండా వారిని నివారించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసుల పనితీరు ప్రశంసనీయమని, అంతే ఉత్సాహంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 5ఎస్ అమల్లో భాగంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులను, ఫైళ్లను ఒక క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పరిధిలోని ప్రతీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్, ఇల్లందు డిఎస్పి చంద్రభాను, పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏవో జయరాజు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో మహిళలకు రక్షణ కరువు..

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి..
- ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మి

నవతెలంగాణ-మణుగూరు



నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో దేశంలో మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు డీ.లక్ష్మి విమర్శించారు. శుక్రవారం స్థానిక శ్రామిక భవనంలో ఐద్వా మండల మహాసభ రెంటాల పావని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో అత్యంత పాశవికంగా మహిళా జూనియర్ డాక్టర్ పై అత్యాచారం చేసి హత్య చేసినా మోడీ నోరు విప్పడం లేదన్నారు. పసి పిల్లల నుండి పండు ముసలి వరకు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మహిళలకు ప్రతినెల 2500పథకాన్ని వెంటనే ప్రారంభించాలని, మహిళలకు తులం బంగారం, నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళల 33 శాతం రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెంలో అక్టోబర్ 21, 22, 23, తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల నాగమణి, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోండ్రు గౌరీ, తోట పద్మ, దొడ్డి నిర్మల, రామగిరి రమ, ముత్యాలు, కొడిశాల ఐలమ్మ, ధనలక్ష్మి, సారిక, గుండు భాగ్యశ్రీ, కుంభ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో జరిగిన లోపాలు కొత్త చట్టంలో పునరావృతం కాకూడదు



- రైతు సంఘాల నేతల డిమాండ్

నవతెలంగాణ -కొత్తగూడెం

ధరణిలో జరిగిన లోపాలు కొత్త చట్టంలో పునరావృతం కాకూడదని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శేషగిరి భవన్‌లో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రెవెన్యూ ముసాయిదా బిల్లుపై రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, అన్నవరపు సత్య నారాయణ, కనగాల అనంతరాములు, భూక్యా నాయక్ లు మాట్లాడుతూ గతంలో 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కావున ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న కొత్త రెవెన్యూ బిల్లులో ఎటువంటి లోపాలు లేకుండా, పటిష్టంగా రాష్ట్ర రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రూపొందించాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్రంగా భూములన్నీ రీ -సర్వే చేసి రైతుల భూములన్నింటినీ రికార్డుల్లోకి ఎక్కించాలని, గతంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం దాదాపు తొమ్మిదిన్నర లక్షల మంది రైతులు దరఖాస్తులు చేసి ఉన్నారని, అలాగే ఎవరైనా అప్పుడు చేసుకోలేకపోతే మరల వారికి సాదా బైనామాపై భూముల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని, అదే విధంగా భూమి సాగు చేసుకున్నటువంటి పేద, చిన్నసన్నకారు, రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి వారందరికీ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, అదే విధంగా ఏజెన్సీలో పోడు సాగు చేసుకుంటున్నటువంటి వేలాది మంది రైతులకు ఇంకా పట్టాల మంజూరు కాలేదని, తక్షణమే వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని, జంగు సిపాయిలు భూములు, భూదాన్ భూములు, దేవాదాయ శాఖ భూములు తరతరాలుగా సాగు చేసుకుంటున్నటువంటి నిరుపేద రైతులకు వారి పేర్లు రెవెన్యూ రికార్డుల లో ఎక్కించి పాస్ పుస్తకాలు ఇచ్చే విధంగా చట్టంలో రూప కల్పన చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నేతలు సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కొమరి హనుమంతరావు, కమటం సురేష్, పద్ధం విజయలక్ష్మి, వాడే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నూతన గని మేనేజర్ శ్యాం ప్రసాద్‌కు సొసైటీ డైరెక్టర్లు సన్మానం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా పివికే గని మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్యామ్ ప్రసాద్‌ని క్రెడిట్ సొసైటీ డైరెక్టర్లు పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ రూ.7 కోట్ల టర్నర్‌తో నడుస్తున్న సొసైటీ, ఒక్క శాతం ప్రాఫిట్‌తో మంచి లాభాలతో నడుస్తుందని తెలిపారు. ప్రతీ రెండు సంవత్సరాలకు వచ్చిన లాభాలతో సభ్యులకు పెద్ద మొత్తంలో ఆర్టికల్స్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. మునుముందు కూడా కొత్త మేనేజర్ సొసైటీ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టి మరింత లాభాలతో నడిపించాలని, సొసైటీ డైరెక్టర్లు అందరు కూడా పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ అజయ్ బాబు, డైరెక్టర్లు చిలుక రాజయ్య, విజయగిరి శ్రీనివాస్, గడప రాజయ్య, సైమన్, సకినాల సమ్మయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ పద్ధతుల్లో అనుమతులు ఇస్తున్న కమిషనర్

- తీసుకున్న అనుమతికి.. చేస్తున్న నిర్మాణానికి పొంతన లేదు...
- విలేకరుల సమావేశంలో బీఎస్పీ ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

అక్రమ పద్ధతుల్లో అనుమతులు ఇస్తున్న కమిషనర్ అక్రమ భవన నిర్మాణదారులకు కొమ్ము కాస్తున్నారని, బస్ స్టాండ్ సమీపంలో బహుళ అంతస్తు భవన నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, తీసుకున్న అనుమతి ఒకటి, చేపడుతున్న నిర్మాణం మరోలా ఉందని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కమీషనర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో సామాన్య ప్రజలు చిన్న పొరపాటు చేస్తే వారిని వెంటాడి వేధించే మున్సిపల్ అధికారులకు బడా బాబులు ఎంత పెద్ద తప్పు చేసినా కనిపించవా..? అని ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలోని బస్ స్టాండ్ సెంటర్, మధురబస్తీలో ఓ వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారని ఐతే దరఖాస్తులో కేవలం 176 గజాలకు మాత్రమే అనుమతి తీసుకుని సుమారు 475 గజాల్లో నిర్మాణం చేపట్టారని వివరించారు. ఇంటి నెంబర్లు 9-1-148, 9-1-149, 9-1-150, 9-1-151 మీద అనుమతులు చేయగా మున్సిపల్ అధికారులు మాత్రం 176 గజాలకు అనుమతి ఇచ్చారని తెలిపారు. జాతీయ రహదారికి సంబంధించిన నిబంధనలు తుంగలో తొక్కారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ తీరుపై తక్షణమే విచారణ జరిపించి, అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో గంధం మల్లికార్జున రావు, వంగా రవిశంకర్, తడికమళ్ళ దిలీప్, నవతన్, మురళీ తదితరుల పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తోంది 'నవతెలంగాణ'

- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మెచ్చా నాగేశ్వరరావు



కులమతాలకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలను పత్రిక ఆదరిస్తోంది నవతెలంగాణ దినపత్రిక. లౌకిక ప్రజాస్వామ్య విలులను కాపాడటంలో అనేక కథనాలు,వ్యాసాలు ప్రచురిస్తు ముందు పీఠిన నిలుస్తోంది. నవతెలంగాణ పత్రికలో వాస్తవిక కథనాలతో వస్తున్న మానవి శీర్షిక, సంపాదకీయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటోందని 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

సమిష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను సాధిద్దాం

- చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, ఐఆర్ఎస్

నవతెలంగాణ-మణుగూరు



సమిష్టి కృషితోనే నిర్దేశిత లక్ష్యాలను సాధిద్దామని సింగరేణి కాలరీస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం, ఐఆర్ఎస్ అన్నారు. శుక్రవారం తమ మణుగూరు ఏరియా అధికారిక పర్యటనలో భాగంగా డైరెక్టర్ (పి అండ్ పి) జి వేంకటేశ్వర రెడ్డి, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సంబందిత అధికారులతో కలిసి మణుగూరు ఏరియాను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా బంగ్లొస్ ఏరియా ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పికేఓసీ పీ కొత్త సైట్ ఆఫీస్ వద్ద క్యాంటీన్‌ను పరిశీలించిన అనంతరం కార్మికులతో కలిసి క్యాంటీన్ నిర్వాహణ, క్వాలిటీ ఫుడ్ విషయమై కార్మికుల అభిప్రాయలను కోరారు. వారు బ్రేక్ ఫాస్ట్‌లో పూరీ, లంచ్ లో పెరుగు అన్నం కావాలని కోరగా చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం, ఐఆర్ఎస్ వెంటనే స్పందించి తగు ఏర్పాటు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించడంతో పాటు కార్మికులు క్యాంటిన్ ఫుడ్ విషయమై ఒక కమిటీగా ఏర్పడి వారికి కావల్సిన అల్పాహారంను సంబంధిత అధికారులను కొరవచ్చు అని తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి చైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం, ఐఆర్ఎస్ అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2023-24 వార్షిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో మరియు ఉత్పాదకత, రవాణాలో 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించడం జరిగింది. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల మరియు కోల్ ఇండియా నుండి మనకు గట్టి పోటీ ఎదురు అవుతుంది. ఆ పోటీని ఎదుర్కునేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బొగ్గు బ్లాకులను పొందేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో ఒడిస్స లోని నైని కోల్ బ్లాక్ తో పాటు కొత్తగూడెం వికే గని, ఇల్లందులోని రొంపేడు ఓసిట్క, బెల్లంపల్లి ఏరియాలోని గొల్లేటి ఓస్ని ని ప్రారంబించుకోని అధికోత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నాము. ఇప్పట్కికే 235 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ లను సింగరేణి మొత్తంల మీద ఏర్పాటు చేశామన్నారు. దీనిని కనీసం 1000 మెగా వాట్లకు చేర్చాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాలలో కూడా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాట్లు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. అలాగే మేడిపల్లి ఓసి, రామగుండం నందు హైడ్రో పవర్ ఉత్పత్తి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలంటే ప్రతి ఒక్కరూ తమ వీధి నిర్వాహణలో రోజుకు 8 గంటలు సంపూర్ణంగా పని చేయడంతో పాటు ఉపరితల గనుల్లో కోట్లాది రూపాయిలతో కొనుగోలు చేసిన భారీ యంత్రాల వినియోగాన్ని రోజుకు కనీసం 18 గంటలు పెంచాల్సిన ఆవశ్యకత ఉంది. కోల్ ఇండియా లాంటి సంస్థలలో రూ.1000 లకే ఒక టన్ను ఉత్పత్తి వ్యయం కాగా అదే మన సింగరేణిలో అదే బొగ్గు ఉత్పత్తి చేయుటకు రూ.4000 వ్యయం అవుతున్నది. వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని రాష్ట్రాల నుండి రైల్ మార్గాలు విస్తరిస్తునందున వినియోగదారులకు తక్కువ ధరకే బొగ్గు దొరికే అవకాశం ఉన్నందు వలన మన సంస్థలో బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నది. కాబట్టి సింగరేణియులందరు రక్షణ పరిధిలో పని చేస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి పాటుపడుతూ వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టి వ్యాపార అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం పివి కాలనీ సింగరేణి హై స్కూల్, డైరెక్టర్(పి అండ్పి) జి. వేంకటేశ్వరరెడ్డితో కలిసి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, అధికారులతో కలిసి శుక్రవారం పివి కాలనీ సింగరేణి హై స్కూల్‌ను సందర్శించి తరగతి గదులను, వాష్ రూమ్ లను, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం(సివిల్) డి. వెంకటేశ్వర్లు, పిఓ పికేఓసి టీ.లక్ష్మీపతిగౌడ్, ఏజెంట్ కొండాపురం వీరభద్రరావు, ఎస్ఓ టు జిఎం డీ.శ్యామ్ సుందర్, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, డిజిఎం(పర్సనల్) ఎస్. రమేశ్, ప్రాజెక్ట్ మేనేజర్ డి. రాంబాబు, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

అక్షరమే ఒక ఆయుధంగా

ప్రజా గళం విప్పుతున్న పత్రిక నవతెలంగాణ



భూక్య చెన్నారావు అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, అన్నపురెడ్డిపల్లి

నవతెలంగాణ దినపత్రిక ప్రాంతీయ, రాజకీయ, క్రీడా వార్త కథనాలు రాస్తూ ప్రజా సమస్యల పరిష్కరమే లక్ష్యంగా పని చేస్తోంది. ప్రజా సమస్యలు వెలికి తీసి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం వాస్తవాలు ప్రతిబించే విధంగా సంచలనాత్మకమైన వార్తలు రాస్తోంది. అందరీని ప్రజల పక్షాన నిలబడే ఏకైక దినపత్రిక నవతెలంగాణ. నిత్యం ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నా నవ తెలంగాణ దిన పత్రిక 9 వార్షికోత్సవ శుభాకాంక్షలు.



పర్ణశాల రామాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల నూతనంగా ప్రతిష్ఠకాబడిన శ్రీ లక్ష్మీ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో విశేష తిరుమంజనం (అభిషేకం) నిర్వహించి, సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, సహస్రనామార్చన చేశారు. భక్తులకు చక్కెర పొంగలి ప్రసాదమును అందించారు. ఈ కార్యక్రమంలో అలయ ఇన్‌చార్జీ అనిల్ కుమార్, అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, మదన్ మోహణాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభతో వైరాకు ఒనగూరిందేమిటి : బీఆర్ఎస్

నవతెలంగాణ-కారేపల్లి

వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి సభతో నియోజకవర్గానికి ఓనగూరిన ప్రయోజనమేమిటని బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్ ప్రశ్నించారు. శుక్రవారం కారేపల్లిలో ఆయన మాట్లాడుతూ వైరా నియోజవర్గానికి వచ్చిన సీఎం వరాల జల్లు కురిపిస్తారని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచాశారని, వారికి నిరాశే మిగిలిందన్నారు. 6 గ్యారంటీలతో అధికారం ఎక్కిన కాంగ్రెస్ గ్యారంటీల అమలు చాతకాక కొర్రిలు పెడుతూ లబ్ధిదారులను తగ్గింస్తుందని ఆరోపించారు. రుణమాఫీ సగం మంది రైతులకు అందలేదనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించారన్నారు. కార్యక్రమంలో కారేపల్లి ఉపసర్పంచ్ మనికొండ నాగేశ్వరరావు, నాయకులు ఖలీలుల్లాఖాన్, సద్దాం, ఫిరోజ్, కొణిదల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పాయిగూడెం రైల్వే గేట్ మూసివేత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి-ఇల్లందు రైల్వే మార్గంలోని అప్పాయిగూడెం రైల్వే గేటు (8ఎంబీ) 6 రోజుల పాటు మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈనెల 20 వతేది వరకు రైల్వే లైన్, గేటు మరమ్మత్తు పనులు నిర్వహిస్తునందున గేటు మూసివేయటం జరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఆ మార్గం నుండి రాక పోకలను డైవర్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడు శంకరరావుకు పరామర్శ

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని టీడీపీ రాపల్లి గ్రామ కార్యదర్శి ఏనుగు శంకర్రావుని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం శుక్రవారం రాపల్లి గ్రామంలో పరామర్శించారు. ఏనుగు శంకర్రావు గురువారం చంద్రుగొండలో జరిగిన ఫంక్షన్‌కి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో తలకి బలమైన దెబ్బ తగలగా స్పృహ కోల్పోవడంతో బంధువులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మెరుగు పడటంతో శంకర్రావుని కుటుంబ సభ్యులు రాపల్లె తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి మైనేని రవికుమార్, రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు సాధినేని సీతారామకృష్ణ, తెలుగు యువత నాయకులు ఏనుగు. అన్వేష్, బెజ్జం రాయప్ప, తదితర నాయకులు ఉన్నారు.



సీఎంకి తిలకం దిద్దిన దొబ్బల

నవతెలంగాణ-కొణిజర్ల

వైరా పట్టణంలో గురువారం జరిగిన రైతు సభలో జిల్లా కాంగ్రెస్ మహిళ అధక్షురాలు దొబ్బల సౌజన్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుదిటిపై తిలకం దిద్దారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతోపాటు స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లకు తిలకం దిద్ది తన అభిమానాన్ని చాటుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌కి తిలకం దిద్దినప్పుడు సభ ప్రాంగణమంతా ఈలలు గొలలతో మార్మోగడం విశేషం.

రుణమాఫీ కాకపోవడంతో రైతుల్లో ఆందోళన

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముదిగొండలో శుక్రవారం వారు నవతెలంగాణతో మాట్లాడారు. 30% మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీగాని రైతులు 70 శాతం మంది ఉన్నారని, వారందరికీ రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

నవతెలంగాణ- ఖమ్మం

కలకత్తా నగరంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై సభ్య సమాజం తలదించుకునే విధంగా అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ డిమాండ్ చేశారు. కలకత్తా నగరంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ పై కొందరు దుండగులు చేసిన అత్యాచారాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాకేష్ ,ప్రతాప్, రోహిత్ ,వెంకటేష్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలి

విలేకరుల సమావేశంలో ముత్తారం బాధితులు

నవతెలంగాణ- ముదిగొండ

అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్న ఎస్ఐ గజ్జెల నరేష్‌పై చట్ట, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ముత్తారం గ్రామానికి చెందిన నారపొంగు కిరణ్, అడపా నాగేంద్రబాబు, నారపొంగు జాని, ఎల్ సుందర్రావు డిమాండ్ చేశారు. ముదిగొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మా భూమిని మేము సాగు చేసేందుకు వెళ్లగా మా గ్రామానికి చెందిన కొందరు భూమి మాది అంటూ అక్రమంగా మాపై దాడి చేశారని, ఇదే విషయంపై ఎస్సై నరేష్‌కి ఫిర్యాదు చేయగా పూర్తి విచారణ చేయకుండానే మాపైనే కేసు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై రూరల్ సీఐకు ఫిర్యాదు చేస్తామని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

క్రాంతి పురానికి రహదారి సౌకర్యం కల్పించాలి

- పాఠశాల, విద్యుత్ సౌకర్యం కూడా..
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం



నవతెలంగాణ-చర్ల

మండలం పరిధిలోగల సుబ్బంపేట పంచాయతీ క్రాంతిపురం గ్రామానికి గతంలో రోడ్డు మంజూరు అయినదని అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం చేసి నిలుపుదల చేశారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్ అన్నారు. ఈ గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుంచి విద్యుత్తు సౌకర్యం లేక గతంలో పాము కాటుకు చనిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయని, కావున కరెంటు సౌకర్యం కల్పించాలని, క్రాంతి పురం గ్రామంలో నివసించే పిల్లలకు విద్య నేర్చుకోవడానికి పాఠశాల ఏర్పాటు చేయాలని, సుదూర ప్రాంతాలకు పిల్లలు రహదారి సౌకర్యం లేక స్కూళ్లకు వెళ్లలేక డ్రాప్ అవుట్లుగా మిగిలి పశువుల కాపరిగా మారుతున్నారని ఆయన మండిపడ్డారు. ఆ గ్రామ ఆదివాసీ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని కావున తక్షణమే అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు రేగా ఆంద్రయ్య పాల్గొన్నారు.

దోమ యమ డేంజర్...

పొంచివున్న వ్యాధుల ముప్పు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

నవతెలంగాణ-వైరాటౌన్

వర్షాకాలం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ తీవ్రమైన అనారోగ్యం కలిగించే వైరస్‌లు, బ్యాక్టీరియా, ఇతర అంటువ్యాధులను కూడా పుష్కలంగా తీసుకువస్తుంది. భారీ వర్షాలు, చలి గాలులు, తేమతో కూడిన వాతావరణం వలన ప్రమాదకరమైన వైరస్లు, బ్యాక్టీరియాలు వృద్ధి చెందుతాయి. వర్షాకాలంలో ప్రజల రోగనిరోధక వ్యవస్థలు బలహీన పడుతుంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆసుపత్రులు కిక్కిరిసి పోతాయి. ముందస్తుగా కచ్చితమైన రోగనిర్ధారణ చేసుకోవడం, తగిన చికిత్సను తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు. వర్షాకాలంలో వస్తున్న వ్యాధుల్లో చాలావరకు దోమ కాటుకు సంబంధించినవే. దోమ చాలా ప్రమాదకరమైనది. దోమలతో సోకే వ్యాధుల గురించి అవగాహన పెంచుకోవాలి. దోమకాటు చాలా ప్రమాదం. సీజనల్ రోగాలన్ని దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలిపాయి. దోమల నివారణ మార్గాలు అనుసరించడం, దోమలు పెరగకుండా, కుట్టకుండా చూసుకోవడం ఉత్తమ మార్గమని డాక్టర్లు సూచిస్తున్నారు. పరిశుభ్రత లోపం వలనే దోమలు రోజురోజుకూ వృద్ధి చెందుతూ తమ ఉనికిని చాటుతున్నాయి. హత్యలు, దాడుల వల్ల మరణిస్తున్న వారి కంటే దోమల వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉంటున్నది. అంటే దోమల ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు



దోమద్వారా పోతున్న ప్రాణాలే ఎక్కువ

దోమల వల్ల వచ్చే వ్యాధుల్లో ప్రతీ సంవత్సరం 7.25 లక్షల మందికి పైగా చనిపోతున్నారని అధ్యయనాలు చెప్తున్నాయి. హత్యలు, దాడుల వల్ల 4.75 లక్షల మంది, పాము కాటు వల్ల 50 వేల మంది చనిపోతున్నారు. అంటే వీటన్నింటి కంటే దోమద్వారా పోతున్న ప్రాణాలే ఎక్కువ. దోమకాటు వల్ల ప్రతీ సంవత్సరం 20 లక్షల మంది అనారోగ్యానికి గురవుతున్నారు. నీరు నిల్వ ఉండే చోట, అపరిశుభ్ర వాతావరణంలో దోమలు నివాసాలను ఏర్పరచుకొని సంతతిని వృద్ధి చేసుకుంటాయి. దోమల్లో వేలాది రకాలున్నప్పటికీ ఐదారు రకాల దోమలే మనిషి పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు సోకి మనిషి ప్రాణాలు పోతున్నాయి.

మలేరియా :

ఆడ అనాఫిలీస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడం వల్ల దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది.

లక్షణాలు :

చెలి, వణుకుతో జ్వరం రావడం.. శరీర ఉష్ణోగ్రత పెరగడం. జ్వరం వస్తూ పోతూ ఉంటుంది.

డెంగ్యూ :

పగటి సమయంలో కుట్టే యెడీస్ ఆడ దోమల ద్వారా డెంగ్యూ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం. ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.

లక్షణాలు :

హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

మెదడువాపు :

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటీస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది.

లక్షణాలు :

ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం. విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం. శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం. ఈ వ్యాధి ఎక్కువగా 2 నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లల్లో వస్తుంది.

చికున్‌గున్యా :

ఏడిస్ దోమల వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లలో, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా తయారవుతాడు.

లక్షణాలు :

తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.

ఫైలేరియా :

దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది.

లక్షణాలు :

తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిల్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాలకు వాపు, కాళ్ల, చేతులు, స్థనాలు, వరిబీజం, బుడ్డ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యంకాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మార్గం.

దోమలను నివారించడం ఇలా..

నీటి గుంతలను గుర్తించి మట్టితో ఎప్పటికప్పుడు పూడ్చివేయాలి. మురికినీరు ఎప్పకటికప్పుడు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలి. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా ఉంచాలి. ఇంట్లో, ఇంటిచుట్టూ పనికిరాని కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, సీసాలు లేకుండా చూసుకోవాలి. కిటికీలకు, డోర్లకు జాలీలు బిగించాలి. వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలి. శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులను లైట్ తీసుకోవద్దు

డాక్టర్ జట్ల రంగారావు (సీనియర్ వైద్యులు, వైరా)



సీజనల్ వ్యాధుల బారి నుండి రక్షించుకోవడం చాలా ముఖ్యం. కొన్ని సార్లు సీజనల్ వ్యాధులు ప్రాణాంతకంగా కూడా మారే ప్రమాదం ఉన్నది. నివారణ, ముందు జాగ్రత్త చర్యల ద్వారా ఈ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చును. ఎల్లప్పుడూ మరిగించిన నీటిని త్రాగాలి. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారం తినాలి. రోగనిరోధక శక్తిని కాపాడుకోవాలి. బయటి ఆహారం తినడం మానుకోవాలి. పిల్లలకు టీకాలు వేయించాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ఇంటి చుట్టుపక్కల నిలబడి ఉన్న నీటిని తొలగించాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలి. ఒకవేళ ఎవరికైనా వ్యాధులు వస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. సొంత వైద్యం ఆరోగ్యానికి మంచిదికాదు.



రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

నవతెలంగాణ-వైరాటౌన్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేసిన పార్టీ నాయకులకు, రైతులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, రైతు సదస్సులో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయటం రైతులకు వరంలాంటిదని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయటం ఈ ప్రాంత రైతుల అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల రంగారావు, సూరంపల్లి రామారావు, మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జయపాల్, టౌన్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మచ్చా బుజ్జి, మట్టూరి కృష్ణారావు, కొప్పురావూరి శబరినాథ్, ధర్నా రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్ సంస్కార హీనుడు

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య

నవతెలంగాణ- ఖమ్మం

మహిళా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, కేటీఆర్ తీరు ఓ సంస్కార హీనుడని జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆరోపించారు. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం) వద్ద మాజీ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర గిడ్డగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్ అవకాశం కల్పిస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా గౌరవంగా జీవిస్తుంటే ఫ్రీ బస్‌లో డ్యాన్సులు వేయండి అంటూ అవహేళన చేయడం మహిళల పట్ల కేటీఆర్‌కు ఉన్న గౌరవం ఏ పటిదో అర్థం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ, సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు బాలగంగాధర్ తిలక్,రఘునాథపాలెం మండల అధ్యక్షులు భూక్యా బాలాజి నాయక్, మందపల్లి నాగమణి, ప్రతిభరెడ్డి పాల్గొన్నారు.

చీఫ్ మినిస్టర్స్ కప్ - 2024 క్రీడా జాబితాలో బాల్ బాడ్మింటిన్‌ను చేర్చాలి

నవతెలంగాణ - బోనకల్

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించ బోయే చీఫ్ మినిస్టర్స్ కప్ -2024 క్రీడా జాబితాలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను చేర్చాలని బోనకల్ కు చెందిన సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు షేక్ ఆజ్గర్ కోరారు. బాల్ బాడ్మింటన్ క్రీడను అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా అదేవిధంగా స్థానం కల్పించాలని, గ్రామీణ క్రీడలను ఆదరించాలని హైదరాబాద్‌లో వారి కార్యలయంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా అథారిటీ చైర్మెన్ శివసేనరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో చైర్మన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

హైదరాబాద్‌లో పాస్టర్‌పై దాడికి పాల్పడటం హేయం

- ఎన్‌సీసీ జాతీయ అధికార ప్రతినిధి శామ్యూల్ జాషువా

నవతెలంగాణ-సత్తుపల్లి



హైదరాబాద్‌లో పాస్టర్ దైవప్రసాద్‌పై ముష్కర మూకలు పశువుల్లా మారి తీవ్రంగా గాయపర్చడం అత్యంత హేయమైన చర్య అని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) జాతీయ అధికార ప్రతినిధి శామ్యూల్ జాషువా గెడ్డం తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు మందిరంలో జిల్లా అధ్యక్షుడు సంగసాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఎన్‌సీసీ ముఖ్య నాయకుల సమావేశంలో గెడ్డం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ గాజుల రామారంలో ఆగస్టు 15 రాత్రి చర్చిపై దాడిచేసి పాస్టర్ ప్రసాద్‌ను తీవ్రంగా గాయపర్చడమనేది సభ్య సమాజం తలదించుకొనేలా ఉందన్నారు. సమాజంలోని అందరి బాగోగుల కోసం ప్రార్థనలు జరిపే సువార్తీకులపై దాడిచేయడం మంటే అది దేవుడిపై దాడిచేయడమేనన్నారు. ఇలాంటి దాడులను అరికట్టే విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. మైనార్టీలకు ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ మాట్లాడుతూ దాడులను తీవ్రంగా ఖండిస్తూ క్రైస్తవులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సువార్త ప్రకటించకుండా మూర్ఖులు సువార్తీకులను నిలువరింపజాలరని కరుణాకర్ హెచ్చరించారు. దాడికి నిరసనగా సత్తుపల్లిలో శనివారం భారీఎత్తున ప్రదర్శన ఉంటుందన్నారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కరుణాకర్ కోరారు. ఈ సమావేశంలో ఎన్‌సీసీ రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి సామేలు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీఎస్ దేవసహాయం, రాష్ట్ర కార్యదర్శి సత్యానందం, బేతంపూడి వరప్రసాద్, యాకోబు, శాంసన్, జాన్‌మార్క్, రవికిరణ్‌పాల్ పాల్గొన్నారు.

తండాలో తీజ్ వేడుకల సందడి

పెళ్లికాని అమ్మాయిల పేర జరిగే వేడుక

నవతెలంగాణ-కారేపల్లి

తండాల్లో తీజ్ వేడుకల సందడి ప్రారంభమైంది. శ్రావణ మాసంలో పెళ్లికాని అమ్మాయిల పేర బంజార గిరిజనులు ఈ వేడుకను నిర్వహిస్తారు. 9 రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలలో నానబెట్టిన గోధుమలను సేవాబాయి, బేతాబాయి, సుఖాబాయి, దండియాడీ, మేరయాడీ దేవతల ప్రతికలుగా ఐదు బుట్టలలో ఉంచుతారు. ప్రతి రోజు ఆ బుట్టలకు నీళ్లు పోస్తూ సాయంత్రం పూజలు చేయటం ఆనవాయితీ. మొదటి రోజు ఐదుగురు దేవతలను కొలుస్తూ ఐదు బుట్టలలో మొలకవచ్చిన గోధుమలను ఉంచుతారు. పెళ్లికాని అమ్మాయిలు ఎంత మంది ఉంటే అన్ని బుట్టలలో గోధుమ మొక్కలను ఉంచి నీరుపోస్తూ పూజలు నిర్వహిస్తారు. ఇది అంత ఇంట్లో మంచె ఏర్పాటు చేసి దానిపై అలంకరిస్తారు. ఇక తొమ్మిదిరోజులు సాయంత్రం వేళల్లో తండాల్లో సందడేసందడి.

ముఖ్యమైన మూడు రోజులు

ఈ పండుగ తుది మూడు రోజులు ముఖ్యమైనవిగా గిరిజనులు భావిస్తారు. పండుగ 7వ రోజున డంబోలీ వేడుక (రొట్టెలు, బెల్లం చూర్ణం ఉండలు దేవతలకు నైవేద్యంగా పెట్టి పూజలు చేయటం) నిర్వహిస్తారు. దానిని ఫలహారంలా అందరికి పంచిపెడుతారు. 8వ రోజున గన్‌గోర్ వేడుక(మట్టితో అమ్మాయి, అబ్బాయి ప్రతిమలను తయారు చేసి బుట్టల మధ్య ఉంచి పూజలు చేయటం) చేస్తారు. ఈ రోజున బోగి వండి నైవేద్యంగా పెడుతారు. చివరి రోజు తొమ్మిదోవ రోజున దేవతలకు చెందిన గోధమ మొక్కల బుట్టలు ఐదింటిని కిందకు దించి అమ్మాయిలు పూజలు చేస్తారు. దాని పక్కనే మూడు జెండాలను కట్టి వాటి ముందు చిన్న పెద్ద తేడా లేకుండా పురుషులు దరువు వేస్తుండగా మహిళలు పాటలు పాడుతూ బంజరా నృత్యాలు చేస్తారు. సాయంత్రం అమ్మాయిలు ఊయాల ఊగుతూ అనందంగా గడుపుతారు. చీకటి పడగానే తొమ్మిదిరోజులుగా పూజలు చేసిన ప్రతిమలను, గోధుమ మొక్కల బుట్టలను దగ్గరలోని చెరువులలో నిమర్జనం చేయటంతో పండుగ ముగుస్తుంది.

ఆడ్డబిడ్డల ఊయ్యాల ఆట

తీజ్ వేడుకలలో భాగంగా శుక్రవారం టీక్యాతండాలో ఆడ్డబిడ్డలు ఊయ్యాల ఆట పాటలతో సందడి చేశారు. తీజ్ సందర్భంగా గిరిజన ఆడపడుచులు తల్లి గారింఢ్లకు చేరుకున్నారు. చెట్టుకు ఉయ్యాల కట్టి మహిళలు ఉయ్యాల ఊగుతూ సరదాగా గిరిజన ఆట పాటలతో సంబురాన్ని జరుపుకున్నారు. పెళ్లికాని యువతులు తమ జీవితాల్లో కొత్త మలుపులు వచ్చేలా అన్ని శుభకార్యాలు జరిగేలా ఆరాధ్య దైవాన్ని ప్రార్థిస్తూ ఈ వేడుకలను ప్రారంభిస్తారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ తీజ్ ఉత్సవాల్లో యువతులు ఉపవాస దీక్షల నడుమ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటారు.

ఆగి ఉన్న లారీను ఢీ కొట్టిన బైక్

యువకుడు మృతి...మరొక యువకుడికి తీవ్రగాయాలు

నవతెలంగాణ- ముదిగొండ

ఆగి ఉన్న లారీని వెనక నుండి వేగంగా వచ్చి బైక్ బలంగా ఢీకొట్టగా ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడుకు తీవ్ర గాయాలై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన గోకినేపల్లి వద్ద శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.నేలకొండపల్లి మండలం మంగాపురంతండకు చెందిన గుగులోత్ సంతోష్, గుగులోత్ సతీష్ ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్లి పనులు చూసుకొని తిరిగి వారి గ్రామానికి బయలుదేరి వెళుతుండగా గోకినేపల్లి సమీపాన జాతీయ రహదారిపై అగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టారు. దీంతో గుగులోతు సంతోష్ (22) దుర్మరణం చెందాడు. సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మృతుడు సంతోష్ ఇంటర్ చదువుతుండగా సతీష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నారని తెలిసింది.

క్రీ సెంట్ ఫార్మా కంపెనీ అధినేత జాన్మియాకి మాతృవియోగం

నవతెలంగాణ- కల్లూరు

హైదరాబాదు క్రీసెంట్ ఫార్మా కంపెనీ అధినేత, తెలంగాణ గ్రామర్ స్కూల్ చైర్మన్ ఎస్ కే జాన్మియా మాతృమూర్తి రబీయబి శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం ఎంపీ రామ్ సహాయం రఘురామిరెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు మట్ట రాగమయి దయానంద్, నీటిపారుదల శాఖ సంస్థ చైర్మన్ మువ్వ విజయబాబులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు.

ఖాతాదారుల సొమ్ము రూ.10 లక్షలు స్వాహా

పోస్టాఫీస్‌లో కాజేసిన బినామీ పోస్ట్‌మ్యాన్

- ప్రయివేటు వ్యక్తితో పోస్టాఫీస్ నడుపుతున్న వైనం
- విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు

నవతెలంగాణ-వైరా

ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లపూడి బ్రాంచ్ పోస్టాఫీసులో ఖాతాదారులు డిపాజిట్ చేసిన పొదుపు సొమ్ము రూ.10 లక్షలను బినామీ పోస్ట్‌మ్యాన్ కాజేసిన విషయమై అధికారులు ఆ గ్రామంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఖాతాదారుల రికరింగ్ డిపాజిట్ల సొమ్ము దశలవారీగా మింగేసినట్టు తెలుస్తోంది. గొల్లపూడి బ్రాంచ్ పోస్ట్‌మెన్ మేడూరి శ్రీనివాసరావు విధులను నిర్వహించకుండా తన స్థానంలో ప్రయివేటు వ్యక్తి వరికూటి ప్రవీణ్‌కుమార్‌ను అనధికారికంగా నియమించి పోస్టల్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. గ్రామంలో మెయిన్ రోడ్డుపై తనకున్న ఎరువుల దుకాణం పక్కనే ఓ షెటర్‌లో పోస్ట్‌మెన్ పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేశాడు. ఈ కార్యాలయం కేంద్రంగా ఆ ప్రయివేటు వ్యక్తి సుమారు సంవత్సర కాలంగా ఖాతాదారుల నుంచి రోజు, నెలవారీగా పొదుపు సొమ్ము వసూలు చేసేవాడు. ఇలా ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును పోస్ట్‌మెన్ పోస్టల్ మెయిన్ బ్రాంచ్‌లో ఉన్న ఖాతాదారుల అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. అలాగే, నగదు వసూలు చేసినట్టు ఆ ప్రయివేటు వ్యక్తి ఖాతాదారుల పాసుపుస్తకాల్లో స్టాంప్ వేసి ఇచ్చేవాడు. అయితే, ఖాతాదారుల్లో 30శాతం మందికే పాస్ పుస్తకాలు మంజూరు చేసినట్టు తెలుస్తోంది. మిగిలిన వారికి పాస్ పుస్తకాలు మంజూరు చేయకుండానే నగదు వసూలు చేయడం విశేషం. అయితే వసూలు చేసిన నగదును మెయిన్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లోని ఖాతాదారుల అకౌంట్‌లో జమ చేయలేదు. సుమారు 50 మంది ఖాతాదారుల నుంచి ఇలా వసూలు చేసిన 10 లక్షల రూపాయల నగదును పోస్ట్‌మెన్ అనధికారికంగా ఉద్యోగంలో పెట్టుకున్న ప్రయివేటు వ్యక్తి కాజేసినట్టు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోస్టల్ జిల్లా ఉన్నతాధికారులు మధిర పోస్టల్ ఇన్స్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కలకోట బ్రాంచ్ పోస్టుమెన్‌లను విచారణకు ఆదేశించారు. దాంతో మూడు రోజులుగా గొల్లపూడి గ్రామంలో విచారణ నిర్వహిస్తున్నారు. పోస్ట్‌మెన్ తాను చేయాల్సిన విధులను ప్రయివేటు వ్యక్తిని నియమించి చేయించటం ప్రస్తుతం వివాదాస్పదమైంది. పోస్టల్ శాఖ జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రతి ఖాతాదారునికి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మూతపడిన వస్త్ర పరిశ్రమను తెరిపించాలి

10శాతం యారన్ సబ్సిడీ అందించాలి

పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్

టెక్స్‌టైల్ పార్క్ బంద్.. ఒక్క రోజు దీక్ష



టెక్స్‌టైల్ పార్క్ గేటు ఎదుట దీక్ష చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

టెక్స్‌టైల్ పార్క్‌లో మూతపడిన పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమను వెంటనే తెరిపించాలని, కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీని ఇవ్వాలని తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం బంద్ పాటిస్తూ.. యూనియన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ.. మూతపడిన వస్త్ర పరిశ్రమలను తెరిపించడమే కాకుండా, పూర్తిస్థాయిలో పరిశ్రమలను ప్రారంభించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన ఆర్డర్లను ఇక్కడి కార్మికులకు అందించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆర్డర్‌పైనే టెక్స్‌టైల్ పార్క్ కార్మికులు ఆధారపడి ఉన్నారని తెలిపారు. కార్మికుల దీక్షకు ఆసాములు, యజమానులు మద్దతు ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే యారన్ సబ్సిడీ డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేసి, సంవత్సరం పొడవునా ఉపాధి కల్పించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూచన శంకర్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు అన్నల్‌దాస్ గణేష్, మరమగ్గాల కార్మికులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్, కెరమెరి

ఆసిఫాబాద్ జిల్లాలో పిడుగులు పడి ఇద్దరు మృతి చెందారు. కెరమెరి మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలి చౌదరి రమేష్(30) రైతు షేక్ హుస్సేన్ వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం రోజు మాదిరి పనికెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో పిడుగు పడటంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా, ఆసిఫాబాద్ మండలంలోని నందుప గ్రామంలో దౌత్రే అంజన్న(20) పొలానికెళ్లాడు. సాయంత్రం వర్షం కురుస్తుండటంతో ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో పిడుగు పడింది. దాంతో ఆయన అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా

నేడు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఓపీ సేవలు బంద్

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి, హత్యకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, నర్సులు చేపట్టిన నిరసనలు శుక్రవారం కూడా కొనసాగాయి. అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ బోధనాస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలు బంద్ అయ్యాయి. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రుల్లో సిబ్బంది, ముఖ్యంగా మహిళా సిబ్బంది భద్రతపై అత్యవసర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి భద్రత కోసం డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. మరోవైపు ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ, ఎలెక్టివ్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. డాక్టర్లు అత్యవసర సేవలకే పరిమితమయ్యారు. రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేస్తున్న పోరాటానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయి.

ఉస్మానియా, గాంధీ, నిమ్స్, ఈఎస్ఐసీ సనత్‌నగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల బోధనాస్పత్రుల్లో జూడాలు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ప్రదర్శనలు నిర్వహించారు. ప్లకార్డులను చేతబూని ఆస్పత్రుల ప్రాంగణాల్లో నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్యుల సంఘాల నాయకులు, హెచ్ఓడీలు, సూపరింటెండెంట్లు వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో భద్రతకు సంబంధించిన భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తగినన్ని సీసీ కెమెరాలు, భద్రతతో కూడిన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా కేంద్రంలోని సర్కారు పట్టించుకోకపోవడమే కోల్‌కతా లాంటి ఘటనకు దారి తీసిందని విమర్శించారు. కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇలాంటి సంఘటనలు జరగడానికి దారి తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళనల్లో భాగస్వాములవుతాం : తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనల్లో తాము కూడా భాగస్వాములమవుతామని తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ తెలిపింది. ఒకవైపు కోల్‌కతా వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనతో దేశంలో నిరసనలు కొనసాగుతుండగా ఉత్తరాఖండ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై లైంగికదాడి చేసి హత్య చేశారని ఖండించింది. ఇందుకు నిరసనగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని ఆస్పత్రుల్లో నిరసన ప్రదర్శనలు చేయనున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ ఒక ప్రకటన విడుదల చేశారు.

పోరాటం ఆపొద్దు : తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్

ప్రాణాలు నిలిపే వైద్యులపై దాడులు, లైంగికదాడులను ఎంత మాత్రం సహించేది లేదని తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్ఏ) హెచ్చరించింది. వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనల్లో తాము భాగస్వాములవుతున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.గోవింద్ హరి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

టీఎంఎస్ఆర్‌యూ సంఘీభావం

ఐఎంఏ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ-సీఐటీయూ అనుబంధం) సంఘీభావం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ఉదయం 6 గంటల నుంచి 18న ఉదయం 6 గంటల వరకు 24 గంటలపాటు వైద్యసేవలు నిలిపేస్తున్నట్టు తెలిపారు. వైద్యవిద్యార్థినిపై లైంగికదాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసనపై దాడి చేయడం అత్యంత క్రూరమైన చర్యగా తమ యూనియన్ భావిస్తున్నదని చెప్పారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి: మంత్రి దామోదర రాజనర్సింహ

- అత్యవసర ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రభుత్వాస్పత్రుల్లో ఆగిన ఓపీ, ఎలెక్టివ్ సేవలు
- ఐఎంఏ, టీజీడీఏ, టీజీటీడీఏ, టీజీపీహెచ్‌డీఏ, టీఎన్ఏ సంపూర్ణ మద్దతు
- కేంద్ర సర్కారు నిర్లక్ష్యమే కారణమని మండిపాటు

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహ

ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని మంత్రి దామోదర రాజనర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి హైదరాబాద్‌లో ఆస్పత్రుల్లో భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసును వేగవంతం చేయాలని సీబీఐను కోరారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి తగినంత భద్రత కల్పించాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రత, సంరక్షణకు సంబంధించిన అంశాలను పొందుపరిచినట్టు గుర్తుచేశారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

కొత్తూరులోని శ్రీ శ్రీనివాస క్లినిక్ సీజ్



గిరిజన బాలికకు అబార్షన్ ఘటనతో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో చర్యలు

- ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేయొద్దు : ఎమ్మెల్యే శంకర్
- జిల్లా వైద్యాధికారులతో సమావేశం

నవతెలంగాణ-కొత్తూరు

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఎర్రగుంట తండాకు చెందిన బాలికకు అబార్షన్ చేసిన కొత్తూరులోని శ్రీ శ్రీనివాస క్లినిక్‌ను వైద్యాధికారులు శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆస్పత్రిని సీజ్ చేశారు. బాలికపై లైంగికదాడి జరిగిన కేసులో అబార్షన్ చేసిన కొత్తూరులోని ఆయుర్వేదిక్ డాక్టర్ రంజిత్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం కొత్తూరులో పర్యటించిన వైద్యాధికారులు ఆస్పత్రిపై చర్యలకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారులతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లా డుతూ.. ఆయుర్వేదిక్ వైద్యం చదివి అల్లోపతి చికిత్స అందిస్తున్న డాక్టర్ రంజిత్‌కు గతంలో కూడా నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రయివేట్ ఆస్పత్రిలో గతంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఈ ఘటనతో మరొక్కసారి ప్రయివేటు ఆస్పత్రులపై తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతిరావు, జిల్లా హెల్త్‌ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సీహెచ్ఓ నాగేష్, శ్రీకాంత్, నవాజ్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు నాయక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శంషాబాద్ మండలం ఎర్రగుంట తండాకు చెందిన బాలిక (13)పై కొన్ని రోజుల పాటు జూకల్ గ్రామానికి చెందిన కృష్టారెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఆ బాలికను మానసిక వేదనకు గురిచేయటమేగాక, తల్లిదండ్రులను చంపేస్తానంటూ బెదిరించారని పేర్కొన్నారు. బాలికను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెట్టిన కృష్టారెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించి, తక్షణమే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని కమిషన్ చైర్మెన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నవతెలంగాణ-సంగారెడ్డి

కోల్‌కత్తా నగరంలో ఆర్జిగర్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తున్న మహిళా జూనియర్ డాక్టర్‌పై అమానుషంగా లైంగికదాడికి పాల్పడి.. హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు టీఎస్‌యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు, డాక్టర్స్ యూనియన్ జిల్లా సెక్రెటరీ చక్రపాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడారు. దేశంలో ప్రతిరోజూ ఆడపిల్లలపై లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగికదాడులు, హత్యలను నిలువరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఒక్కరే చేశారని నమ్మించి ఒక వ్యక్తిని అరెస్టు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఇది సామూహిక లైంగికదాడి అని డాక్టర్లు చెబుతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటి పడావో, సబ్కా సాథ్ -సబ్ కా వికాస్ అని ఘనమైన నినాదాలు ఇస్తున్నా.. వాటిని అమలుచేయడంలో వైఫల్యమవుతున్నదని తెలిపారు. నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి. సాయి తేజ, చందర్ రాథోడ్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుచరిత, ఎం. జ్యోతి, ధనరాజ్, సైమన్, బి. కమలాకర్ రావు నాయకులు సుభాష్, లక్ష్మయ్య, సంగయ్య, పి. కిషన్, ఎం. విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నాయకురాలు వాణి, అఖిల, శ్రావణి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

(మొదటిపేజీ తరువాయి)

చేశామని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కాకుండా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు దీన్ని గమనించాలని సూచించారు. అభ్యర్థులకు సంబంధించిన జవాబు పత్రాల నమూనాను విడుదల చేశామని తెలిపారు. అభ్యర్థి ఫొటోతోపాటు ప్రీ ప్రింటెడ్ వివరాలతో ముద్రించామని పేర్కొన్నారు. ఏడు పేపర్లకు సంబంధించిన జవాబు పత్రాల నమూనాలు శనివారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. అభ్యర్థులు జవాబుపత్రంలో ఉండే నిబంధనలను చదువుకోవడానికి అవకాశముంటుందని తెలిపారు. నమూనా జవాబుపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని సాధన చేయాలని సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు ముద్రించి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. నిబంధనలన్నీ తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కమిషన్ బాధ్యత వహించబోదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో ఉండే నిబంధనలను అర్థం చేసుకుని పాటించాలని కోరారు. తిరస్కరణ, చెల్లుబాటు కాకుండా చూసుకోవాలని సూచించారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నవీన్ నికోలస్ సూచించారు.

గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్
(మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)

సబ్జెక్టు	తేదీ
జనరల్ ఇంగ్లీష్ (అర్హత పరీక్ష)	అక్టోబర్ 21
పేపర్-1 జనరల్ ఎస్సే	అక్టోబర్ 22
పేపర్-2 చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ	అక్టోబర్ 23
పేపర్-3 భారతీయ సమాజం, రాజ్యాంగం, పరిపాలన	అక్టోబర్ 24
పేపర్-4 ఎకానమి, అభివృద్ధి	అక్టోబర్ 25
పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ, డాటా ఇంటర్‌ప్రిటేషన్	అక్టోబర్ 26
పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం	అక్టోబర్ 27

డీఎస్సీ వెబ్‌సైట్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

- 19న ఉదయం 3 గంటలకు తిరిగి పునరుద్ధరణ
- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) వెబ్‌సైట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఈనెల 19న మూడు గంటల వరకు సేవలు అందుబాటులో ఉండబోవని స్పష్టం చేసింది. వార్షిక విద్యుత్ షట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా డీఎస్సీ వెబ్‌సైట్ పనిచేయడం లేదని వివరించింది. డీఎస్సీ రాతపరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్లను ఈనెల 13న విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక కీపై ఈనెల 20న సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను స్వీకరిస్తారు. గతనెల 18 నుంచి ఈనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

కోల్‌కతా ఘటనపై సమరశీల ఉద్యమం

- నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- ఫెడరల్ స్ఫూర్తిని కాలరాస్తున్న మోడీ సర్కారు
- ధరల పెరుగుదలకు నిరసనగా 1 నుంచి 7 వరకు పోరాటం
- సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి: సీఎంకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యాచారానికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమం చేపట్టనున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ చెప్పారు. ఆమెపై లైంగిక దాడితోపాటు హత్య చేయడాన్ని నిరసిస్తూ శని, ఆదివారాలు రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జరిగిన ఘటనను నిర్భయ-2గా ఆయన అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైట్ డ్యూటీ చేసే డాక్టర్లకు విశ్రాంతి గదుల్లేవని చెప్పారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై సామూహిక లైంగిక దాడి జరిగిందన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని అన్నారు. వామపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆ ఆస్పత్రిలో ఆధారా ల్లేకుండా చేసేందుకు తృణమూల్ గూండాలూ ప్రయత్నిస్తున్నాయనీ, ల్యాబ్‌ను ధ్వంసం చేశారని చెప్పారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ అబద్ధాలు మాట్లాడారని అన్నారు. ఆర్థికంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తామంటూనే అదానీని మాత్రమే ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. సెబీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అదానీకి అనుకూలంగా సెబీ చైర్మెన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాల్గొన్నదా?, ఆ నాయకులు జైలుకు వెళ్లారా?, వారిలో అమరులున్నారా? అని ప్రశ్నించారు. ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఉన్న హామీలను కేంద్రం అమలు చేయాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్ పేరుతో ప్రజలను విభజిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్రం ఎర్రతివాచీ పరుస్తున్నదని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి ఏడు వరకు జాతీయ స్థాయిలో ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం నియంతృత్వంగా పాలన సాగించిందన్నారు. ఇది మోడీకి, నియంతృత్వ పాలకులకు గుణపాఠం కావాలని కోరారు. హైడ్రా మంచిదేనని అన్నారు. నాలాలు, చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే కబ్జా చేసిన వారిని పట్టుకోవాలని సూచించారు. వారి నుంచి పేదలు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకుంటే వాటిని కూల్చేయడం సరైంది కాదన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు వచ్చేనెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై వెనక్కి పోతే రిమోట్ కంట్రోల్ వేరే వారి వద్ద ఉన్నట్టే భావిస్తామన్నారు.

రైతులందరికీ రుణమాఫీ జరగాలి : పశ్యపద్మ

రాష్ట్రంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం పట్ల సంతోషంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ అన్నారు. ఎస్ఎల్‌బీసీ మినిట్స్ ప్రకారం రీషెడ్యూల్ చేసుకున్న రైతులందరికీ రుణమాఫీ జరగాలని కోరారు. లేదంటే అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. రైతులందరినీ రుణ విముక్తులను చేయాలనీ, కొత్త రుణాలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పిస్తేనే.. ప్రాణాలు కాపాడగలం

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కూడా నిరసనలు కొనసాగాయి. వైద్య విద్యార్థులు, డాక్టర్స్ నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీలు తీశారు. "మాకు రక్షణ కల్పిస్తేనే.. రోగుల ప్రాణాలు కాపాడగలం" అంటూ నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రయివేట్ ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలను బంద్ చేయనున్నారు.



రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న వైద్యుల నిరసన, ర్యాలీలు

- వైద్య విద్యార్థి ఘటనలో నిందితులపై చర్యలకు డిమాండ్
- రక్షణ కల్పించాలని నినాదాలు
- నేడు ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఓపీ బంద్

నవతెలంగాణ- విలేకరులు

ఆదిలాబాద్ రిమ్స్ జూడాలు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని.. రిమ్స్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చౌరాస్తాలో మనవహారంగా ఏర్పడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 72 గంటల్లోపు నిందితులను గుర్తించి, శిక్ష వేయకపోతే నిరసనను ఉధృతం చేసి.. వైద్య సేవలు నిలిపేస్తామని హెచ్చ రించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఓపీ బంద్ చేసి నిరసన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో వైద్యులు నిరసన తెలిపారు. పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి, మెడికల్ కాలేజ్ సీనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పివి సత్యనారాయణ, హాస్టల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద అమ్మాయిలపై జరుగుతున్న దాడులను నాటికల రూపంలో ప్రదర్శించారు. రాఖీ పండుగ సందర్భంగా మహిళా వైద్యులకు పెప్పర్ స్ప్రేలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. బాంగ్లాదేశ్, గాజాలో జరుగుతున్న దారుణాలపై మాట్లాడే మేధావులు.. కోల్‌కతా ఘటనపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల్లో రెస్ట్ రూమ్స్, సెక్యూరిటీ లేదని.. ఇలా ఉంటే డాక్టర్‌లు ఎలా డ్యూటీలు చేయాలని ప్రశ్నించారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అయినా సంఘాలు కానీ, మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజలు కూడా నోరు తెరవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లని ముట్టుకోవాలంటే భయం ఏర్పడేలా చట్టాలు తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో శనివారం అన్ని రకాల వైద్య సేవలనూ నిలిపివేస్తున్నట్టు సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షులు భాస్కరరావు, కార్యదర్శి రవికాంత్ తెలిపారు. అన్నీ బంద్ ఉంటాయని, ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ చేపట్టి ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. లైంగికదాడి, హత్య ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నేడు(శనివారం) ప్రయివేటు ఆస్పత్రులు బంద్ పాటించనున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు, ఆర్మూర్‌లో కూడా ఆస్పత్రుల బంద్ పాటించనున్నట్టు ఐఎంఏ ప్రతినిధులు తెలిపారు.

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు బైక్ ర్యాలీగా వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కళాశాలలో ఇబ్బందులున్నాయి, విధుల నిర్వహణలో (షిఫ్ట్ ప్రాబ్లమ్స్) డాక్టర్లు, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. అత్యవసర విభాగాలైన ఐసీయూ, ఎంసిహెచ్ వంటి ప్రాంతాల్లో సెక్యూరిటీని నియమించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా, కోఠి ఈఎన్‌టీ, నిలోఫర్, చెస్ట్, మెంటల్, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రులతోపాటు ఆయా జిల్లా హాస్పిటల్స్‌లో, ఏరియా హాస్పిటల్స్, యూసీహెచ్‌సీలు, పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీలు చేశారు.

పెండ్లయిన తర్వాత అందరి జీవితాల్లో కొన్ని మార్పులు కచ్చితంగా వస్తాయి. బాల్యం నుండి పెండ్లి అయ్యే వరకు జీవితాలు ఒకలా ఉంటాయి. పెండ్లి తర్వాత వచ్చే ఈ మార్పులు సర్వసాధారణం. అయితే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అమ్మాయిలు అప్పటి వరకు తాము పుట్టి పెరిగిన ఇంటిని వదిలి కొత్తగా అత్తగారింటికి వెళ్ళాలి. అక్కడంతా కొత్త వాతావరణం. కొన్ని ఆంక్షలు కూడా వచ్చి పడతాయి. తల్లి ఇంటిలో వలె స్వేచ్ఛగా ఉండే అవకాశం చాలా తక్కువ. ప్రతి దానికీ భర్త, అత్తమామల పర్మిషన్ తీసుకోవల్సి వస్తుంది. అదే ఇద్దరూ కొత్తగా వేరు కాపురం పెడితే ఆ సమస్యలు వేరే ఉంటాయి. అలాంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఓ జంట కథే ఈ వారం ఐద్వా అదాలత్...



పెండ్లి తర్వాత...

మీనాకు 24 ఏండ్లు ఉంటాయి. రమేష్‌తో పెండ్లి జరిగి ఎనిమిది నెలలు అవుతుంది. ఇద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా ఇద్దరూ సిటీలో కొత్త కాపురం పెట్టారు. పెండ్లయి ఎక్కువ రోజులు కాలేదు. పైగా పెద్దలు కుదర్చిన వివాహం కాబట్టి ఒకరి గురించి ఒకరు పూర్తిగా అర్థం చేసుకోడానికి కొంత సమయం పడుతుంది. దీని కోసం ఇద్దరూ ఒకరితో ఒకరూ కొద్ది సేపు గడపడం, ఒకరి ఇష్టాలు మరొకరు పంచుకోవడం చేయాలి. అప్పుడే ఇద్దరి మధ్య అనుబంధం ఏర్పడుతుంది.

కానీ మీనా, రమేష్‌ల ప్రవర్తన విచిత్రంగా ఉంది. పైగా వారిద్దరి మధ్య ఏమైనా సమస్యలు వస్తే సరిదిద్దే వారు ఎవ్వరూ దగ్గర్లో లేరు. మీనా తల్లిదండ్రులు గానీ, అత్తమామలు గానీ వచ్చి వీరి దగ్గర ఉండే అవకాశం లేదు. వాళ్ల ఊళ్ళో వ్యవసాయం చేస్తారు. దాన్ని వదిలి సిటీలో ఎక్కువ రోజులు ఉండలేరు. ఒక వేళ వచ్చినా ఒక్కరోజు ఉండి వెళ్లిపోతారు. అయితే ఇక్కడ సమస్య ఏంటంటే మీనా, రమేష్ ఇద్దరూ పెండ్లికి ముందు ఎలా ఉండేవారో పెండ్లి తర్వాత కూడా అలాగే ఉంటున్నారు. అంటే ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు ఉంటారు. బయటకు వెళ్లినా ఒకరితో ఒకరు చెప్పుకోరు.

రమేష్, మీనతో చెప్పకుండానే తన స్నేహితులను ఇంటికి తీసుకు వస్తుంటాడు. వచ్చిన స్నేహితులు మీన వంట గురించి కామెంట్లు చేయడం, ఇంటి పద్ధతుల గురించి మాట్లాడుతుండేవారు. ఇదంతా ఆమెకు నచ్చేది కాదు. రమేష్ సహోద్యోగుల్లో మహిళలు కూడా ఉండేవారు. వారు మీనా డ్రెస్సింగ్ గురించి మాట్లాడేవారు. ఇది ఆమెకు అస్సలు నచ్చేది కాదు.

రమేష్, మీనతో చెప్పకుండానే తన స్నేహితులను ఇంటికి తీసుకు వస్తుంటాడు. వచ్చిన స్నేహితులు మీన వంట గురించి కామెంట్లు చేయడం, ఇంటి పద్ధతుల గురించి మాట్లాడుతుండేవారు. ఇదంతా ఆమెకు నచ్చేది కాదు. రమేష్ సహెూద్యోగుల్లో మహిళలు కూడా ఉండేవారు. వారు మీనా డ్రెస్సింగ్ గురించి మాట్లాడేవారు. ఇది ఆమెకు అస్సలు నచ్చేది కాదు. ఆ విషయం రమేష్‌తో చెప్పినా పెద్దగా పట్టించుకోడు. ఇంట్లో ఆమె ఒంటరిగా వుందని తెలిసి కూడా రమేష్ ఆలస్యంగా ఇంటికి వస్తాడు. 'కొత్త చోటు నాకు ఒక్కదాన్నే ఉండటం ఇబ్బందిగా ఉంది' అన్నా పట్టించుకునేవాడు కాదు. పైగా 'నేను ఏం చేసినా నీకు ఇబ్బందిగానే ఉంటుంది. నేను ఏంచేయాలో, చేయకూడదో నీ దగ్గరి నుండి నేర్చుకోవాలా' అనేవాడు.

దీంతో మీన కూడా 'సరే నీకు నచ్చినట్టు నువ్వు ఉండు, నేను కూడా నాకు నచ్చినట్టుగా ఉంటాను' అంటూ ఆమె తన స్నేహితులతో లేట్‌నైట్ వరకు బయట వుండి ఇంటికి రావడం మొదలుపెట్టింది. ఇంట్లో వంట చేయడం మానేసింది. 'నేను బయట తిని వచ్చాను. నీకు ఆకలిగా ఉంటే ఆర్డర్ చేసి తెప్పించుకో, లేకపోతే నువ్వే వంట చేసుకొని తిను' అనేది. ఇలా ఇద్దరూ ప్రతి చిన్న విషయానికీ నామాటే నెగ్గాలి అనుకుంటూ పోట్లాడుకునేవారు. ఇది గమనించి ఇంటి పక్కనే ఉండే సుమతి వాళ్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. కానీ వాళ్లు గొడవ పడడం మాత్రం మానుకోలేదు. దాంతో సుమతి వారిద్దరినీ తీసుకొని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

మేము ఇద్దరినీ కూర్చోబెట్టి 'పెండ్లి అంటే బాధ్యతగా వ్యవహరించాలి. అంతే గానీ 'నువ్వు ఎక్కువా, నేను ఎక్కువగా' అంటూ గొడవలు పడితే సంసారం సాఫీగా సాగదు. ఒకరి ఇష్టాలను ఒకరు గౌరవించుకోవాలి. ఏ పని చేసినా ఇద్దరూ కలిసి చేసుకోవాలి. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటే ఎలాంటి సమస్యలూ ఉండవు. ఇలా మీరు గొడవలు పడుతూ ఒక్కరోజైనా సంతోషంగా ఉన్నారా? మీరే ఆలోచించుకోండి. ఇద్దరికీ మనశ్శాంతి ఉండదు. అదే ఒకరి గురించి ఒకరు ఒక్కసారి ఆలోచించండి. అప్పుడు మీకే అర్థమవుతుంది. ప్రతి చిన్న విషయానికి గొడవ పడడం సరైనది కాదు. బయటకు వెళ్లాలనుకుంటే ఇద్దరూ కలిసి వెళ్ళండి. ఎవరి దారిన వారు మీ స్నేహితులతో తిరుగుతుంటే ఇక మీ గురించి మీరు ఎప్పుడు తెలుసుకుంటారు. కొత్తగా పెండ్లయిన వారు ఎంత సంతోషంగా ఉండాలి? అనవసరమైన ఈగోలకు వెళ్ళి హాయిగా గడపాల్సిన సమయం మొత్తం గొడవలతో గడుపుతున్నారు.

ఇప్పటి నుండి ఇద్దరూ కలిసి వంట చేసుకోవడం, ఇల్లు సర్దుకోవడం వంటివి చేయండి. వారానికి ఒకసారి ఇద్దరూ కలిసి సరదాగా బయటకు వెళ్లండి. ఎవరి స్నేహితులు ఇంటికి వచ్చినా ముందు ఒకరితో ఒకరు చెప్పుకోండి. ఇద్దరూ ఒక మాటపై ఉండి వాళ్లను ఇంటికి ఆహ్వానించండి. భార్యాభర్తలంటే ఇలా ఉండాలి. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లుంటే అది సంసారం కాదు' అని ఇద్దరికీ సర్ది చెప్పాము.

తర్వాత రమేష్‌తో 'మీ భార్య డ్రెస్సింగ్ గురించి ఇతరులు మాట్లాడే అవకాశం ఇవ్వకండి. ఆమె ఎలాంటి డ్రెస్సులు వేసుకోవాలో ఆమె నిర్ణయించుకుంటుంది. మీకు ఏమైనా అభ్యంతరం ఉంటే ప్రేమగా ఆమెకు చెప్పుకోండి' అని చెప్పాము.

అలాగే మీనాతో 'నువ్వు కూడా నీ పద్ధతులు కొన్ని మార్చుకోవాలి. ఇంట్లో ఎలా ఉండాలో, బయట ఎలా ఉండాలో నేర్చుకో. ఇద్దరూ ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోండి. అనవసరంగా గొడవలు పెట్టుకోవద్దు. ఇద్దరి మధ్య ఏమైనా సమస్య వస్తే మా దగ్గరకు రండి' అని చెప్పాము.

దానికి ఇద్దరూ 'నిజమే మేడం, ఇప్పటి వరకు మేము ఒకరి గురించి ఒకరం తెలుసుకునే ప్రయత్నమే చేయలేదు. ఎప్పుడూ మా స్నేహితులు, మా ఉద్యోగాల గురించే ఆలోచించాము. ఇకపై మీరు చెప్పినట్టే చేస్తాం' అని చెప్పి వెళ్లిపోయారు.

'సరే నీకు నచ్చినట్టు నువ్వు ఉండు, నేను కూడా నాకు నచ్చినట్టుగా ఉంటాను' అంటూ ఆమె తన స్నేహితులతో లేట్‌నైట్ వరకు బయట వుండి ఇంటికి రావడం మొదలుపెట్టింది. ఇంట్లో వంట చేయడం మానేసింది. 'నేను బయట తిని వచ్చాను. నీకు ఆకలిగా ఉంటే ఆర్డర్ చేసి తెప్పించుకో, లేకపోతే నువ్వే వంట చేసుకొని తిను' అనేది.

- వై వరలక్ష్మి
9948794051

శనగలతో ఆరోగ్యం

శనగలు మనందరికీ బాగా తెలుసు. వీటిని నానబెట్టుకొని పోపేసుకొని తింటాం. ముఖ్యంగా శ్రావణమాసం వచ్చిందంటే చాలు ప్రతి ఒక్క శుభకార్యంలో ఈ శనగలను వాడుతూ ఉంటాం. ఇందులో మటన్, చికెన్ కంటే అధికంగా ప్రోటీన్ ఉంటుంది. శాకాహారులకు ఇది ఒక ప్రోటీన్ సోర్స్‌గా చెప్పవచ్చు. కేవలం ప్రోటీన్ మాత్రమే కాదు ఇందులో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా కాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం మూలకాలు అధికంగా ఉన్నాయి. ఇవన్నీ కూడా మనకు ఆరోగ్యాన్ని అందించేవే. ప్రతిరోజూ నాన పెట్టిన శనగలు తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.



నానబెట్టిన శనగల గ్లైసిమిక్స్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి షుగర్ పేషెంట్స్ నిరభ్యంతరంగా వీటిని తీసుకోవచ్చు. నానబెట్టిన శనగల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం ద్వారా జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా ఆకలి వేయదు. దీని ద్వారా అధిక బరువు నుండీ బయటపడతారు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సి , పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇది గుండె సంబంధ జబ్బులు ఉన్నవారికి క్యాన్సర్ రోగులకు చక్కటి పరిష్కారం.

నానపెట్టిన శనగల్లో ప్రోటీన్ అధికంగా ఉండడం వల్ల వ్యాయామానికి ముందు ఒక గుప్పెడు నానబెట్టిన శనగలను తీసుకున్నట్లయితే కండరాలకు శక్తిని ఇస్తుంది. అంతేకాకుండా ప్రోటీన్ లోపం సమస్యతో బాధపడే వారికి ఇది ఒక చక్కటి పరిష్కారమని చెప్పొచ్చు. అదేవిధంగా చర్మం నిగారింపుకు జుట్టు పోషణకు కూడా ఇవి ఎంతో సహకరిస్తాయి. నానపెట్టిన శనగలను తీసుకున్నట్లయితే జ్ఞాపక శక్తి పెరుగుదలకు, ఏకాగ్రతకు చక్కటి రెమిడీగా పని చేస్తుంది. అంతేకాకుండా చాలామంది అల్జీమర్ సమస్యతో బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు కూడా ఈ శనగల్ని తీసుకున్నట్లయితే సమస్య తగ్గుతుంది.

చాలామందికి మొహం పైన తెల్లటి మచ్చలతోపాటు.. కొన్ని రకాలైన చర్మ సంబంధ వ్యాధులు కూడా ఉంటాయి. ఈ నానబెట్టిన శనగలను ఆహారంలో భాగం చేసుకుంటే అలాంటి సమస్యల నుంచి బయటపడొచ్చు. ■

మోగిన మరో నగారా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానా, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. శుక్రవారం నాడిక్కడ విజ్ఞాన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధుతో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. హర్యానా అసెంబ్లీకి ఒకే దశలో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. జమ్మూ కాశ్మీర్‌లో మొత్తం మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న వెల్లడి అవుతాయి. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. '2024 లోక్‌సభ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ. ఆ ఎన్నికలు విజయవంతంగా, శాంతియుతంగా పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా యువత మొదలుకుని వృద్ధుల వరకు భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు ఎంతో చైతన్యం చూపించారు. ఈసారి వారు హింసను పక్కనపెట్టి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకే మొగ్గు చూపారు' అని అన్నారు.

'జమ్మూ కాశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో 74 జనరల్, 7- ఎస్సి, 9- ఎస్టి స్థానాలు ఉన్నాయి. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 88,66,704 లక్షల మంది (జులై 25 నాటికి) ఓటర్లు ఉన్నారు. అందులో 87,90,870 మంది జనరల్ ఓటర్లు, 75,834 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 69,974 మంది 85 ఏళ్ల దాటిన..వృద్ధులు ఉన్నారు. 83,072 మంది దివ్యాంగులు ఉన్నారు. 44.46 లక్షల మంది పురుషులు కాగా, 42.62 లక్షల మంది మహిళా ఓటర్లు. 167 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. ఇక 4,27,813 మంది మొదటి సారి ఓటర్లు, 20.7 లక్షల మంది యువ ఓటర్లు. 11838 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం' అని రాజీవ్ కుమార్ వివరించారు. ఓటర్ల తుది జాబితాను 19న అమర్‌నాథ్ యాత్ర ముగిన తరువాత ఆగస్టు 20న ప్రకటించనున్నట్లు తెలిపారు. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాల్లో 17 ఎస్సీ స్థానాలున్నాయి. మిగిలిన 73 స్థానాలు జనరల్ కేటగిరీ కిందకే వస్తాయి. హర్యానాలో2,03,00,255 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 2,01,90,184 మంది జనరల్ ఓటర్లు కాగా, 1,10,071 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 4,70,460 మంది మొదటి సారి ఓటర్లు ఉన్నారు. 2,46,207 మంది 85 ఏళ్ల దాటిన..వృద్ధులు, 1,49,239 మంది దివ్యాంగులు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 455 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు 20,629 ఏర్పాటు చేస్తున్నారు.

హర్యానా ఎన్నికల షెడ్యూల్

హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. ఇందుకు గాను, సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 12తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 13న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 16తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది.

జమ్మూకశ్మీర్ ఎన్నికల షెడ్యూల్

తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 20న నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆగస్టు 27తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. ఆగస్టు 28న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఆగస్టు 30తో ముగుస్తుంది. రెండో విడత పోలింగ్ సెప్టెంబర్ 25న జరుగుతుంది. ఇందుకోసం ఆగస్టు 29న నోటిఫికేషన్ విడుదలవుతుంది. సెప్టెంబర్ 5తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. సెప్టెంబర్ 6న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. సెప్టెంబర్ 9తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. మూడో విడత పోలింగ్ అక్టోబర్ 1న జరుగుతుంది. దీనితో పోలింగ్ ముగుస్తుంది. ఇందుకోసం సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ వెలువడుతుంది. సెప్టెంబర్ 12తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తు ంది. సెప్టెంబర్ 13న నామినేషన్ల పరిశీలన జరుగతుంది. సెప్టెంబర్ 17తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 90 అసెంబ్లీ స్థానాలకు గాను తొలి విడతలో 24 అసెంబ్లీ స్థానాలకు, రెండో విడతలో 26 అసెంబ్లీ స్థానాలకు, మూడో విడతలో 40 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తరువాత ప్రకటిస్తాం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ తరువాత ప్రకటిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. గతసారి మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించామని, అప్పుడు జమ్మూకాశ్మీర్ ఎన్నికల అంశం తెరపైకి రాలేదని అన్నారు. ఈ ఏడాది నాలుగు ఎన్నికలు ఉన్నాయని, ఇవి పూర్తయిన వెంటనే ఐదో రాష్ట్రానికి అసెంబ్లీకి ఎన్నికలు ఉంటాయని చెప్పారు. జమ్మూకాశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర, జారా?ండ్, ఢిల్లీ ఎన్నికలు వరుసగా జరగాల్సి ఉన్నాయని చెప్పారు. భద్రతా బలగాలు అందుబాటులో ఉండే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రెండేసి రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనికి తోడు, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో పాటు వరుసగా..పిత పక్షం, దీపావళి, గణేష్ చతుర్ధి పండుగలు ఉండటం కూడా కారణాలని చెప్పారు. వెంటనే ఎన్నికలు జరిగితే ఎన్నికల ప్రక్రియను క్లిష్టతరం చేస్తుందని అన్నారు. శాసనసభ పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నికలను షెడ్యూల్ చేసే వెసులుబాటు ఈసిఐకి ఉందని, అవసరమైన అన్ని సన్నాహాలు పూర్తయిన తరువాత మహారాష్ట్ర ఎన్నికలకు మరింత అనుకూలమైన సమయాన్ని ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంద ని అన్నారు.మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధిం చిన షెడ్యూల్‌ను విడుదల చేయకుండా వాయిదా వేయడంపై శివసేన నేత ఆదిత్య ఠాక్రే విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిందని విమర్శించారు. జమ్మూకాశ్మీర్‌లో భద్రతను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఆయన ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో జాప్యం అధికార పార్టీకి సిద్ధం కావడానికి మరింత సమయం ఇచ్చేందుకు వాయిదా వేశారని ఆదిత్య ఠాక్రే ఆరోపించారు. అయితే మహారాష్ట్ర ప్రజలు ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వాన్ని తిరస్కరించారని, మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు.

ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగం సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది.

ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను ఇస్రో ఛైర్మెన్ అభినందించారు.

తెగ తాగేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడయ్యాయి. మద్యం వినియోగంలో నగరాలకు, పట్టణాలకు మధ్య.. పురుషులకు, స్త్రీలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ఈ సర్వే వెల్లడించింది. దేశంలో నగరాల్లో కంటే గ్రామాల్లోనే ఎక్కువగా మద్యం సేవిస్తున్నారని స్పష్టం చేసింది.ఈ సర్వే ప్రకారం...దేశంలో అత్యధికంగా పురుషులు మద్యం సేవిస్తున్న రాష్ట్రంగా అరుణాచల్ ప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 52.6 శాతం మంది మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. తర్వాతి స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచింది. ఇక్కడ 43.4 శాతం మంది మద్యం సేవిస్తున్నారు. మూడో స్థానంలో సిక్కిం (39.9 శాతం), అండమాన్ (38.8 శాతం) ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మణిపూర్ (37.2 శాతం), గోవా (36.8 శాతం), ఛత్తీస్‌గఢ్ (34.7 శాతం) నిలిచాయి.

అతి తక్కువ తాగుబోతుల రాష్ట్రంగా లక్షద్వీప్

అలాగే అతి తక్కువ మద్యం సేవించే రాష్ట్రాల జాబితాలో లక్షదీప్ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ 0.4 శాతం మంది పురుషులు మాత్రమే మద్యం సేవిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో గుజరాత్ (5.8 శాతం), జమ్మూ కశ్మీర్ (8.7 శాతం), రాజస్థాన్ (11 శాతం), మహారాష్ట్ర (13.9 శాతం), ఉత్తరప్రదేశ్ (14.5 శాతం) ఉన్నాయి.ఇక మహిళల పరంగా చూస్తే.. అత్యధికంగా అరుణాచల్ ప్రదేశ్‌లో 24.2 శాతం మంది మహిళలు మద్యం సేవిస్తున్నారు. తర్వాత స్థానాల్లో సిక్కిం (16.2 శాతం), అస్సాం (7.3 శాతం), తెలంగాణ (6.7 శాతం), జార్ఖండ్ (5.7 శాతం), అండమాన్ (5 శాతం), ఛత్తీస్‌గఢ్ (4.9 శాతం) ఉన్నాయి. దేశంలోని ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాల య, త్రిపుర, ఒడిశాలలో మద్యం సేవించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

నాలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న మద్యపాన నిషేధం

ప్రస్తుతం బీహార్, గుజరాత్, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాల్లో మద్యపాన నిషేధం అమలులో ఉంది. మరికొన్ని రాష్ట్రాల్లో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ మద్యానికి స్వస్తి పలకాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎల్ఆర్ఎస్ తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వర్తిస్తుందని తెలిపారు. దీని నియమ నిబంధనలు 2020లోనే విడుదల చేశారనీ, అప్పటి పెండింగ్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను 2024 జనవరిలో ప్రారంభించినట్టు వివరించారు. ఇప్పటివరకు 4,28,832 దరఖాస్తులు ప్రాసెస్ చేయగా, వాటిలో 60,213 దరఖాస్తులు ఆమోదించి, రూ.96.60 కోట్ల సొమ్ము వసూలు చేసినట్టు తెలిపారు. 75 శాతం దరఖాస్తుల్లో పూర్తి స్థాయి డాక్యుమెంట్లు సమర్పించక షార్ట్‌ఫాల్స్‌తో ఉండటం వల్ల, వాటిని అప్‌లోడ్ చేయాలని దరఖాస్తుదారులకు తెలిపామని చెప్పారు. ప్రాసెస్‌ను వేగవంతం చేసేందుకు మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగరాభివృద్ధి సంస్థల నుంచి అధికారిక షార్ట్‌ఫాల్స్ లెటర్ కోసం వేచిచూడకుండా పూర్తి స్థాయి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో దరఖాస్తుదారులకు షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడానికి సౌకర్యం కల్పించామన్నారు. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్, లేఔట్ కాపీ వంటి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్, చిరునామా లేదా ఇతర దరఖాస్తు వివరాలను మొబైల్ నంబర్ ఓటీపీ వినియోగించుకుని సవరించుకోవచ్చు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగరాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దరఖాస్తుదారుల సందేహాలకు ఇక్కడ వివరణ దొరుకుతుందని తెలిపారు. 2020లో జారీ చేసిన జీవో 131, జీవో 135 ప్రకారం రాష్ట్రంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఈ నియమ నిబంధనలు వర్తిస్తాయి. 2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్టర్ చేసిన లేఅవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుంది. 2020 అక్టోబరు 15వ తేదీలోపు స్వీకరించిన దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం,అమీర్ అలీఖాన్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోలేదని చెప్పారు. ఎమ్మెల్సీ అవగానే తనకేమీ కొమ్ములు రాలేదనీ, తన ఆలోచనల్లో మార్పులేదన్నారు. ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేలా కృషి చేస్తానన్నారు.

ఇదిలా జరిగింది

గవర్నర్ కోటాలో కోదండరాంతోపాటు సియాసత్ న్యూస్ ఎడిటర్ అమేర్ అలీ ఖాన్‌ను కూడా సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. దీంతో గవర్నర్ కార్యాలయం గురువారం ఈ మేరకు ప్రకటన చేసింది. వివిధ రంగాల్లో ప్రముఖులైన ప్రొఫెసర్ కోదండరాంను, అమేర్ అలీ ఖాన్‌ను మండలి సభ్యులుగా ప్రభుత్వం సిఫారసు చేసింది. గత ప్రభుత్వం దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణ లను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసింది. వారి రాజకీయ నేపథ్యం కారణంగా ఆ ప్రతిపాదనను తమిళిసై తిరస్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం వారి స్థానంలోనే కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌ను నియమించారు.

నిబంధనలకు సెబీ చీఫ్ పాతర



(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాల ద్వారా ప్రొఫెషనల్ ఫీజులు పొందడం 2008 సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. సెబీ చైర్మెన్ ఇతర ఆదాయాలు ఆర్జించడంపై నిషేధం ఉంది." సింగపూర్ కంపెనీ రికార్డులను పరిశీలిస్తే మాధాబీ బచ్ మార్చి 2022లో అగోరా పార్ట్‌నర్స్‌లోని తన షేర్లన్నింటినీ తన భర్తకు బదిలీ చేసినట్లు హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయితే 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంపెనీ రికార్డుల ప్రకారం.. మాధాబీ ఇప్పటికీ భారతీయ కన్సల్టింగ్ సంస్థలో వాటాలను కలిగి ఉన్నారు. ఈ ఆదాయాలకు అదానీ గ్రూప్‌తో ఏదైనా సంబంధం ఉందో.. లేదో తేలాల్సి ఉంది.

ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని, అందుకు అన్ని రకాల మద్దతు అందిస్తామని ఫాక్స్ కాన్ సంస్థ చైర్మెన్ యాంగ్ లియూకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎంతో, ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకున్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులు వంటి పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్ర చైర్మెన్‌గా, మరో పారిశ్రామికవేత్త శ్రీనివాస రాజు వైస్ చైర్మెన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల సీఎం నేతృత్వంలోని బందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు యాంగ్ లియూకి వివరించారు.

ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని, త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని యాంగ్ లియూ తెలిపారు. ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సానుకూలంగా స్పందించారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. తన సందర్శన కంటే ముందు తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ ఇండియా ప్రతినిధి విలీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు. భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్) విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్‌పీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జొ వూ, చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సీఎస్‌సీజీ డిప్యూటీ జీఎం సూ షో కూ, సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్, సంస్థ ఇండియా ప్రతినిధి విలీ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారు పేరు కోట్ల విజయభాస్కర్ రెడ్డి : రేవంత్ రెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి నీతినిజాయితీలకు మారుపేరు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి కోట్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ చిత్రం ఆట్టమ్

ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం కార్తికేయ 2



జాతీయ ఉత్తమ నటుడు : రిషబ్ శెట్టి
జాతీయ ఉత్తమ దర్శకుడు : సూరజ్ బర్జాత్యా



జాతీయ ఉత్తమ నటి :
మానసి పరేఖ్, నిత్యామీనన్



ఉత్తమ కొరియోగ్రాఫర్ : జానీ మాస్టర్
ఉత్తమ నేపథ్య సంగీతం : ఏ.ఆర్.రెహ్మాన్

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా మలయాళ సినిమా 'ఆట్టమ్' ఎంపికైంది. ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' చిత్రానికిగాను రిషబ్‌శెట్టికి దక్కగా, ఉత్తమనటి పురస్కారానికి నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది.

ఇక జాతీయ ఉత్తమ దర్శకుడిగా 'ఉంచాయి' హిందీ చిత్రానికిగాను సూరజ్ బర్జాత్యాని వరించింది. జ్యూరీ అధ్యక్షుడు రాహుల్ రావిల్ శుక్రవారం న్యూఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల విజేతల వివరాలను ప్రకటించారు.

2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి నామినేషన్ అందాయి. 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను అనౌన్స్ చేసింది. అందులో తెలుగుకు సంబంధించి 20 చిత్రాలు ఉన్నాయి. కానీ ఒకే ఒక్క అవార్డ్ టాలీవుడ్‌కు రావడంతో, ప్రపంచవ్యాప్తంగా టాప్‌లో దూసుకెళుతోన్న తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఈ అవార్డులలో సరైన గుర్తింపు దక్కలేదంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



జాతీయ ఉత్తమ చిత్రం : ఆట్టమ్ (మలయాళం)


మనిషి నైజానికి ప్రతిబింబం

దర్శకుడు ఆనంద్ ఇకర్షి తెరకెక్కించిన మలయాళ చిత్రం 'ఆట్టమ్'. 13 మంది నాటక బృందంలో ఒకే ఒక మహిళ ఉంటుంది. ఆ బృందంలోని ఒకతను ఓ రోజు రాత్రి ఆమెను అసభ్యంగా తాకుతాడు. ఆ 12 మందిలో ఆమెతో తప్పుగా వ్యవహరించిన వ్యక్తి ఎవరు?, అతన్ని ఆమె ఎలా గుర్తించింది అనేదే ఈ చిత్రకథ. పైకి అందరితో మంచిగా ఉంటూనే సమయాన్ని బట్టి ఊసరవెల్లిలా రంగులు మార్చే మనిషి నైజానికి ప్రతిబింబంగా రూపొందిన 'ఆట్టమ్' జ్యూరీ సభ్యులను మెప్పించి జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది.

69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఆరు అవార్డులతో తెలుగు సినిమా విజయకేతనాన్ని ఎగుర వేసింది. అయితే 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో కేవలం ఒకే ఒక్క అవార్డుతో సరిపెట్టుకోవడం గమనార్హం. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్ 1' చిత్రం 4 విభాగాల్లో అవార్డులను గెల్చుకుంది.

70వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలు

ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం)
ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార – కన్నడ)
ఉత్తమ నటి:
నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం – తమిళం),
మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్ – గుజరాతీ)
ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా
(ఉంచాయి – హిందీ)
ఉత్తమ సహాయ నటుడు:
పవర్ రాజ్ మల్హోత్రా (ఫౌజా – హరియాన్వి)
ఉత్తమ సహాయ నటి:
నీనా గుప్తా (ఉంచాయి– హిందీ)
ఉత్తమ హోల్‌సమ్ ఎంటర్‌టైన్మెంట్: కాంతార (కన్నడ)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ సినిమా:
బ్రహ్మాస్త్ర – పార్ట్ 1: శివ (హిందీ)
బెస్ట్ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ :
బాంబే జయశ్రీ (చాయుమ్ వెయిల్),
సౌదీ వెల్లక్క సీసీ 225/2009
ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్ :
అర్జిత్ సింగ్ (కేసరియా) బ్రహ్మాస్త్ర– పార్ట్ 1
బెస్ట్ యాక్షన్ డైరక్షన్: అన్బరివు (కేజీయఫ్ 2)
బెస్ట్ కొరియోగ్రఫీ:
జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ తిరుచిత్రంబళం (తమిళం)
ఉత్తమ సంగీతం (పాటలు):
బ్రహ్మాస్త్ర: శివ (హిందీ) – ప్రీతమ్
ఉత్తమ సంగీతం (నేపథ్యం): ఏఆర్ రెహమాన్
పొన్నియిన్ సెల్వన్ – 1 (తమిళం)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (ఒడియా): దమన్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మలయాళం):
సౌది వెళ్లక్క సీసీ 225/2009
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మరాఠీ): వాల్వీ (ది టెర్మైట్)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (కన్నడ): కేజీయఫ్ 2
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (హిందీ) : గుల్‌మోహర్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (బెంగాలీ): కబేరి అంతర్దాన్
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తమిళం):
పొన్నియిన్ సెల్వన్ – 1
ఉత్తమ ప్రాంతీయ చిత్రం (పంజాబీ): బాగీ డి దీ
బెస్ట్ బుక్ ఆన్ సినిమా:
కిషోర్ కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)
రైటర్స్ :అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
బెస్ట్ క్రిటిక్ : దీపక్ దుహా



పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి మైల్ స్టోన్ మూమెంట్

'**కా**ర్తికేయ2' చిత్రానికి జాతీయ ప్రాంతీయ ఉత్తమ చిత్రంగా నేషనల్ అవార్డ్ రావడం మా పీపుల్స్ మీడియా సంస్థకు మైల్‌స్టోన్ మూమెంట్' అని అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్.

నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్స్ పై నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'కార్తికేయ2'. నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ,'కృష్ణ ఈజ్ ట్రూత్. ఈ రోజు మరోసారి ప్రూవ్ అయ్యింది. ఈ అవార్డ్ కృష్ణుడే తీసుకొచ్చారని భావిస్తున్నాను' అని తెలిపారు.



టీజీ విశ్వప్రసాద్, చందూ మొండేటి, అభిషేక్ అగర్వాల్

'కార్తికేయ2 అద్భుత విజయం సాధించినప్పుడు ఎంత హ్యాపీగా ఫీలయ్యామో ఇప్పుడు అదే ఫీలింగ్‌లో ఉన్నాం. నేషనల్ అవార్డ్ మరింత బాధ్యతని పెంచింది. కార్తికేయ3 ఖచ్చితంగా ఉంటుంది' అని డైరెక్టర్ చందూ మొండేటి చెప్పారు.

చాలా సంతోషంగా ఉంది

ఇప్పుడే ఓ అద్భుతమైన వార్త విన్నా. మా 'కార్తికేయ2' చిత్రానికి జాతీయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఇంత గొప్పగా సక్సెస్ కావడానికి, ఈ అవార్డు రావడానికి మీ టీమ్ ఎఫర్టే కారణం.

- హీరో నిఖిల్

ఆయ్‌ని

ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు



బన్నీ వాస్

నార్నే నితిన్, నయన్ సారికలు హీరో, హీరోయిన్లుగా జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా వచ్చిన చిత్రం 'ఆయ్'. ఈ సినిమాకు అంజి కే మణిపుత్ర దర్శకత్వం వహించారు. ఈనెల 15న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేశారు. ప్రేక్షకుల విశేష ఆదరణతో సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. అలాగే ప్రతి షోకి థియేటర్ల సంఖ్యనూ పెంచు కుంటోంది.ఈ సందర్భంగా నిర్మాత బన్నీ వాస్ మీడియాతో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- అనీల్ రావిపూడిగారి డైరెక్షన్ టీమ్‌లో డైరెక్టర్ అంజి చాలా సినిమాలకు వర్క్ చేశారు. ఈ కథని అంజి చెబుతున్నప్పుడు రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వాను. కూకట్‌పల్లి విశ్వనాథ్ థియేటర్‌లో సినిమా రిలీజ్ తర్వాత ఆడియెన్స్‌తో కలిసి చూస్తున్నప్పుడు నా ఎదురు సీట్‌లో ఉన్న వ్యక్తి నవ్వలేక లేచి నిలుచున్నాడు. అప్పుడర్థమైంది. నేను కథ విన్నప్పుడు ఏదైతే ఫీలయ్యానో అది నిజమైందనిపించింది.
- నేను కథ విన్నప్పుడు ఎలాగైతే ఎంజాయ్ చేశానో దాన్ని స్క్రీన్ పై చూసి ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. అప్పుడే గట్టిగా కొట్టేశామనిపించింది. ఫస్టాఫ్ చివరి అర్ధగంట థియేటర్స్‌లో ఒకటే నవ్వులు.
- సినిమా పక్కా ఎంటర్‌టైనర్. కథ కన్నా ఎంటర్‌టైన్మెంట్, గుడ్ మూమెంట్స్ అన్నీ ఉన్నాయి. అయితే ఈరోజున్న ట్రెండ్‌కి అవి మాత్రమే సరిపోవు. అమలాపురం వంటి ఏరియాలో సినిమాను చేసేటప్పుడు చిన్న క్లాస్ టచ్ ఉండాలని అందరం అనుకున్నాం. అందుకోసం వర్షం ఉంటే బావుంటుందని నిర్ణయించుకున్నాం. దాన్ని ఒక సబ్జెక్ట్‌గా యాడ్ చేసుకుంటూ వచ్చాం.
- ఆయ్ సినిమా వంటి ఎంటర్‌టైనర్‌ను చేసినప్పుడు మామూలుగా యూత్‌కు కనెక్ట్ అవుతుంది. ఓ జోనర్ ఆడియెన్స్‌కే కనెక్ట్ అయితే వారమో, రెండు వారాలో ఆడుతుంది. అదే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉండటం కోసం ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్ నుంచి ఎమోషనల్‌గా మార్చాం. దీంతో సినిమా అందరికీ కనెక్ట్ అయ్యింది. హీరో నార్నే నితిన్‌తో పాటు ఇందులో నటించిన ప్రతి పాత్ర అద్భుతంగా నటించింది.



జంబో జట్టుకు విజయోస్తు

పారిస్ బరిలో 84 మంది పారా అథ్లెట్లు

న్యూఢిల్లీ : పారిస్ 2024 పారాలింపిక్స్‌లో పోటీపడే భారత పారా అథ్లెట్లకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు పారిస్‌లో జరుగనున్న పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 84 మంది పారా క్రీడాకారులు పోటీపడనున్నారు. పారాలింపిక్స్‌లో భారత్ నుంచి తొలిసారి జంబో జట్టు బరిలో నిలిచింది. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కానోయింగ్, సైక్లింగ్, బ్లైండ్ జూడో, పవర్‌లిఫ్టింగ్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో సహా 12 క్రీడాంశాల్లో భారత పారా అథ్లెట్లు పతక వేట సాగించనున్నారు. క్రీడాంశాల షెడ్యూల్ ప్రకారం పారా అథ్లెట్లు పారిస్‌కు బయల్దేరనుండగా.. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పారా అథ్లెట్లకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) అధ్యక్షుడు దేవంద్ర, క్రీడా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. పారా అథ్లెట్ల విజయగాథలతో కూడిన 'బ్రేకింగ్ ది బారియర్స్' పుస్తకాన్ని క్రీడాశాఖ మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

'సవాళ్లను అవకాశాలుగా మలచుకుని విజయాలు సాధించటంలో మన పారా అథ్లెట్లు దిట్ట. పారిస్ పారాలింపిక్స్ సన్నద్ధతలో మనోళ్లు గొప్ప అంకితభావం, పట్టుదల చూపించారు. ఖేలో ఇండియా కార్యక్రమంతో ఎంతో మంది అథ్లెట్లకు ఆర్థికంగా సాయం అందింది. విశ్వక్రీడా వేదికపై రాణించేందుకు అవసరమైనా సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పారాలింపిక్స్‌లో పతకాలతో దేశం గర్వపడేలా చేయాలని ఆశిస్తున్నాను' అని క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. టోక్యో 2020 పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా 19 పతకాలు సాధించింది. పారిస్‌లో 84 మందితో బరిలోకి దిగుతున్న భారత్.. టోక్యో రికార్డును అధిగమించేందుకు రంగం సిద్ధం చేసుకుంది.

2028లో అదే మన లక్ష్యం

పారిస్ చెఫ్‌డీ మిషన్ గగన్ నారంగ్

న్యూఢిల్లీ : పారిస్ 2024 ఒలింపిక్స్ విజయవంతంగా ముగిశాయి. భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు 16 క్రీడాంశాల్లో పోటీపడ్డారు. ఓ సిల్వర్, ఐదు కాంస్య పతకాలు సహా భారత్ ఆరు మెడల్స్ సొంతం చేసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్రదర్శన, సాధించిన పతకాల పట్ల టీమ్ ఇండియా చెఫ్ డీ మిషన్ గగన్ నారంగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. పారిస్ నుంచి స్వదేశం చేరుకున్న గగన్ నారంగ్.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో భారత్ అనుసరించాల్సిన వ్యూహం, పారిస్ ఒలింపిక్స్‌లో మన అథ్లెట్ల ప్రదర్శన నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై త్వరలోనే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), భారత క్రీడామంత్రిత్వ శాఖకు నివేదికను అందజేయనున్నారు.

నిరోషన్‌పై నిషేధం

డోప్ పరీక్షలో దొరికిన క్రికెటర్



కొలంబో : శ్రీలంక క్రికెటర్ నిరోషన్ డిక్‌వెల్లాపై నిషేధం వేటు పడింది. డోపింగ్‌లో పట్టుబడిన నిరోషన్‌పై నిషేధం విధిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2024లో భాగంగా నిరోషన్ శాంపిల్స్ సేకరించారు. నిరోషన్ డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలటంతో.. అతడిపై తక్షణమే అమల్లోకి వచ్చేలా శ్రీలంక యాంటీ డోపింగ్ ఏజెన్సీ నిషేధం విధించింది. తదుపరి విచారణ కొనసాగే వరకు ఈ నిషేధం అమల్లో ఉండనుంది. 31 ఏండ్ల నిరోషన్ వివాదాలకు కొత్త కాదు. గతంలో ఎల్‌పీఎల్ 2021 సందర్భంగా బయో బబుల్ ప్రోటోకాల్‌ను సైతం ఉల్లంఘించాడు. జాతీయ జట్టులోనూ క్రమశిక్షణ పాటించకపోవటంతో విమర్శలు ఎదుర్కొన్నాడు. శ్రీలంక జాతీయ జట్టు తరఫున నిరోషన్ టెస్టులు, వన్డేలు, టీ20ల్లో ప్రాతినిథ్యం వహించాడు.

ఆఖర్లోనే ప్రజ్ఞానంద

గ్రాండ్ చెస్ టూర్ 2024



సెయింట్ లూయిస్ (యుఎస్‌ఏ) : భారత వర్ధమాన గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అంచనాలను అందుకోవటం లేదు. సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో చెన్నై చిన్నోడు ఆఖరు స్థానంలో కొనసాగుతున్నాడు. ర్యాపిడ్ విభాగం అనంతరం ఆఖరు స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద.. బ్లిట్జ్ పోటీల ఆరంభ రోజు పెద్దగా ఆకట్టుకోలేదు. 6.5 పాయింట్లతో పదో స్థానంలో కొనసాగుతున్నాడు. అలిరెజా (ఫ్రాన్స్) 17.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఇయాన్, వెస్లీలు 16 పాయింట్లతో వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచారు. హికారు నకమురు (13.5), ఫాబియానో (యుఎస్‌ఏ)లు ఆరు, ఏడు స్థానాలకు పరిమితం అయ్యారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886